


రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★



అమెరికా ఆధిపత్యంపై ప్రతిఘటన వేదికగా ఎస్‌సిఒ 06

త్వరలోనే పుతిన్‌తో చర్చలు 02
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన వెల్లడి

రానున్న 20 రోజుల్లో రోజుకు 10,000 మెట్రిక్ టన్నుల యూరియా 03




సంపుటి 08, సంచిక: 276 | శనివారం | 6-09-2025 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ధరణి దరిద్రాన్ని భూభారతితో తొలగిస్తాం

"గత పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా వారి సమస్య పరిష్కరించలేదు. రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. 'ధరణి' భూతాన్ని తెచ్చి భూములను కొల్లగొట్టాలని చూశారు.

● భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు తరిమేసారు ● నాటి పాలకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకునేందుకే విఆర్‌వో వ్యవస్థ రద్దు చేశారు ● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజం ● జిపిఒలకు నియామకపత్రాల అందజేత ● విఆర్‌ఎలు, విఆర్‌ఒలు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయాలని సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్

''భూమిని చెరబట్టిన వారిని తెలంగాణ ప్రజలు కనిపించకుండా పోయేంతవరకు తరిమారు. తెలంగాణ సాధనలో, ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వాములైన విఆర్‌ఓలు, విఆర్‌ఎలు ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా పనిచేయాలి. భూభారతి చట్టాలను అమలు చేయడమే కాకుండా సాదా బైనామాల సమస్య పరిష్కరించాలి. ఇది మీ ఆత్మ గౌరవానికి సంబంధించిన సమస్య. గత పాలకులు విఆర్‌ఓలు, విఆర్‌ఎలను తెలంగాణా సమాజంలో దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. మీ మీద పడ్డ మచ్చను చెరుపుకునే అవకాశం మీకు వచ్చింది. ఆ ముద్రను చెరిపేసి ఆనాటి పాలకుల తప్పుడు విధానాలను ప్రజలకు వివరించండి. విఆర్‌ఓలు, విఆర్‌ఎలపై చేసిన ఆరోపణలు తప్పు అని నిరూపించుకునేలా పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించండి'' అని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ధరణిని బంగాళాఖాతంలో విసిరేస్తామని ఆనాడు చెప్పాం. ఇచ్చిన మాట ప్రకారం ధరణి మహమ్మారిని వదిలించి భూ భారతి చట్టం తీసుకొచ్చాం. ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని భూభారతితో పరిష్కరించే ప్రయత్నం చేశాం' అని సిఎం చెప్పారు. హైదరాబాద్ హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన గ్రామ పాలనా అధికారులకు (జిపిఓలు) నియామక పత్రాలను అందజేసే 'కొలువుల పండుగ' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిఎం రేవంత్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అతిథులుగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ధనసరి తరువాయి 2లో

# రాష్ట్రానికి నూతన విద్యావిధానం కావాలి

● సమాజంలో రాణించాలంటే విద్య ఒక్కటే మార్గం ● టీచర్లను కుటుంబ పెద్దగా భావించాలి ● విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి ● ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం చేయాలి ● వీలున్నప్పుడు నేను వస్తా.. ● గత పదేళ్లలో విద్యాశాఖ అస్తవ్యస్తం ● గురుపూజోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉపాధ్యాయుల సేవలు ఎంతో అవసరమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు కూడా మధ్యాహ్న భోజనం చేయాలని, వీలునప్పుడు తాను కూడా వస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దామని, ఇందుకు అందరూ ప్రతిన బూనాలని ఉపాధ్యాయులకు సూచించారు. సింగపూర్ లాంటి ప్రపంచ దేశాల్లో అమలులో ఉన్న నాణ్యమైన, ఉన్నత విద్యావిధానాన్ని అధ్యయనం చేసేందుకు ప్రతి ఏటా రెండు వందల మంది టీచర్లను ఆయా దేశాలకు పంపిస్తామని సిఎం వెల్లడించారు. 'ఉపాధ్యాయ దినోత్సవ'ం తరువాయి 2లో



# భారత్, రష్యాకు దూరమయ్యాం

● ఆ రెండు దేశాలను చైనాకు కోల్పోయాం : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
● అమెరికా-భారత్ సంబంధాలు గత రెండు దశాబ్దాలలో అత్యంత దారుణంగా ఉన్నాయని వ్యాఖ్య

**వాషింగ్టన్ :** తమ నుంచి భారత్, రష్యా దేశాలను చైనా దేశానికి కోల్పోయినట్లు అనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికా–భారత్ సంబంధాలు గత రెండు దశాబ్దాలలో అత్యంత దారుణ దశలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ట్రంప్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో తరువాయి 12లో


## 22 నుంచి ఇందిరమ్మ చీరలు



03

# 'స్థానిక' ఎన్నికలు బ్యాలెట్‌తోనే..

● కేబినెట్ నిర్ణయాన్ని సమర్థించిన కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



**బెంగళూరు :** స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరిగి బ్యాలెట్ పేపర్‌కు వెళ్లాలనే నిర్ణయాన్ని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సమర్థించారు. అనుభవం ఆధారంగా తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో భవిష్యత్తులో జరిగే పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఇవిఎంలు) బదులుగా బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించి నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఇసి)కి సిఫార్సు చేయాలని గురువారం నిర్ణయించింది. బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించడమే తమ ఉద్దేశమని, అనుభవం ఆధారంగానే తిరిగి బ్యాలెట్ పేపర్ పద్ధతిని ప్రవేశపెట్టాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. అనేక దేశాలు ఇవిఎంల నుండి బ్యాలెట్ పేపర్‌కు తిరిగి వచ్చిన ఉదాహరణలు ఉన్నాయని శుక్రవారం మీడియా సమావేశంలో సిద్ధరామయ్య వెల్లడించారు. గురువారం తరువాయి 12లో

# నిమజ్జనానికి సర్వం సన్నద్ధం

● 48 గంటలు అధికార యంత్రాంగం అప్రమత్తం ● 303 కిలోమీటర్ల మార్గంలో శోభాయాత్ర ● 29 వేల మంది పోలీసులు, 3200 ట్రాఫిక్, 15000 మంది శానిటేషన్ సిబ్బంది నిమగ్నం ● హుస్సేన్‌సాగర్ వద్ద 40 క్రేన్‌లు ఏర్పాటు ● ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర ● హైదరాబాద్ మతసామరస్యానికి ప్రతీక.. సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆనందం.. ఆరాధన.. ఆచారం ఈ మూడింటిని కలిపిన పండుగ శిఖర ఘట్టం గణేష్ నిమజ్జనం. తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణేషుడు గంగమ్మ ఒడికి చేరేందుకు సిద్ధమయ్యాడు. హుస్సేన్ సాగర్ (ట్యాంక్‌బండ్)లో శనివారం జరిగే గణేష్ నిమ్జనానికి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. పోలీస్, రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, హెచ్‌ఎండిఎ, జల మండలి, ట్రాఫిక్ పోలీసు, ఆర్ అండ్ బి, హైడ్రా, వైద్య ఆరోగ్య, పర్యాటక, సమాచార శాఖలను రంగంలోకి దిగాయి. విధుల్లో ఉన్న అధికారులందరులకు 48 గంటల పాటు హై అలర్ట్ ప్రకటించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తులో 29 వేల మంది పోలీసులు, 3200 మంది ట్రాఫిక్ పోలీసులు పాల్గొంటున్నారని పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. ఇక 15000 మంది శానిటేషన్ సిబ్బంది నిమజ్జన విధుల్లో పాల్గొంటున్నారని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం కోసం 303 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో శోభాయాత్ర జరగనుంది. నిమజ్జనానికి సుమారు 50 వేలకు పైగా గణనాథులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నిమజ్జనం సాఫీగా సాగేందుకు ట్యాంక్‌బండ్‌పై 40 క్రేన్‌లను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఖైరతాబాద్ వినాయకుడు ఉదయం 6 గంటలకు నిమజ్జనానికి బయలుదేరి మధ్యాహ్నం సుమారు 2 గంటల ప్రాంతంలో బాహుబలి క్రేన్ నెంబర్ 4 వద్ద నిమజ్జనం చేస్తారు.

**72 కృత్రిమ కొలనుల ఏర్పాటు..**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో 20 ప్రధాన లేక్‌లతో పాటు జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 72 కృత్రిమ కొలనులలో నిమజ్జనం కోసం ఏర్పాట్లు తరువాయి 12లో



# ముంబయిలో హై అలర్ట్

● 34 వాహనాల్లో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని మెయిల్స్
● 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబాటు
● 400 కిలోల ఆర్‌డిఎక్స్‌తో భారీ పేలుళ్లు అంటూ బెదిరింపులు

**ముంబయి :** ముంబయికి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో కలకలం రేగింది. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యారు. 34 వాహనాల్లో మానవ బాంబులు నగరంలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. 'ముంబయిలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులను ఏర్పాటు చేశాం. వారి వద్ద 400 కిలోల ఆర్‌డిఎక్స్ ఉంది. ఇప్పుడు మేము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబయి నగరాన్ని కుదిపేస్తాయి' అని మెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. లష్కరే జిహాదీ అనే ఖాతా నుంచి తరువాయి 12లో

## మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థికంవైపు
# రాష్ట్రం వేగంగా పరుగులు

● యువ తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది ● రాష్ట్రాభివృద్ధికి ఐఎస్‌బి విద్యార్థులు సహకరించాలి ● మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ రైజింగ్ 2047, మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ' వైపు తెలంగాణ యువ రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)లో 'మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్'ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి ఐఎస్‌బి విద్యార్థులు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ఎవరు ఊహించని రీతిలో పెట్టుబడులు పెడుతోందని తరువాయి 12లో

# మంత్రి పదవి వద్దన్నా..

● ఈ ఐదేళ్లు రేవంత్‌రెడ్డే సిఎం ● కాళేశ్వరంపై దర్యాప్తు పక్కదారి పట్టేందుకే కవిత సస్పెన్షన్ డ్రామా ● టిపిసిసి చీఫ్ బి.మహేష్‌కుమార్ గౌడ్ ● రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ''కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకల విషయంలో సిబిఐ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాం. సిబిఐలో అనేక లొసుగులు ఉన్నాయి. అయితే సిబిఐ కంటే మరో మార్గం లేదు. సిబిఐతో కాకుండా రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుంది'' అని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. 'ఈ ఐదేళ్లు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోనే వచ్చే ఎన్నికలకు వెళ్తాం. భవిష్యత్‌లో బిసి సిఎం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం. మంత్రి పదవి ఇస్తామంటే వద్దని చెప్పాను' అని ఆయన చెప్పారు. సిఎల్‌పి తరువాయి 2లో


## శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

దేశం విడిచివెళ్లకుండా నిఘా

05




చలో చండీఘడ్




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)


(సిపిఐ రెండవ కాంగ్రెస్, కలకత్తా 1948 – 6వ పేజీలో)



# ప్రపంచం
WORLD NEWS

## అఫ్గాన్ భూకంప మృతుల సంఖ్య 2200లకు పైమాటే..
### తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి ప్రకటన



**కాబూల్:** అఫ్గానిస్థాన్‌లో గత వారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 2200లకుపైగానే ఉందని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనను అనుసరించి, భూకంపం కారణంగా వేలాది భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృత దేహాలు బయటపడుతున్నాయి. గత ఆదివారం రాత్రి అఫ్గాన్ తూర్పు ప్రాంతాల్లో సంభవించిన భూకంపం తీవ్రత రెక్టార్ స్కేల్‌పై 6మాగ్నిట్యూడ్‌గా రికార్డయింది. దీని కారణంగా వందలాది గ్రామాలు దెబ్బతిన్నాయి. కూలిన ఇళ్లు, బహుళ అంతస్తు భవనాల శిథిలాల కింద ఎంతో మంది చిక్కుకుపోయారు.

## చైనా, ఉత్తర కొరియా సంబంధాలు మరింత పటిష్ఠం




**బీజింగ్:** చైనా, ఉత్తర కొరియా ద్వైపాక్షిక సంబంధాలు మరింత పటిష్టపడ్డాయి. ఇరు దేశాలకు చెందిన అధికారిక వార్తా సంస్థలు శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జపాన్‌పై విజయం సాధించి80 సంత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ నెల 3వ తేదీన చైనా నిర్వహించిన మహా పరేడ్‌కు కొంత మంది ప్రపంచ దేశాల నాయకులతోపాటు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ కూడా హాజరయ్యారు. అనంతరం ఆయన చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు.

ఉత్తర కొరియాతో మైత్రీ సంబంధాలు మరింత పటిష్టపడుతున్నాయని, దశాబ్దాలుగా రెండు దేశాల మధ్య పరస్పర అవగాహన, సహకారం కొనసాగుతున్నాయని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను ఉటంకిస్తూ చైనా అధికారిక ప్రసార మాధ్యమం ‘సిసిటివి’ పేర్కొంది. ప్రపంచ వ్యాప్తంగా పరిస్థితులు ఏ విధమైన మారినా, ఉత్తర కొరియాతో సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండదని జిన్‌పింగ్ స్పష్టం చేసినట్టు తెలిపింది. ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ ‘కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ’ (కెసిఎన్ఎ) కూడా దాదాపు ఇలాంటి సమాచారాన్నే అందించింది. జిన్‌పింగ్, కిమ్ ఇద్దరూ తమతమ దేశాల ఉన్నతాధికారులు, కీలక నాయకులతో కూడిన బృందాలతో కలిసి చర్చల్లో పాల్గొన్నట్టు తెలిపింది. ఇలావుంటే, ఉత్తర కొరియాకు చైనా అత్యంత కీలకమైన వాణిజ్య భాగస్వామి. పలు రకాలుగా సహాయం కూడా చైనా నుంచి అందుతున్నది. అయితే, ఇటీవల కొద్దికాలంగా రష్యాకు అనుకూలంగా ఉత్తర కొరియా వ్యవహరిస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

ప్రత్యేకించి ఉక్రేన్‌పై యుద్ధానికి తమ దేశ సైనిక దళాలను కిమ్ పంపడం చర్చకు ఊతమిచ్చింది. అందుకు బదులుగా ఉత్తర కొరియాకు రష్యా ఆయుధాలు సరఫరా చేస్తున్నదని అంతర్జాతీయ మీడియా పేర్కొంటున్నది. బీజింగ్‌లో జరిగిన మీడియా సమావేశంలో కిమ్‌పై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించడాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించుకోవాలి. అయితే, చైనాను తమ వ్యూహాత్మక భాగస్వామిగా కిమ్ అభివర్ణించారు. రెండు దేశాల మధ్య మైత్రీ సంబంధాలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలావుంటే, పుతిన్, జిన్‌పింగ్, కిమ్ కలయిక పట్ల అమెరికా నుంచి అధిక టారిఫ్ సమస్యను, ఆంక్షలను ఎదుర్కొంటున్న దేశాలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి.

ఇప్పటికే అణ్వాయుధాల తయారీకి ప్రయత్నిస్తున్నదన్న ఆరోపణలపై ఉత్తర కొరియాపై అమెరికా పలు ఆంక్షలు విధించి, అమలు చేస్తున్నది. అదే విధంగా పలు దేశాలపై అదనపు సుంకాల భారాన్ని మోపుతున్నది. ఈ పరిస్థితుల్లో, ఆర్థిక స్థిరత్వం కోసం పలు దేశాలు రష్యా, చైనావైపు చూస్తున్నాయన్న అభిప్రాయం వినిపిస్తున్నది.

## త్వరలోనే పుతిన్‌తో చర్చలు
### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల సమావేశమైన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, త్వరలోనే మరోసారి ఆయనతో సమావేశమై చర్చలు జరుపుతానని తెలిపారు. అమెరికాలోని ప్రముఖ టెక్ సంస్థల అధిపతులు, సిఇఒలకు విందు ఇచ్చిన ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ, ఒక ప్రశ్న సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో తొలుత మాట్లాడతానని, ఆ తర్వాత పుతిన్‌తో చర్చిస్తానని వివరించారు.

వైట్‌హౌస్‌లో అమెరికా ప్రథమ హిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో ఎఐ ఈవెంట్‌ను నిర్వహించారు. అనంతరం జరిగిన విందుకు యాపిల్ సిఇఒ టిమ్‌కుక్, గూగుల్ సిఇఒ సుందర్‌పిచాయ్, మెటా సిఇఒ జుకర్‌బర్గ్, మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల తదితరులు హాజరయ్యారు. సాధారణంగా అమెరికా అధ్యక్ష స్థానంలో ఉన్న వారెవరూ అడగని రీతిలో ఎవరెవరు ఎంతెంత మొత్తాలను అమెరికాలో పెట్టుబడులు పెడతారో చెప్పాలని అడిగారు.

అమెరికా దిగ్గజ టెక్ సంస్థలు ఇప్పటి వరకూ వివిధ దేశాల్లో పెట్టుబడులు పెట్టాయని, ఇప్పుడు స్వదేశంవైపు చూడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ట్రంప్ ప్రశ్నకు స్పందించిన టిమ్ కుక్ అమెరికాలో 600 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడతామని పేర్కొన్నారు.

జుకర్‌బర్గ్ కూడా అంతే మొత్తాన్ని ప్రకటించగా, సుందర్ పిచాయ్ 250 బిలియన్ డాలర్లు, సత్య నాదెళ్ల 80 బిలియన్ డాలర్ల చొప్పున తమతమ కంపెనీల తరపున పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించారు. అది అద్భుతమైన స్పందనగా పేర్కొన్న ట్రంప్, ఈ భారీ పెట్టుబడుతలతో అమెరికాలో పెద్దఎత్తున ఉద్యోగాల సృష్టి జరుగుతుందని వ్యాఖ్యానించారు.

ఇలావుంటే, నిన్నమొన్నటి వరకూ టెస్లా అధినేత, ప్రపంచ ధనవంతుడు ఎలాన్ మస్క్‌తో చెట్టపట్టాలేసుకు తిరిగిన ట్రంప్ ఆ తర్వాత విభేదాల కారణంగా అతనికి దూరమయ్యారు. దేశంలోని దిగ్గజ టెక్ కంపెనీ కీలక అధికారులకు ఇచ్చిన విందుకు మస్క్‌ను ఆహ్వానించకపోవడం ఇప్పుడు అంతటా చర్చనీయాంశమైంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌తో కలిసే ఉన్న మస్క్, ఆ తర్వాత అత్యంత కీలకంగా పేర్కొన్న ‘డోజ్’ శాఖ బాధ్యతలు నిర్వర్తించారు. కానీ, ఆ తర్వాత విభేదాలతో విడిపోయారు. కాగా, మస్క్‌ను కాదనుకున్న ట్రంప్, తాజా విందుకు అతని ప్రత్యర్థి, ఓపెన్ ఎఐ ఇసిఒ శామ్ అల్ట్‌మన్‌ను ఆహ్వానించడం ఆసక్తిని రేపుతున్నది.

## శ్రీలంకలో లోయలోపడిన మినీ బస్సు
### 15 మంది మృతి



**కొలంబో:** శ్రీలంకలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో 15 మంది మృతి చెందగా, 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. అధికారులు వెల్లడించిన ప్రాథమిక సమాచారం మేరకు, ఎల్లావెల్లవాయ ప్రధాన రహదారిపై24వ కిలోమీటర్ మూల మలుపు వద్ద ఓ మినీ బస్సు అదుపుతప్పి 500 మీటర్ల లోతుగల లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని, గాయపడిన వారిని బదుళ్ల ఆసుపత్రికి తరలించారు. వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. కాగా, మృతుల్లో ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. ఎల్లాలో విహారయాత్రకు వెళ్లిన మున్సిపల్ కౌన్సిల్ ఉద్యోగులు తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బస్సు డ్రైవర్ అతి వేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. దర్యాప్తు చేపట్టామని, వివరాలు త్వరలోనే వెల్లడవుతాయని అధికారులు ప్రకటించారు.

## ఇయుపై చైనా యాంటీడంపింగ్ సుంకాలు



**బీజింగ్:**యూరోపియన్ యూనియన్ (ఇయు) నుండి పంది మాంసం దిగుమతులపై 62.4 శాతం వరకు తాత్కాలిక యాంటీడంపింగ్ సుంకాలను విధిస్తున్నట్లు చైనా శుక్రవారం ప్రకటించింది, దీనితో ఇయు ఆర్థిక కూటమిలో బీజింగ్, మిగతా 27 దేశాల మధ్య వాణిజ్య వివాదం తీవ్రమైంది. ఉత్పత్తి ధర కంటే తక్కువ లేదా ఎగుమతి చేసే దేశంలో, అక్కడి స్థానిక మార్కెట్‌లో వసూలు చేసే ధర కంటే తక్కువ ధరకు మార్కెట్లో వస్తువులను విక్రయించే పద్ధతిని ప్రస్తావిస్తూ, యూరప్ పంది మాంసం, పంది ఉప ఉత్పత్తులను చైనా మార్కెట్‌లో డంప్ చేస్తోందని చైనా వ్యాఖ్యానించింది. అందుకే, ప్రాథమిక నిర్ణయం తీసుకున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఇయు ఉత్పత్తి చేసే పంది మాంసం ధరలు తమ దేశ మాంస పరిశ్రమకు గణనీయమైనసష్టా న్ని కలిగిస్తున్నాయని పేర్కొం ది. 15.6శాతం నుండి 62.4 శాతానికి పెంచిన సుంకాలు ఈనెల 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. గత ఏడాది జూన్‌లో, చైనా తయారీ ఎలక్ట్రిక్ వాహనాలపై ఇయు తాత్కాలిక సుంకాలను విధించింది. ఆ తర్వాత కొద్దిరోజులకే చైనా ఇయు పంది మాంసం దిగుమతులపై దర్యాప్తు ప్రారంభించింది. అనంతరం యూరోపియన్ బ్రాందీపై, ముఖ్యంగా ఫ్రాన్స్‌లో ఉత్పత్తి చేసే కాగ్నాక్‌పై చైనా యాంటీడంపింగ్ సుంకాలను విధించింది. అయినప్పటికీ ప్రధాన బ్రాందీ ఉత్పత్తిదారులకు మినహాయింపులు లభించాయి.

## పార్లమెంటులో బల నిరూపణ
### థాయిలాండ్ ప్రధానిగా అనుతిన్ త్వరలో ప్రమాణం



**బ్యాంకాక్:** థాయిలాండ్ తదుపరి ప్రధానమంత్రిగా నియమితుడయ్యేందుకు శుక్రవారం పార్లమెంటులో జరిగిన ఓటింగ్‌లో, భూమ్‌జైతై పార్టీకి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు అనుతిన్ చార్న్‌విరాకుల్ తన బలాన్ని నిరూపించుకున్నారు. ఓటింగ్‌లో ఆయన విజయం సాధించారని టెలివిజన్‌లో ప్రత్యక్ష ప్రసారమైన అనధికారిక రన్నింగ్ లెక్కింపు ప్రకారం తెలిసింది. పార్లమెంటులో మొత్తం 492 మంది క్రియాశీల సభ్యులు ఉండగా, కనీస మెజారిటీ 247. అనుతిన్ ఇంతకంటే ఎక్కువ ఓట్లు సంపాదించుకున్నట్టు అధికారిక ప్రకటన పేర్కొంది. అతనికి వచ్చిన ఓట్లను ధ్రువీకరించిన తర్వాత, ప్రతిపాదనను థాయ్ రాజు మహా వజిరాలాంగ్‌కార్న్‌కు పంపిస్తారు. ఆయన నుంచి అధికారిక నియామక పత్రాలను పొందిన వెంటనే అనుతిన్ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపడతారు. ప్రధానిగా ఉన్న పేటోంగ్‌టార్న్ షినవత్రాపర అవినీతికి పాల్పడ్డారని, పొరుగున ఉన్న కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హున్ సేన్‌తో రాజకీయంగా రాజీపడిన ఫోన్ కాల్ విషయంలో నైతిక ఉల్లంఘనలకు ఒడిగట్టారని కోర్టు నిర్ధారించింది. అతనిని ప్రధాని పదవి నుంచి తొలగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు షినవత్రాపర రాజీనామా చేయగా, ఆయన స్థానంలో నూతన ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. పేటోంగ్‌టార్న్ కేబినెట్‌లో మంత్రిగా ఉన్న అనుతిన్ పార్లమెంటులో బలాన్ని నిరూపించుకున్నారు.

## భూభారతితో తొలగిస్తాం (మొదటి పేజీ తరువాయి)

అనసూయ సీతక్క, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ గత పదేళ్ల బిఆరెస్ పాలనలో ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నా వారి సమస్య పరిష్కరించలేదని, రెవెన్యూ శాఖ సిబ్బందిని దొంగలుగా, దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ‘గత ప్రభుత్వంలో ‘ధరణి’ భూతాన్ని తెచ్చి భూములను కొల్లగొట్టాలని చూశారు. తమ దోపిడీకి విఆర్‌ఓ, విఆర్ఎలు అడ్డుగా ఉన్నారని వారిని దోషులుగా నిలబెట్టే ప్రయత్నం చేశారు. వారిని దోపిడీదారులుగా చిత్రీకరించారు. ధరణి తెచ్చిన సమస్యలతో విసిగిపోయిన ఓ రైతు ఇబ్రహీంపట్నంలో అధికారిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు.

సిరిసిల్లలో అధికారులపై తాళి బొట్టు విసిరిన పరిస్థితి. ఇది అధికారుల వల్ల జరగలేదు. ఇది నాటి పాలకులు సృష్టించిన వైరస్. ప్రభుత్వానికి పేద ప్రజలకు విఆర్‌ఓలు, విఆర్ఎలు వారధులుగా నిలవాలని, పేద ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వారిని తిరిగి నియమించామన్నారు. ‘ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టుకుంటామా. ఎవరో కొందరు తప్పులు చేశారని మొత్తం వ్యవస్థనే రద్దు చేస్తారా? అప్పటి పాలకులు చేసిన తప్పులు కప్పిపుచ్చుకోవడానికే విఆర్‌ఓ, విఆర్ఎ వ్యవస్థను రద్దు చేశారు’ సిఎం అన్నారు.

**ఎన్నికల్లో చెప్పాం–... గ్రామ సుపరిపాలనను తెచ్చాం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో



ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన వెంటనే గ్రామ సుపరిపాలనపై దృష్టి సారించి గ్రామాధికారుల నియామకానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

గత ప్రభుత్వం 2020 ఆర్ఓఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ సమాజం తీవ్రంగా నష్టపోయిందన్నారు. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపేసి భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. గత ప్రభుత్వంలో సాదాబైనామాలపై సుమారు 9.26 లక్షల దరఖాస్తులకు మోక్షం కలగలేదని, పైగా కోర్టులలో కేసులు నమోదయ్యాయని తెలిపారు.

తాజాగా నిర్వహించిన సదస్సులలో సుమారు 8.65 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం తరపున మరింత గట్టిగా కృషి చేసి వారం రోజుల కింద కోర్టులో సాదాబైనామాలపై స్టేను తొలగించేలా ప్రయత్నించి సఫలమయ్యామన్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులు, ప్రస్తుత తాజా దరఖాస్తులన్నింటినీ సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో 6860 క్లస్టర్లను ఏర్పాటు చేసి 10,954 రెవెన్యూ గ్రామాలలో గ్రామపరిపాలనాధికారుల నియామకం చేపడుతున్నామని వివరించారు.

సర్వేయర్ల నియామకం ద్వారా భూ సమస్యలకు చెక్ పెడతామన్నారు. ప్రస్తుతం ఉన్న 318 మంది సర్వేయర్లుకు అదనంగా 800 మందిని నియమించడమే కాకుండా 7000 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను వచ్చే ఉగాదిలోగా భర్తీ చేస్తామని మంత్రి ప్రకటించారు. సుమారు 3 దశాబ్దాలుగా వివిధ ప్రాజెక్టులకు జరిగిన భూ సేకరణలో ఇంకా రైతుల పేర్లు పహనీలో ఉండిపోయాయని, ఈ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీనాటికి అన్ని గ్రామాల వారీగా జమాబందీ మేరకు అప్పటివరకు జరిగిన క్రయవిక్రయాలను హక్కులను వివరించేలా ప్రకటన జారీ చేస్తామన్నారు. దీని ప్రతులను ప్రతి రెవెన్యూగ్రామంలో అందుబాటులో ఉంచుతా మన్నారు.

## మంత్రి పదవి వద్దన్నా..
(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు పక్కదారి పట్టించేందుకు కెసిఆర్ కుటుంబం ఎంఎల్‌సి కవిత సస్పెన్షన్ డ్రామా చేస్తున్నారని అనిపిస్తోందని అన్నారు. ప్రజలను నమ్మించే అలవాటు కెసిఆర్ కుటుంబానికి ఉందన్నారు. అవినీతి మరకలు ఉన్న వాళ్ళని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోబోమని, కవితని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోబోమని, ఎఐసిసి ఆదేశం లేకుండా ఇంత స్పష్టంగా చెప్తానా ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు, సంతోష్‌రావు ఎలా దోచుకున్నారో కవిత వెల్లడించి ఒక మంచి పని చేశారన్నారు. ధనం, పవర్ కోసమే కవిత కెటిఆర్ పంచాయితీ అని, కవిత ఇప్పుడు మాట్లాడుతున్న విషయాలు ఏనాడో మాట్లాడితే సెల్యూట్ చేసే వాళ్లమన్నారు. బిసి బిడ్డలకు నోటి దాకా వచ్చిన ముద్దను తినకుండా చేసింది కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లేనన్నారు. వారం పది రోజుల్లో పార్టీలోని అన్ని కమిటీలు వేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే వచ్చే నెలలో కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తామని ఆయన వెల్లడించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నామని, ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను కోరామన్నారు. పాదయాత్రకు మంచి స్పందన వస్తోందని, క్రమశిక్షణ విషయంలో నిక్కచ్చిగా వెళ్లగలిగామన్నారు. కాంగ్రెస్ పార్టీలో బ్రేకులే కాదు సడెన్ బ్రేకులు కూడా ఉంటాయని, ఎంఎల్ఎ రాజ్ గోపాల్ రెడ్డి విషయంలో కొంత అయోమయ పరిస్థితి ఉందని, ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కోమటిరెడ్డి బ్రదర్స్‌కు అలవాటన్నారు. తనకు కులమంటే అభిమానమే కానీ కుల పిచ్చిలేదని, బిసి లు కొన్ని రోజులు కులాన్ని పక్కన పెట్టాలన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ప్రస్తుత ఎంఎల్ఎ నాగేందర్ రాజీనామా చేసి పోటీ చేస్తానని చెబుతున్నారని, ఆయన సభ్యత్వం పోతుందని అనుకోవడంలేదన్నారు.

## విద్యావిధానం కావాలి (మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ శిల్పకళావేదికలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవం కార్యక్రమంలో సిఎం హాజరయ్యారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సిఎం సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి సిఎం సహపంక్తి భోజనం చేశారు.



అంతకుముందుకు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి విద్యాపాలసీ లేదని, తెలంగాణకు నూతన పాలసీ కావాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని సిఎం ఆకాంక్షించారు. పేదవాళ్లు బాగు పడాలంటే,సమాజాంలో రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని అన్నారు. టీచర్లు అంటే ఒక కుటుంబ పెద్దగా భావించాలని, 50 శాతం పేద పిల్లల బాధ్యత టీచర్ల వద్దనే ఉన్నదని, విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహించాలని అన్నారు. పదేళ్ల కాలంలో గురుపూజోత్సవ కార్యక్రమాలు జరిగాయా?, ఈ కార్యక్రమాలకు సిఎం ఎప్పుడైనా హాజరయ్యారా అని ప్రశ్నించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల నుంచే వచ్చానని, టీచర్లను చిన్నచూపు చూసే సంస్కృతి తమ ప్రభుత్వానికి లేదన్నారు. రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులు చదువు కుంటున్నారని, 11 వేల ప్రైవేటు పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువు కుంటున్నారని వివరించారు. ప్రైవేటు స్కూల్స్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే అత్యధికంగా విద్యాధికుల ఉపాధ్యాయులు ఉంటారని, వారికి సమాజం పట్ల అవగాహన ఉంటుందని, సామాజిక బాధ్యత కలిగి ఉంటారని సిఎం పునరుద్ఘాటించారు.

టీచర్లకు జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదని, అటెండర్, ఆయాలు ఉండాల్సిందేనని, మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ‘అమ్మ ఆదర్శ పాఠశాల’ల పేరుతో స్వయం సహాయక సంఘాలకు పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని, పాఠశాలల నిర్వహణకు ప్రతి ఏటా రూ 130 కోట్ల నిధులను మంజూరు చేస్తున్నామని సిఎం వివరించారు. చదవు ఒక్కటే పేదల, తెలంగాణ రాష్ట్ర తల రాతను మారుస్తుందందని అన్నారు. గత కంటే ఒయు ర్యాంక్ పెరిగిందన్నారు. విశ్వవిద్యాలయాలకు విసిలను నియమించేందుకు గత ప్రభుత్వానికి తీరిక లేకుండేనని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం మెరిట్, సామాజిక న్యాయం ఆధారంగా విసిలను నియమించామని సిఎం అన్నారు.

ఢిల్లీలో విద్యావిధానంలో తీసుకొచ్చిన మార్పుల వల్లనే కేజ్రీవాల్ సిఎంగా మూడు సార్లు గెలుపొందారని సిఎం గుర్తు చేశారు. తాను కూడా రెండవ సారి గెలువాలని అనుకుంటున్నానని, అందుకు ఉపాధ్యాయులే కాదని,తాను కూడా పని చేస్తానన్నారు. దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.

**పదేళ్ల కాలంలో విద్య అస్తవ్యస్తం**

పదేళ్లలో విద్యాశాఖ అస్తవ్యస్తమైందని, కెజి నుంచి పిజి ఉచిత విద్య అందిస్తామని చెప్పి పదేళ్లు గడిచినప్పటికీ, ప్రస్తుతం ఆ విధానం అమలులో ఉన్నదా?, లేదా ఆలోచించుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ పల్లెకు జై తెలంగాణ నినాదాన్ని చేరవేసిందే ఉపాధ్యాయులని, బడికి వచ్చే పిల్లలనే కాదని, వారి తల్లిదండ్రులను కూడా ప్రభావితం చేసి తెలంగాణ ఉద్యమం వైపు నడిపించిందే ఉపాధ్యాయులని సిఎం గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు, తెలంగాణ రాష్ట్రంలో వారికి సంబంధించిన ఎన్ని సమస్యలను పరిష్కరించుకున్నారో ఒక విశ్లేషించుకోవాలన్నారు.

**పదేళ్లలో టీచర్ల బదిలీలు, నియామకాలే జరగలేదు..**

పదేళ్లకాలంలో రాష్ట్రంలో టీచర్ల బదిలీలు జరగలేదని, 2017 నుంచి టీచర్ల నియామకాలు కూడా జరగలేదని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి చేశామన్నారు. డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్న ఆలోచన ఆనాటి పాలకులకు రాలేదని, ధనిక రాష్ట్రంలో ఎందుకు కాస్మోటిక్ ,డైట్ చార్జీలను పెంచలేదని, ఆ దిశగా ఎందుకు ఆ పాలకులు ఆలోచన చేయలేదని ప్రశ్నించారు. విద్యను సంపూర్ణంగ నిర్లక్ష్యంగా చేసి ప్రజాప్రతినిధులే ప్రైవేటు సంస్థలను పెట్టుకుని విద్యను లాభసాటి వ్యాపారంగా మార్చుకుని, ఆధిపత్యం చెలాయించాలని ఆనాటి పాలకులు ప్రయత్నించారని సిఎం ఆరోపించారు.

**యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేశారు...**

ప్రొఫెసర్లను నియమించకుండా యూనివర్సిటీలను నిర్వీర్యం చేశారని, ఇంటర్ విద్య అవసరమే లేదనే తరహా నిర్లక్ష్యంగా వ్యవహారించారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రొఫెసర్లు రిటైర్‌మెంట్ పెంచే ఆలోచన చేయలేదని, కొత్త నియామకాలు జరగలేదని, మరోవైపు ఉన్నవారు రిటైర్డ్ అవుతుంటే యూనివర్సిటీలు ఎందుకు ఉపయోగపడకుండా, ప్రపంచానికే సేవలను అందించిన ఒయు లాంటి యూనివర్సిటీ కూడా మూతపడే పరిస్థితి వచ్చిందని, దేశానికే గొప్ప ఇజనీర్లను అందించిన కాకతీయ విశ్వవిద్యాలయం కాలగర్భంలో కలిసిపోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు ఎప్పుడు వచ్చినా వారి సమస్యలు విని, పరిష్కరించేందుకు ప్రయత్నం చేశామని, ఎక్కడైనా కొంత ఆలస్యం కావొచ్చని, కానీ సమస్యను పరిష్కరించకుండా ఉండలేదని, పని ఆగిపోలేదని చెప్పారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన 3 లక్షల మంది విద్యార్థుల సంఖ్య**

గతంలో ప్రతీ ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గేదని, ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 3లక్షలకు పెరిగిందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉన్నదని వారిని అభినంధించారు. 2 నుంచి 3 శాతం జరిగే తప్పిదాలే విద్యాశాఖకు మచ్చను తీసు కొస్తాయన్నారు. పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులకు శ్రద్ధ పెరిగిందన్నారు.నాణ్యమైన విద్యను, విద్యార్థుల్లో పట్టుదలను నేర్పించినందుకే సౌత్ కోరియా, జర్మనీ, చైనా లాంటి దేశాలు అభివృద్ధి చెందేందుకు కారణమని అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా మన విద్యార్థులను తీర్చిదిద్దుద్దాలన్నారు.

**డ్రగ్స్ బారిన పడకుండా చూడాలి**

విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి తప్పుదారిలో పడకుండా చూడాల్సిన బాధ్యత తమపైన ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. కొందరు ఇంజనీర్ చదివిన విద్యార్థులు కూడా తప్పుదోవ పట్టి, డ్రగ్స్ భారినపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుదోవ పట్టినవారిని గాడిలో పెట్టాలని సూచించారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ‘ఈగల్ ఫోర్స్’ను తీసుకొచ్చామని గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తే తెలంగాణ భవిష్యత్తు అని, ఆ భవిష్యత్తును ‘మీ’ చేతుల్లో పెడుతున్నానని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తెలంగాణలో 'మెడికల్ ఎక్విప్‌మెంట్ 'యూనిట్ ఏర్పాటుకు జర్మనీ ఆసక్తి

సిఎంను కలిసిన జర్మనీ కంపెనీ ప్రతినిధి బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జర్మనీకి చెందిన బెబిగ్ మెడికల్ కంపెనీ చైర్మన్, సిఇఒ జార్జ్ చాన్ ప్రతినిధి బృందం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ ఎక్విప్‌మెంట్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించేందుకు జర్మనీ కంపెనీ ఆసక్తి చూపింది. దీనికి సంబంధించి అనువైన స్థలాన్ని, ఇతర వాటికి సంబంధించిన అంశాలపైన అధ్యయనం చేసి రిపోర్టును అందించాలని అధికారులకు సిఎం సూచించారు.








## 22 నుంచి ఇందిరమ్మ చీరలు

మహిళకు రెండు చొప్పున పంపిణీ

రేవంతన్న బతుకమ్మ కానుక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనుంది. రాష్ట్రంలోని ప్రతి మహిళకు రెండు ఇందిరమ్మ చీరలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెలంగాణ ఆడబిడ్డలకు మీ రేవంతన్న బతుకమ్మ కానుక పేరుతో ముద్రించిన ప్లాస్టిక్ బ్యాగులో చీరలను పెట్టారు. ఒక్కొక్కటి రూ.800 విలువ చేసే రెండు నాణ్యమైన చీరలను ప్రభుత్వం అందించనుంది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల చీరల పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందింది. ఈ పథకం ద్వారా 6000 మందికి పైగా చేనేత కార్మికులకు ఉపాధి కల్పించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## న్యాక్ ట్రైనర్ స్నేహలతకు 'జాతీయ టీచర్స్ అవార్డు'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టీచర్స్ డే పురస్కరించుకుని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఎసి) ట్రైనర్ స్నేహలతకు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ అవార్డు అందుకోవడం పట్ల రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఎంటర్‌ప్రైనర్‌షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్నేహలత న్యూఢిల్లీలో శుక్రవారం 'జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు' అందుకున్నారు. దీంతో ఆమెకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఫోన్ చేసి ప్రత్యేకంగా అభినందించారు. న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా స్నేహలతకు అవార్డు దక్కిందని మంత్రి కొనియాడారు. దేశ వ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమన్నారు. కాగా స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్ (డిజి),ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిఎస్ వికాస్‌రాజ్ కూడా అభినంధించారు.



## అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటి

మంత్రి ఉత్తమ్- రాయబారి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న నగరాలలో హైదరాబాద్ ఒకటని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు అన్నిరకాలుగా అనుకూల వాతావరణం ఉంటుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్ హైదరాబాద్‌లో మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డితో శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య, పారిశ్రామిక రంగంలో రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలు మరింత బలపడాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. గ్లోబల్ సిటీగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర విశిష్టతను, ఐ.టి రంగంలో దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరంలో ఇక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఆధునిక వసతులు,ఫార్మా రంగంలో పురోగతిని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచం నలుమూలల నుండి పారిశ్రామిక వేత్తలు తరలివస్తున్నారని, డెన్మార్క్ లాంటి దేశం కుడా ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టేన్సన్‌ను ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు.

## సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించడంలో ప్రభుత్వం విఫలం

కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు, కొనసాగించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు శుక్రవారం బిఆర్‌ఎస్‌లో చేరారు.ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ.20వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ.20వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారి తీస్తోందన్నారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. ఎంపిటిసిల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపిపి కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు బిఆర్‌ఎస్‌లో చేరారు.

## రానున్న 20 రోజుల్లో రోజుకు
# 10,000 మెట్రిక్ టన్నుల యూరియా

మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న 20 రోజుల్లో 2లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా పెరుగుతున్న నేపథ్యంలో రైతువేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో యూరియా పరిస్థితులను కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందిస్తూ తూర్పు తీరంలోని వివిధ నౌకాశ్రయాలకు రానున్న నాలుగు దిగుమతి నౌకల నుండి తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించినట్టు మంత్రి తుమ్మల వివరించారు. దిగుమతి సరఫరా కాకుండా, ఆర్‌ఎఫ్‌సిఎల్ మూత పడటంతో దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30,000 మెట్రిక్ టన్నుల యూరియాను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించేందుకు కేంద్రం అంగీకరించిందని, తద్వారా తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉంటుందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. రామగుండం ఆర్‌ఎఫ్‌సిఎల్ ఎరువుల కర్మాగారం నిలిచిపోయిన కారణంగా రాష్ట్ర రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోనికి తీసుకుని వెంటనే ఉత్పత్తి ఆరంభించాలని కేంద్ర మంత్రులను కోరామని, దీనిపై కేంద్రం స్పందిస్తూ మూడు,నాలుగు రోజుల్లో యూనిట్‌ను తిరిగి ప్రారంభించేలా చర్యలు చేపడతామని హామీనిచ్చిందని తుమ్మల వివరించారు.

రాష్ట్రానికి జిఎస్‌ఎఫ్‌సి, ఐపిఎల్, సిఐఎల్ కాకినాడ కంపెనీల ద్వారా 11,181 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రంలోని రైల్వే రేక్ పాయింట్లయిన కరీంనగర్, మిర్యాలగూడ, వరంగల్, పెద్దపల్లి ప్రాంతాలకు చేరిందని, శనివారం మరో 9,039 మెట్రిక్ టన్నులు ఎంఎఫ్ఎల్, క్రిబికో,సిఐఎల్ కృష్ణపట్నం కంపెనీల నుండి వరంగల్, సనత్‌నగర్, కరీంనగర్ రైల్వే రేక్ పాయింట్లకు చేరనున్నాయని మంత్రి వివరించారు.

సెప్టెంబర్ నెలలో కేవలం నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని, గత సంవత్సరం ఇదే సమయానికి 7,75,157 మెట్రిక్ టన్నుల అమ్మకాలు మాత్రమే జరిగాయని తుమ్మల స్పష్టం చేశారు. వచ్చే 20 రోజుల్లో రోజుకు కనీసం 10,000 మెట్రిక్ టన్నుల చొప్పున 2 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయాలన్నారు.

రాష్ట్రంలో ఎరువుల కొరత లేకుండా రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

మండలానికి ఒకటి లేదా రెండు పిఎసిఎస్‌లు ఉన్న ప్రాంతాలలో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లను జారీ చేసి, రైతులకు ఎరువులు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, విజిలెన్స్ విభాగాలతో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

## తల్లిదండ్రులు జన్మనిస్తే..
# గురువులు జీవితాన్ని ఇస్తారు

స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు జీవితాన్ని ఇస్తారని, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశనికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయుడుగా జీవితాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత స్థానమైన రాష్ట్రపతి పదవిని అలంకరించే దివంగత రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ తల్లిదండ్రుల తరువాత స్థానం గురువులదేనని అందరికీ మార్గదర్శకులు గురువులు అన్నారు. ఏదేశ భవిష్యత్తు అయినా తరగతి గదిలోనే ఉంటుందన్నారు. ఒక ఇంజనీర్ ప్రాజెక్టులు నిర్మిస్తాడు, సైంటిస్ట్ రాకెట్లు తయారు చేస్తాడు, డాక్టర్ వైద్యం చేస్తాడు. కానీ వీరందరినీ తయారుచేసేది ఉపాధ్యాయులని, గురువుకు సమాజ నిర్మాతలు, మార్గదర్శకులు ఉపాధ్యాయులు, విద్యార్థి జీవితాన్ని మలుపుతిప్పేది ఉపాధ్యాయులే అని తెలిపారు. కలెక్టర్ ఎస్‌పి ఉన్నతాధికారులందరమూ కూడా ఒకనాడు విద్యార్థులమే, మాకు చిన్నప్పుడు విద్య నేర్పిన గురువుల వలనే జ్ఞానం విలువలు, మెరుగైన సమాజం ఉండాలంటే నాణ్యమైన విద్య ఉండాలి, విద్య వచ్చినవారికి సమాజంలో మంచి గౌరవం ఉంటుందని, వారికి ధనం, సమాజంలో విద్యావేత్తలకే ఎక్కువ గౌరవం ఉంటుందని, అలాంటి విద్యావేత్తలను తయారు చేసేది గురువులు అని అన్నారు. రాష్ట ప్రభుత్వ వికారాబాద్ జిల్లాలో యువతకు శిక్షణ ఇవ్వడానికి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సహకారంతో రాష్ట్రంలో ఐటిఐలను చేర్చడం జరిగింది అని తెలిపారు. ముఖ్యమంత్రి విద్యారంగం అభివృద్ధికి,పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుంది మౌలిక సదుపాయలు కల్పించడానికి కృషి చేస్తుంది అని అన్నారు. విద్యార్థులు జీవితంలో అత్యున్నత శిఖరాలకు ఎదగడం విద్యార్థుల బాధ్యత, విద్యార్థులు క్రమశిక్షణతో మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థితికి చేరాలనికోరారు. వికారాబాద్ జిల్లాను ఉపాధ్యాయులు కష్టపడి వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలను తీసుకురావాలని కోరారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన అధ్యాపకులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదేన్నారు. ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 50మందికి సన్మానం, అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు. రాష్ట ప్రభుత్వం విద్యాకు పెద్ద పీట వేసిందన్నారు. సమజంలో మార్పులకు ఉపాధ్యాయులే ముఖ్యమని ఈ సందర్భంగా అందరికీ అభినందనలు తెలిపారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన ఉపాధ్యాయులను ప్రశంసాపత్రం అందజేసి శాలువా,జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండానే
# మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు

ఎఐటియుసి బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్స్ హమాలీ, దడువాయి, చాట, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను పార్లమెంటులో ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారని, ఈ చట్టాలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు, ప్రజలకు గుదిబండగా మారిందని ఆరోపించారు. చిన్న, సన్నకారు, మధ్య తరగతి, ధనికరైతాంగం భూమినే నమ్ముకుని ఆరుగాలం కష్టించి పని చేస్తే, పంటచేతికి వచ్చే వరకు నమ్మకం లేదని, కరువులు, కాటకాలు, అతివృష్టి, అనావృష్టి, ఎరువులు, విత్తనాలు,క్రిమి సంహారక మందులు సకాలంలో అందక రైతులు నష్టపోతున్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల కష్టానికి సరైన ఫలితం రావడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారస్తులకు మరింత మేలు చేసేందుకు, వారి ఆస్తులను పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. హమాలీ కార్మికులు బరువులు మోసేటప్పుడు, లారీల నుండి దించేటప్పుడు, ఎత్తేటప్పుడు ప్రమాదాలు జరిగి కాళ్ళు, చేతులు విరిగినా, ప్రాణాలు పోయిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి చేసిన డిమాండ్ మేరకు హమాలీ, దడువాయి, చాట, స్వీపర్ వర్కర్సు ప్రమాద నష్ట పరిహారం రూ.75 వేల నుండి రూ.3 లక్షలకు పెంచుతామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేటికి జిఒలు విడుదల చేయలేదని దుయ్యబట్టారు. రెండు జతల యూనిఫారం, కుట్టుకూలి, మార్కెట్లలో స్త్రీ పురుషులకు విశ్రాంతి గదులు, ప్రమాదాలు జరిగితే ప్రమాదనష్ట పరిహారం చెల్లించాలని, అన్ని మార్కెట్ కమిటీలలో ఒక పురుషునికి, ఒక స్త్రీని నియమించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ల సంఖ్యను పెంచి, క్రయ విక్రయాలను కొన సాగిస్తూ మార్కెట్లలో పని చేసే హమాలీ, దడువాయి, చాట, స్వీపర్ కార్మికులకు పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్ కార్మికులకు లైసెన్స్ రెన్యువల్ వయసును 58 నుంచి 65కు పెంచాలని, మార్కెట్ యార్డుల పాలక వర్గాల్లో కార్మికుల నుంచి ఇద్దరికి డెరెక్టర్లుగా అవకాశం కల్పించాలని, యార్డుల్లో క్యాంటీన్లు, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించి, రాష్ట్రంలో హమాలీ వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, హమాలీ కార్మికులకు ప్రమాద భీమా, ఆరోగ్య భీమా వర్తింపచేయాలని బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## 'ఖేలో ఇండియా' ఈసారి తెలంగాణకు కేటాయించాలి

కేంద్ర మంత్రిని కోరిన మంత్రి వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఖేలో ఇండియా' ఎనిమిదవ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని.. క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించాలని.. తెలంగాణ క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవియాను కోరారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి చైర్మన్ శివసేనా రెడ్డితో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి ఢిల్లీలో శుక్రవారం మన్‌సుఖ్ మాండవియాతో ఆయన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు.

అనంతరం వాకిటి శ్రీహరి విలేకరులతో మాట్లాడుతూ.. ఖేలో ఇండియా ఎనిమిదవ ఎడిషన్‌ను తెలంగాణకు కేటాయించాలని మన్‌సుఖ్ మాండవియాకు విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఇదివరకే ఈ అంశం గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్‌సుఖ్ మాండవియాను కలిసి విజ్ఞప్తి చేశారని గుర్తు చేశారు. తాజాగా క్రీడల శాఖ మంత్రిగా తాను కేంద్రమంత్రిని కలిసి వచ్చే సంవత్సరం ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించడానికి తెలంగాణ అన్ని విధాలుగా అనువైన ప్రదేశం అని వారికి మరోసారి వివరించానన్నారు. అలాగే.. తెలంగాణలోని హకీంపేట, ఆదిలాబాద్, కరీంనగర్, వనపర్తి సహా ఇలా వివిధ జిల్లాల్లో ఉన్న క్రీడా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరామని తెలిపారు. స్టేడియాలు నిర్మించాలని పక్కా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అందుకు అనుగుణంగా.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని రూపొందించినట్టు అందుకోసం నిధులు కావాలని కోరామని తెలిపారు. మా విజ్ఞప్తులకు మన్‌సుఖ్ మాండవియా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ అధారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని క్రీడా రంగానికి సంబంధించిన వివిధ పెండింగ్ పనుల గురించి కేంద్రమంత్రితో చర్చించాం. వనపర్తిలోని హాకీ అకాడమీలో మౌలిక సదుపాయాల కల్పన, స్పోర్ట్ స్కూల్స్‌లో టర్ఫ్ ఏర్పాటు, నల్గొండ, కరీంనగర్, మహబూబ్‌నగర్, జడ్చర్ల.. వంటి ప్రాంతాల్లోని స్పోరట్స్ స్కూల్స్‌లో ఎక్విప్‌మెంట్ కోసం ఫండ్స్ కావాలని కోరాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీటి విషయంలో.. ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. అలాగే తెలంగాణలో స్పోరట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. దీనికి కూడా సహకరించాలని కోరాం. మా విజ్ఞప్తుల పట్ల కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవియా సానుకూలంగా స్పందించారు' అని శివసేన రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి,క్రీడల సలహాదారు ఎపి జితేందర్ రెడ్డి,కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టుల, ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డా.గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



## జిపిఒ నియామకంతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం

ఉద్యోగ జెఎసి సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా జిపిఒలకు నియామకం ఎంతో దోహదపడుతుందని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్,తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ తరపున తెలంగాణ ఉద్యోగుల జెఎసి తెలిపింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి. లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, రాములు, పాక రమేష్ (టిజిటిఎ) బాణాల రామ్ రెడ్డి, బిక్షం,( టిజిఆర్‌ఎస్‌ఎ), రాధ, పూల్ సింగ్, మల్లేష్ (టిజిటిఎ), సిసిఎల్‌ఎ నాయకులు రాంబాబు, చైతన్య, సుజాత చౌహాన్‌తో కూడిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపింది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'భూ భారతి చట్టం 2025' అమలులోకి తీసుకురావడంతో పాటు జిపిఒలను నియమించడంతో గ్రామీణ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం అవుతుందని వారు తెలిపారు. రాష్ట్రంలో ఆనవాళ్ళు కోల్పోయిన రెవెన్యూ శాఖను పునర్నిర్మాణం చేస్తున్నారని, ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలంగాణ ఉద్యోగుల జెఎసి తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు.

## నష్టాన్ని ఏ రకంగా భర్తీ చేస్తారో
# వెంటనే ప్రకటించాలి

వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిఎస్‌టిలో తీసుకొచ్చిన కొత్త మార్పుల కారణంగా అనేక రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని ఏ రకంగా పూడ్చుతారో కేంద్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. జిఎస్‌టి కొత్త విధానంలో రాష్ట్రాలకు జరుగుతున్న నష్టాన్ని నూరు శాతం పూరించాలని, లక్షలాది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న బిడి లాంటి ఇతర పరిశ్రమలపై పూర్తిగా జిఎస్‌టిని ఎత్తివేయాలని,పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అదనపు సెస్సు పేరుతో వసూలు చేస్తున్న పన్నులో 50 శాతం రాష్ట్రాలకు చెల్లించేలా నిర్ణయించాలన్నారు. నిషేధం విధించాల్సిన గుట్కా, పాన్ పరాగ్ లాంటి ఉత్పత్తులపైన జిఎస్‌టిని పెంచడం ద్వారా ఆ ఉత్పత్తుల అమ్మకాన్ని బహిరంగం చేయడానికి అర్థతపొందడమేనని, ఇది కేంద్ర ప్రభుత్వం చేసిన మరో తప్పిదమని బోస్ దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బిడి పరిశ్రమలో సుమారు 7 లక్షల మంది కార్మికులు పనిచేస్తూ జీవనం గడుపుతున్నారని, అలాంటి పరిశ్రమపై జిఎస్‌టి పెంచటం కేంద్ర ప్రభుత్వ దిక్కుమాలిన చర్య అని అన్నారు. జిఎస్‌టి విధానంలో అవగాహన లేని ప్రధానమంత్రి మోదీ ప్రతిపక్షాల సూచనలు లెక్కచేయకుండా 2017లో ''ఒకే దేశం ఒకే పన్ను'' నినాదంతో జిఎస్‌టిలో కనీసంగా 18 శాతం, గరిష్టంగా 28 శాతం వరకు వివిధ వస్తువులపై పన్నులను పెంచి ప్రజలపై భరించలేని భారం మోపిందని తెలిపారు. జిఎస్‌టి అమలుతో ప్రజలు పెనంపై నుంచి పొయ్యిలో పడిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నాటి నుండి ప్రతిపక్షాలు కాంగ్రెస్‌తో సహా జిఎస్‌టి విధానాన్ని కూలంకుశంగా పరిశీలించాలని,ప్రజలపై భారం లేకుండా చూడాలని ఆందోళన చేస్తూ అనేక సూచనలు, సలహాలు ఇచ్చారని బోస్ గుర్తుచేశారు. 2017లో మోదీ ప్రభుత్వం ఘోరమైన తప్పిదమని ప్రస్తుతం తేటతెల్లమైందని, ప్రస్తుతం కనీసం జిఎస్‌టి 5 శాతం, గరిష్టంగా 18 శాతం వరకు మార్పులు చేస్తూ రెండు స్లాబ్లు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. ఈ లెక్కల ప్రకారం మోదీ ప్రభుత్వం గత 9 సంవత్సరాలలో ప్రజలపై అధిక మోతాదులో జిఎస్‌టిని విధించడం క్షమించరాని మోసపూరిత చర్యగా బోస్ అభివర్ణించారు. దేశ ప్రజలపై మోదీకి ఏమాత్రం అభిమానం,వారి కష్టాలపై సానుభూతి ఉంటే 9 సంవత్సరాలలో అధికంగా వసూలు చేసిన జిఎస్‌టి డబ్బులను ప్రతి కుటుంబానికి రూ 20 లక్షల చొప్పున చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. 'ఒకే దేశం ఒకే పన్ను'' నినాదంలో వాస్తవం కాదనేందుకు పెట్రోల్, డీజిల్, గ్యాస్ వస్తువులను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురాకపోవడమే దీనికి తర్కాణమని బోస్ గుర్తు చేశారు.మోదీ చెప్పే మాటలన్నీ భూటకమన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 29న హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ యార్డ్ హమాలీ, దడువాయి, చాట, స్వీపర్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 2వ మహాసభలు ఈనెల 29న నిజామాబాద్‌లోని ఉమామహేశ్వర ఫంక్షన్‌హాల్(శ్రద్ధానంద్‌గంజ్)లో నిర్వహించనున్నట్లు హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. ఈ మహాసభలో వ్యవసాయ మార్కెట్లను పెంచి అన్ని మార్కెట్లలో క్రయ విక్రయాలు జరపడంతో పాటు కార్మికులకు పనిభద్రత కల్పించాలని, రైతుల వ్యతిరేఖ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని, కార్మికుల ప్రమాద నష్టపరిహారం పెంపు, మార్కెట్లలో పనిచేస్తున్న వారికి లైసెన్సు, గుర్తింపుకార్డులు తదితర డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యచరణను రూపొందించుకోనున్నట్లు ఆయన వెల్లడించారు.

## నల్లా నీరు వృథా చేస్తే కఠిన చర్యలు

### జలమండలి హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాగునీటిని దుర్వినియోగం చేస్తున్న వారిపై జలమండలి కఠిన చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, ఇటీవల మంగల్‌హాట్ ప్రాంతంలో జలమండలి విజిలెన్స్ విభాగం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీలలో, బోర్డు సరఫరా చేస్తున్న తాగునీటిని తాగడానికి కాకుండా, ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ఇళ్లలో తాగునీటిని దుర్వినియోగం చేయడాన్ని బోర్డు నిబంధనలకు విరుద్ధంగా గుర్తించి, వాటి యజమానులపై జరిమానా విధించారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పు మళ్లీ జరిగితే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. జలమండలి సరఫరా చేసే నీటిని కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగించాలని జలమండలి ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఇంటి ఆవరణ కడగడానికి, వాహనాలు శుభ్రం చేయడానికి నల్లా నీటిని ఉపయోగిస్తే, ఆ వాటర్ కనెక్షన్‌ను తొలగించడంతోపాటు, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.



## జిఎస్‌టి రేట్ల తగ్గింపుతో సామాన్య ప్రజలకు ఊరట

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిఎస్‌టి మండలి సమావేశంలో సామాన్య ప్రజలు, రైతులు, మధ్యతరగతి వర్గాలకు మేలు కలిగేలా జిఎస్‌టి రేట్లను తగ్గించడంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయాలను స్వాగతిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి కౌన్సిల్ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ప్రజలకు ఆర్థికంగా ఊరట లభిస్తుందన్నారు. ప్రధానంగా 12 శాతం, 28 శాతం పన్ను స్లాబ్‌లను పూర్తిగా రద్దు చేయడం ద్వారా అనేక నిత్యావసర వస్తువులు ఇప్పుడు 5 శాతం స్లాబ్‌లోకి వస్తాయని, కొన్ని వస్తువులపై జిఎస్‌టిని సున్నా శాతానికి తగ్గించారని ఆయన తెలిపారు. పాలు, పనీర్, హెయిర్ ఆయిల్, టూత్ బ్రష్‌లు, సబ్బులు, షాంపూ వంటి వాటిపై జిఎస్‌టి తగ్గించడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుందన్నారు. వివిధ పండుగలకు ముందు ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పండుగ కానుక అని ఆయన అభివర్ణించారు. ఈ నిర్ణయానికి కృతజ్ఞతగా, బీజేపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో పాలాభిషేకం కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాంచందర్ రావు ప్రకటించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా హైదరాబాద్‌లోని గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని రాంచందర్ రావు వెల్లడించారు. మొజంజాహి మార్కెట్‌లో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొని, కొన్ని అభివృద్ధి కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు.

**కవితకు చోటు లేదు..**

అవినీతి పరులకు తమ పార్టీలో చోటు లేదని, కవిత అయిన భవిత అయినా అంతేనని అన్నారు. బిజెపి బిఆర్ఎస్ ఒక్కటి కాదని, కాంగ్రెస్, బిజెపి ఒక్కటని ఆరోపించారు. తమిళనాడులో స్టాలిన్ నిర్వహించిన సమావేశానికి బిఆర్ఎస్, కాంగ్రెస్ వెళ్లాయన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ ఒక్కటై తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. కవిత కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని, వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన పొరపాటువల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు.

## కెసిఆర్, కెటిఆర్ వల్లే బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చా

### బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెసిఆర్, కెటిఆర్ వల్లే తాను బిఆర్ఎస్ నుంచి బయటకు వచ్చానే కానీ కవిత చెప్పినట్లు హరీశ్ రావు వల్ల కాదని బిజెపి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్ అహంకారం, అవినీతి వల్లే తను బిఆర్ఎస్‌ను వీడానన్నారు. కవిత ఇప్పుడు అమాయకురాలిలా మాట్లాడుతున్నారని, ఆమె మాత్రం అవినీతి చేయలేదా అని ప్రశ్నిం చారు. ఒకటే ఫ్యామిలీ ఈ రాష్ట్రాన్ని పాలిం చిందని, కాళేశ్వరం అవినీతి మొత్తం కెసిఆర్ ఫ్యామిలిదే అన్నారు. హరీశ్ రావు కేవలం సంతకాలకే పరిమితమయ్యారని అన్నారు. కవితను బిజెపి వైపు కూడా చూడనివ్వమన్నారు.



## గవర్నర్‌ను కలిసిన బిజెపి తెలంగాణ విమోచన కమిటీ బృందం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ విమోచన కమిటీ సభ్యుల బృందం తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మని కలిసింది. ఈ సమావేశంలో కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, గూడూరు నారాయణ్ రెడ్డి, గోలి మధుసూదన్ రెడ్డి, పి. విక్రం రెడ్డి, నందకం దివాకర్, పాతూరి కరుణ పాల్గొన్నారు. సభ్యులు గవర్నర్‌కి సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా, నిజాం నియంతృత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్ర ఆధారంగా రూపొందిన రజాకార్ సినిమాను సెప్టెంబర్ 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో ప్రత్యేక ప్రదర్శనగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రముఖులను కూడా ఆహ్వానిస్తామని విమోచన కమిటీ చైర్మన్ అంజి రెడ్డి తెలిపారు.

# ఢిల్లీలో బిజిబిజీగా మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఢిల్లీలో బిజి బిజీగా గడిపారు. మంత్రి తన పర్యటనలో భాగంగా రెండవరోజైన గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసానిలను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతులు, నేతన్నలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో ఖమ్మం జిల్లా రఘునాథపాలం మండలంలోని తండాలకు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి నిధులను విడుదల చేయాలని కేంద్ర మంత్రులను కోరుతూ మూడు కీలక లేఖలను అందజేశారు.

**వ్యవసాయం – యంత్రాలపై జిఎస్‌టి మినహాయింపు ఇవ్వాలి**

వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై విధిస్తున్న 12 శాతం జిఎస్‌టిని పూర్తిగా మినహాయించాలనిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నా వ్యవసాయం, ఉద్యానవన రంగాల్లో రైతులకు ఆధునిక యంత్రాలు, నీటిపారుదల సాంకేతికత అందుబాటులో ఉంటే ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. ఇందుకు వ్యవసాయ యంత్రాలు, పరికరాలు, ఉద్యానవనాల కోసం మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న రైతులపై ఆర్థిక భారం తగ్గించడానికి, ఆధునిక యంత్రాలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేలా,చిన్న రైతులుకూడా సాంకేతికతను ఉపయోగించుకునేందుకు వీలుగా 12 శాతం జిఎస్‌టిని మినయించాలని కోరారు.

**నేతన్నల సమస్యలు – హ్యాండ్లూమ్ రంగానికి మినహాయింపు**

రెండవ లేఖలో రాష్ట్ర నేతన్నల పరిస్థితిని వివరిస్తూ కేంద్ర మంత్రికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో లేఖను అందజేశారు. వ్యవసాయ రంగం తరువాత గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక ఉపాధి కల్పిస్తున్నది చేనేత రంగమని, తెలంగాణ నేతన్నలు తయారుచేసిన వస్త్రాలు దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయని తెలిపారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల పట్టు, నారాయణపేట్ పట్టు, గొల్లభామ చీరలు, వరంగల్ దుర్రీలు, కరీంనగర్ డబుల్ క్లాత్ బెడ్‌షీట్లు వంటి ప్రత్యేక జిఐ గుర్తింపు పొందిన ఉత్పత్తులు భారత వారసత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 23,046 నేతన్నలు, 34,569 అనుబంధ కార్మికులు జీవనోపాధి కోసం హ్యాండ్లూమ్ రంగంపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. ఖాదీ పరిశ్రమకు జిఎస్‌సి మినహాయింపు ఉన్నప్పటికీ, హ్యాండ్లూమ్ ఉత్పత్తులపై 5శాతం జిఎస్‌టిని విధించడం అన్యాయమని, దీనిని ఎత్తివేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

**ఆయిల్ పామ్ రైతుల రక్షణ – దిగుమతి సుంకం పునరుద్ధరణ**

నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్ పామ్ (ఎన్‌ఎంఈఓపి) అమలు క్రమంలో తెలంగాణ చేసిన కృషిని వివరించారు. రాష్ట్రంలో దాదాపు 72 వేల మంది రైతులు 1.06 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని దేశంలోనే అత్యధిక విస్తీర్ణం తెలంగాణదేనని తెలిపారు. అయితే ఈ ఇటీవల క్రూడ్ పామ్ ఆయిల్ (సిపిఓ) పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 27.5 శాతం నుంచి 16.5శాతానికి తగ్గించడం రైతులకు తీవ్ర సమస్యగా మారిందని, దీని వల్ల దేశీయ ధరలు క్షీణించి రైతులకు చెల్లించే ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2018లో ఉన్నట్లుగా 44శాతం దిగుమతి సుంకాన్ని పునరుద్ధరించాలనికేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

**తండాల్లో డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు ఇవ్వండి**

ఖమ్మం జిల్లా రఘునాథపాలం మండలంలోని తండాలకు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం రూ.110 కోట్ల మంజూరు చేయాలనికేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి చంద్రశేఖర్ పెమ్మసానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా గురువారం కేంద్రమంత్రిని చంద్రశేఖర్ పెమ్మసానినీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా రఘునాథపాలం మండలంలోని తండాల్లో డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులే కాకుండ రోగాల భారీన కూడ పడుతున్నారని కేంద్ర మంత్రికి వివరించారు. డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కోసం రూ. 110 కోట్ల మంజూరు చేయాలని కోరారు.



## వారిని అవినీతి నుండి తప్పించాలనే కవిత తాపత్రయం



టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

**ప్రజాపక్షం / హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, లక్ష కోట్లు దోచుకున్నది హరీష్ రావేనని, తన తండ్రి కెసిఆర్‌కు సంబంధం లేదని ఎంఎల్‌సి కవిత స్వయంగా చెబుతున్నారని, తద్వారా అవినీతి నుండి కెసిఆర్, కెటిఆర్ లను తప్పించాలని కవిత ప్రయత్నిస్తున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని, రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సిబిఐ విచారణ చేసి మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్ రావులపై తగిన చర్యలు తీసుకోవాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ''మొత్తం దోపిడీ చేసింది సంతోష్ రావు అని కవిత అంటున్నారు. కెటిఆర్ సిరిసిల్లలో ఇసుక దందా చేసి వేల కోట్లు దోచుకుండు అని కవిత చెబుతున్నారు. సంతోష్ రావు, హరీశ్ రావు దోచుకున్న డాటా నా దగ్గర ఉంది బయట పెడతా అని కవిత అంటున్నారు. నేనే దగ్గర ఉండి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టానని అప్పటి కెసిర్ కెసిఆర్ అన్నారు. మొత్తం ప్రాజెక్టును కట్టింది కెసిఆరే. మొత్తం అవినీతి చేసింది తండ్రి కొడుకులు కెసిఆర్, కెటిఆర్ అని హరిష్ రావు అన్నట్లు రికార్డు కూడా బయట పడింది. మొత్తం రాష్ట్రాన్ని దోచుకుంది కేసీఆర్ కుటుంబమే'' అన్నారు.

## 'ఎన్ఐఆర్ఎఫ్-2025' ర్యాంకింగ్‌లో ఒయుకు 53వ స్థానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్2025' ర్యాంకింగ్‌లో ఉస్మానియా విశ్వవిద్యాలయం 53వ స్థానంలో నిలిచింది. ఓవరాల్ కేటగిరిలో 2024లో 70వ ర్యాంక్ పొందగా, ఈసారి 53వ స్థానానికి చేరుకుంది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ ర్యాంకింగ్‌లను గురువారం ప్రకటించింది. స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీలో ఉస్మానియా యూనివర్సిటీ 6వ స్థానం నుంచి ఏడవ స్థానానికి చేరుకున్నది. దే శ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 18వ ర్యాంక్, (స్కోర్ 61.83), ఉస్మానియా యూనివర్సిటీ 30వ ర్యాంక్, (స్కోర్ 57.94), జెఎన్‌టియు 81వ ర్యాంక్ (స్కోర్ 49.22),న్యాయ కళాశాల ర్యాంక్‌లో నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా 3వ ర్యాంక్‌లో ఉన్నది. వ్యవసాయ, అనుబంధ విశ్వవిద్యాలయానికి సంబంధించి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 24వ ర్యాంక్‌ను సాధించింది.

## గణేశ్ ఉత్సవాలలో అన్న ప్రసాద వితరణ అభినందనీయం

### తెలంగాణ టూరిజం ఇయు ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉప్పల్, చిలుకానగర్, గణేశ్ నగర్ రోడ్ నెంబర్ నాలుగులో ఉన్న కమిటీ హాల్ వద్ద కాలనీ వాసులు గణేశ్ ఉత్సవాల సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ముఖ్య అతిథులు హాజరయ్యారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి కార్పొరేటర్ గీతా పన్నాల ప్రవీణ్, గొర్రెలు, మేకల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, సీనియర్ జర్నలిస్ట్, ముఖ్యమంత్రి మాజీ సలహాదారుడు టంకశాల అశోక్, ఉప్పల్ పోలీస్ అధికారులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పేదలకు భోజనం పెట్టే అవకాశం లభిస్తుందని, అలాగే కాలనీ వాసుల మధ్య స్నేహ సంబంధాలు బలపడతాయన్నారు. ఆ భగవంతుడు కాలనీ వాసులందరినీ చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మాట్లాడుతూ కాలనీవాసుల పూర్తి సహకారం వల్లనే ఇంత పెద్ద కార్యక్రమం విజయవంతమైందని ప్రశంసించారు. ముఖ్యంగా గణేశ్ నగర్‌లోని మహిళలు, యువత, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, రాము, కళ్యాణ్, బాల్ రెడ్డి, పుష్ప, శైలజ, సునంద, చిలకమ్మ, మల్లేష్, సేతు, మనోహర్, లింగన్న, గణేశ్, మధుసూదన్ రెడ్డి, శివ, శ్రీనాథ్, అబ్బులు, షబ్బీ పాల్గొన్నారు.



## ఆపరేషన్ కగార్‌తో సంక్షోభంలో ప్రజాస్వామ్యం

### రాజ్యాంగ విలువలు, ఆదర్శాలు ప్రశ్నార్థకం
### హింస లేని సమాజంకోసం కాల్పుల విరమణ ప్రకటించాలి
### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు పూర్వ విప్లవ విద్యార్థి వేదిక డిమాండ్

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరిట మూకుమ్మడి హింసకు పాల్పడటంతో ప్రజాస్వామ్యం సంక్షోభంలో చిక్కుకున్నదని, రాజ్యాంగ విలువలు, ఆదర్శాలు ప్రశ్నార్థకమయ్యాయని పూర్వ విప్లవ విద్యార్థి వేదిక (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్) ఆందోళన వ్యక్తం చేసింది. ఇదేక్రమంలో మావోయిస్టులతోపాటు సాధారణ ప్రజలు కూడా మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. వెంటనే తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా కాల్పుల విరమణ ప్రకటన చేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వేదిక ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో పౌర హక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి శాఖ అమిత్ షా పదే పదే ప్రకటించి, హత్యాకాండకు పాల్పడటం భారత సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోందన్నారు. చట్టప్రకారం నేర విచారణ జరిగి, తగిన ఆధారాలుంటే న్యాయస్థానం మాత్రమే శిక్ష విధించాలని, కానీ, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా పెద్ద ఎత్తున సైనిక, అర్ధ సైనిక బలగాలను, పోలీసులకు మోహరించి మధ్య భారతదేశంలో ఆదివాసులను హత్య చేయ డం దారుణమన్నారు. అటవీ ప్రాంతంలోనే సహజ వనరులను కార్పొరేట్లకు ఇవ్వడానికే ఈ హత్యాకాండకు ప్రభుత్వం పాల్పడుతున్నదని ఆరోపించారు. ప్రతిపక్ష బిఆర్ఎస్ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని కోరుతున్నదన్నారు. మావోయిస్టు ఉద్యమం శాంతి భద్రతల సమస్య కాదని, అదొక సామాజిక రాజకీయ సమస్య అని, మావోయిజం ఒక ఐడియాలజీ అని రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి వేర్వేరు సందర్భాల్లో ప్రకటించారని గుర్తుచేశారు. ఇలాంటి రాజ్యాంగబద్ధ వైఖరి తీసుకొన్న రాష్ట్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటిస్తే బాగుంటుందని కోరారు. తెలంగాణలోని వివిధ రంగాల వందలాది మంది ప్రముఖులు హింసలేని తెలంగాణను కోరుకొంటున్నారని పూర్వ విప్లవ విద్యార్థి వేదిక చేపట్టిన సంతకాల సేకరణలో స్పష్టంగా తేలిందని వివరించారు. కేంద్ర, బిజెపియేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి హింస జరగకుండా, జీవించే హక్కును కాపాడటానికి కాల్పుల విరమణ ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, జనంసాక్షి ఎడిటర్ రెహమాన్, కవి, రచయిత నరేశ్ కుమార్ సూఫీ, కవయిత్రి మెర్సీ మార్గరెట్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షులు రంబల నాగయ్య, సామాజిక కార్యకర్త కె.సజయ, సీనియర్ పాత్రికేయులు భరద్వాజ, రచయిత్రి, సాహితీ విమర్శకులు ఎ.కె.ప్రభాకర్, ప్రహాద్ పాల్గొన్నారు.

## ఉత్తమ అధ్యాపకుల అవార్డుల ఎంపిక

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గురుకుల,ఎయిడెడ్, మాడల్ పాఠశాల అధ్యాపకులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ అధ్యాపకుల అవార్డులను ప్రకటించింది. ఈ మేరకు విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి నలుగురు, కాకతీయ, శాతవాహన, పాలమూరు, మహాత్మాగాంధీ, వీరనారి చాకలి ఐలమ్మ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, విశ్వవిద్యాలయాల నుంచి ఒక్కొక్క అధ్యాపకుడికి అవార్డులకు ఎంపిక చేశారు. పాఠశాల విద్యాకు సంబంధించి 49, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఎంపిక చేసింది. ఇందులో జిహెచ్‌ఎం/ప్రిన్సిపాల్‌లు పది మంది, స్కూల్ అసిస్టెంట్లు, పిడిలు,ఎల్‌ఎఫ్ఎల్‌లు 21 మంది ,ఎస్‌జిటి, పిఇటి, లాంగ్వేజ్ పండిత్‌లు, టిజిటిలు 12 మంది, ఎయిడెడ్ స్కూల్ టీచర్లు ముగ్గురు, మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం నుంచి ఒక ఉపాధ్యాయున్ని ప్రభుత్వ ఎంపిక చేశారు.

# దళారీల చేతిలో మోసపోవద్దు

## నేరుగా సంప్రదించాలన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళారుల చేతిలో మోసపోవద్దు, నేరుగా తమను సంప్రదించాలని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఏదైనా సమస్య ఉంటే ప్రతి సోమవారం హైడ్రా కార్యాలయంలో జరిగే ప్రజావాణిలో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. హైడ్రా అధికారులు తమకు బంధువులు, మిత్రులు, బాగా తెలుసు అని చెప్పేవారిని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. హైడ్రాలో పనిచేసే ఉద్యోగులు ఎంతో నిబద్ధత, నిజాయితీతో పనిచేస్తున్నారని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా తమను సంప్రదించాలని కోరారు. గతంలో ఇలాంటి మోసాలకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేశామని, తాజాగా మరో ముఠా ఇదే తరహాలో మోసాలకు పాల్పడినట్లు వెల్లడైందని తెలిపారు.

**తాజాగా వెలుగులోకి వచ్చిన మోసం**

ఇటీవల ఒక డిజిటల్ మీడియా రిపోర్టర్, మరో డిజిటల్ మీడియా ప్రతినిధి, అలాగే హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించబడిన ఒక వ్యక్తి కలిసి మోసానికి పాల్పడినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ముగ్గురూ 'హైడ్రా అధికారులు తెలుసు' అని చెప్పి, బాధితుడి నుంచి రూ. 50 లక్షలు వసూలు చేసినట్లు హైడ్రాకు ఫిర్యాదు అందింది. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్ గ్రామంలోని సూరం చెరువును ఆక్రమించడంతో పాటు, కొత్తకుంటలో మట్టి పోసి డ్రైన్ నిర్మించారని వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. ఈ విషయమై విచారణ చేపట్టిన హైడ్రా, ఆ సంస్థపై రెండు కేసులు నమోదు చేసింది. ఇదే సమయంలో, వర్టెక్స్ సంస్థ తమ స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేసిందని చైతన్య రెడ్డి అనే వ్యక్తి హైడ్రాను ఆశ్రయించారు. రోడ్డును తొలగించాలని ఆయన ఫిర్యాదు చేయగా, హైడ్రా ఇరుపక్షాలను పిలిచి విచారణ చేపట్టింది. ఈ విచారణలో భాగంగా చైతన్య రెడ్డి ఒక వ్యక్తికి రూ. 50 లక్షలు ఇచ్చినట్లు తేలింది. హైడ్రా పేరు చెప్పి డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది. చైతన్య రెడ్డి ఫిర్యాదు మేరకు పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. ఇలాంటి మోసాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

**మోసం బయటపడింది ఇలా..**

వర్టెక్స్ సంస్థకు సంబంధించిన ఫిర్యాదుల మీద జరుగుతున్న నిష్పక్షపాత విచారణను చూసిన చైతన్య రెడ్డి, తాను దళారుల చేతిలో ఎలా మోసపోయారో హైడ్రా కమిషనర్ ముందు వివరించారు. ఇద్దరు డిజిటల్ మీడియా ప్రతినిధులు, అలాగే హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి తొలగించిన న్యాయవాది ఈ మోసానికి పాల్పడినట్లు ఆయన వెల్లడించారు. ఈ ముగ్గురిలో న్యాయవాది ప్రధాన పాత్ర పోషించినట్లు తేలింది. వర్టెక్స్‌పై హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ఒక డిజిటల్ మీడియా ప్రతినిధి వార్త ప్రసారం చేయగా, మరో డిజిటల్ మీడియా ప్రతినిధి 'హైడ్రా అధికారులు తెలుసు' అని నాటకం ఆడినట్లు వెలుగులోకి వచ్చింది. చైతన్య రెడ్డిని, సదరు మీడియా ప్రతినిధిని ఎదురెదురుగా కూర్చోబెట్టి విచారించగా, మోసం నిజమని తేలింది. ఈ దళారులు వర్టెక్స్ నుంచి హైడ్రా అధికారులు లబ్ధి పొంది చైతన్య రెడ్డికి న్యాయం చేయడం లేదని ఆరోపణలు చేస్తూ వార్త ప్రసారం చేసేందుకు ప్రయత్నించినట్లు వెల్లడైంది. ఈ కుట్రలో కీలక పాత్ర పోషించిన న్యాయవాది స్వయంగా మీడియా ప్రతినిధిని వర్టెక్స్‌కు తీసుకెళ్లి హైడ్రాపై ఆరోపణలు చేయిస్తున్నట్లు వీడియో సాక్ష్యాలు కూడా ఉన్నాయని తేలింది. నిష్పక్షపాతంగా జరిగిన ఈ విచారణను చూసిన చైతన్య రెడ్డి, తాను దళారుల చేతిలో మోసపోయానని గ్రహించి, పూర్తి వివరాలను హైడ్రా ముందు వెల్లడించారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను రాయ్‌బరేలిలో నిలపండి

రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాహుల్‌గాంధీ లేఖ

**రాయ్‌బరేలి :** డిబ్రూగఢ్– న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును రాయ్‌బరేలి జంక్షన్ వద్ద నిలపాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ రైలు ఇప్పటికే రాయ్ బరేలి గుండా వెళ్తుందని, తన నియోజకవర్గ ప్రయాణికులు చాలా కాలంగా ఈ రైలును రైల్వే స్టేషన్‌లో నిలపాలని కోరుతున్నారన్నారు. ముఖ్యంగా దేశ రాజధాని వైపు ప్రయాణాన్ని సులభతరం చేయాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. రాయ్‌బరేలి జంక్షన్‌లో 20503/20504, 20505/20506 రైలు నంబర్లు గల రైలు హాల్ట్ అయ్యేలా చూడాలన్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నట్లు ఆయన రైల్వే మంత్రికి రాసిన లేఖలో వెల్లడించారు. రాహుల్ ఈనెల 3వ తేదీన కేంద్ర మంత్రికి లేఖ రాశారు. డిగ్రూగఢ్–న్యూఢిల్లీ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును రాయ్‌బరేలిలో నిలపాలన్న డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని, దానిని నెరవేర్చడం వల్ల తన నియోజకవర్గ ప్రజల అత్యవసర అవసరం తీరుతుందన్నారు.

## పాఠశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో...
# స్మార్ట్ టీచర్ల ఆవశ్యకత కీలకం

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ముర్ము

నా జీవితంలో 'అత్యంత అర్థవంతమైన కాలం' టీచర్‌గా పనిచేసిన సమయమేనని జ్ఞప్తి చేసుకున్న ముర్ము

**న్యూఢిల్లీ :** జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ నిర్మాణంలో ఉపాధ్యాయ వృత్తి ప్రాముఖ్యతను, ఉపాధ్యాయుల గురుతర బాధ్యతను ఉద్బోధించారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ క్లాస్ రూములు, ఇతర అధునాతన వసతులు పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల్లో వాటికంటూ సొంత ప్రాముఖ్యతను కలిగిఉన్నప్పటికీ స్మార్ట్ టీచర్ల పాత్రే అత్యంత కీలకమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. తాను టీచర్‌గా పని చేసిన సమయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. అది తన జీవితంలో 'అత్యంత అర్థవంతమైన కాలం' అని ముర్ము అభివర్ణించారు. శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన జాతీయ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రసంగించారు. బోధన, అభ్యాసానికి ఆదర్శప్రాయమైన కృషి చేసిన 60మందికి పైగా ఉపాధ్యాయులుకు ఆమె అవార్డులు అందజేశారు. స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ తరగతిగదులు, ఇతర అధునాతన వసతులకు వాటి సొంత ప్రాముఖ్యత ఉంది. కానీ అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే ఎవరైతే వారి విదార్థుల అవసరాలను అర్థం చేసుకుని వారి అభివృద్ధికి కృషిచేస్తారో అలాంటి స్మార్ట్ టీచర్ల అవసరమే ప్రస్తుత విద్యావ్యవస్థలో అధికంగా ఉందన్నారు. స్మార్ట్ టీచర్లు అధ్యయనాలను ఆసక్తికరంగా, సమర్థవంతంగా ఆప్యాయత, సున్నితత్వంతో ప్రభావవంతం చేస్తారన్నారు. అలాంటి స్మార్ట్ టీచర్లే సమాజం, దేశం అవసరాలను నెరవేర్చే సామర్థ్యాలను కలిగే సత్తాను కలిగిఉంటారన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం




ఉపాధ్యాయుడి ప్రాథమిక కర్తవ్యం అని రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'సున్నితత్వం, బాధ్యతాయుతం, అంకితభావం కలిగిన విద్యార్థులు పోటీతత్వం, పుస్తకజ్ఞానం, స్వార్థం మాత్రమే ఆసక్తి ఉన్న విద్యార్థుల కంటే ప్రవర్తనను అనుసరించే వారు మెరుగ్గా ఉంటారు. మంచి ఉపాధ్యాయుడికి భావోద్వేగాలు, తెలివితేటలు ఉంటాయి. భావోద్వేగాలు, తెలివితేటల సమన్వయం విద్యార్థులపై ప్రభావం చూపుతుంది' అని రాష్ట్రపతి చెప్పారు. 'పేద నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలు విద్య శక్తితో పురోగతిని తాకగలరు. ఆప్యాయత, అంకితభావంతో కూడిన పిల్లలు పిల్లల ప్రయాణానికి బలం చేకూర్చడంలోఅతి ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయులకు లభించే అతిపెద్ద బహుమతి ఏమిటంటే వారి విద్యార్థులు వారిని వారి జీవితకాలం గుర్తుంచుకుంటారు, కుటుంబానికి, సమాజానికి, దేశానికి ప్రశంసనీయమైన సహకారాన్ని అందిస్తారు' అని ముర్ము చెప్పారు. దేశాన్ని గ్లోబల్ నాలెడ్జి సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం అని వివరించారు. దీనికోసం మన ఉపాధ్యాయులను ప్రపంచంలోనే అత్తుత్మ బోధనా నిపుణులుగా గుర్తించాలన్నారు. మన సంస్థలు, ఉపాధ్యాయులు విద్యకు సంబంధించిన మూడు రంగాలలో అవేమిటంటే పాఠశాల విద్య, ఉన్నత విద్య, నైపుణ్యవిద్యలో చురుకుగా సహకరించాలని కోరారు. అవార్డు గ్రహీతలు భారతదేశంలో యువ మనస్సులను రూపొందించడంలో కీలకపాత్ర పోషించారని రాష్ట్రపతి వారిని అభినందించారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముందు ప్రధాని నరేంద్రమోదీ జాతీయ అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించే ప్రచారాలను బోధించడానికి, 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమాలను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు వారికి హోంవర్క్ ఇవ్వాలని ప్రధాని ఈ సందర్భంగా వారిని కోరారు.

# పునరుత్పాదక ఇంధన వనరులు కీలకం

అపార పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఉన్నా... భారత్, హెచ్‌కెహెచ్ దేశాల సరఫరాలో 'క్లీన్ ఎనర్జీ' 6.1 శాతమే !

ఐసిఐఎంఒడి కొత్త నివేదిక వెల్లడి

భారత్, చైనా దేశాలే క్లీన్ ఎనర్జీకి 'మార్గదర్శకులు' అని సమన్వయ ప్రధాన రచయిత అవిషేక్ మల్లా కితాబు



**న్యూఢిల్లీ :** అపారమైన పునరుత్పాదన శక్తి సామర్థ్యం ఉన్నప్పటికీ భారత దేశం సహా హిందూ కుష్ హిమాలయాల (హెచ్‌కెహెచ్) దేశాలలో మొత్తం ప్రాథమిక ఇంధన సరఫరాలో క్లీన్ ఎనర్జీ కేవలం 6.1శాతం మాత్రమే ఉందని, మిగులు జలవిద్యుత్ ఉన్నప్పటికీ 'చాలా తక్కువగా మాత్రమే వినియోగించబడుతుంది' అని శుక్రవారం ఒక కొత్త నివేదిక తెలిపింది. బ్యాంకాక్‌లో ప్రారంభించిన ఆసియా పసిఫిక్ క్లీన్ ఎనర్జీ వీక్‌లో సమీకృత పర్వత అభివృద్ధి అంతర్జాతీయ కేంద్రం (ఐసిఐఎంఒడి) అంచనా ప్రకారం ఆఫ్ఘనిస్థాన్, భూటాన్, బంగ్లాదేశ్, చైనా, ఇండియా, మ్యాన్మార్, నేపాల్, పాకిస్థాన్‌లో గుర్తించబడిన 882 గిగావాట్ల జలవిద్యుత్ సామర్థ్యాలలో 635 గిగావాట్లు హిందూ కుష్ హిమాలయాల నదులలో ఉన్నాయని తెలిపింది. ఇందులో కేవలం 49శాతం మాత్రమే ఉపయోగించబడ్డాయి.ఈ ప్రాంతంలో రిజర్వాయర్‌లో నాన్ హైడ్రో క్లీన్ ఎనర్జీ సామర్థ్యం (సౌర, పవన్) 3 టెరావాట్ల వద్ద ఉన్నది' అని ఆ నివేదిక తెలిపింది. వాతావరణ హామీల ప్రకారం హిందూ కుష్ హిమాలయాల దేశాల ఉమ్మడి ఇంధన పునరుత్పాదక లక్ష్యాల మొత్తం 1.7 టెరావాట్స్ కాగా ఈ ప్రాంతంలోనే పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 3.5 టెరావాట్స్‌గా ఉందని నివేదిక వెల్లడించింది. భూటాన్, నేపాల్ తమ విద్యుత్ మొతాన్ని పునరుత్పాదన నుంచి ఉత్పత్తి చేస్తాయి. అయితే ఇతర హిందూ కుష్ హిమాలయాల దేశాలలో శిలాజ ఇంధనాల ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో 98శాతం, భారతదేశంలో 77శాతం, పాకిస్థాన్‌లో 76శాతం, చైనాలో 67శాతం, మయన్నార్‌లో 51శాతంగా ఉంది. నాలుగుదేశాలలో ప్రాథమిక శక్తి వినియోగంలో బయో ఇంధనాలు సహా వ్యర్థాలు 'భయంకరంగా అధిక' వాటాను కలిగి ఉన్నాయి. నేపాల్‌లో మూడింట రెండు వంతులు, మయన్మార్‌లో సగం, భూటాన్, పాకిస్థాన్‌లలో పావువంతు. దీని అర్థం ఈ దేశాల ఆరోగ్యం, గాలినాణ్యత ప్రభావాలతో వంట, హీటింగ్ కోసం అవశేషాలు పేడపై ఆధారపడతాయి. నీటి వైవిధ్యం, తీవ్రమైన వాతావరణం, మౌలిక సదుపాయాల నష్టం ద్వారా వాతావరణ మార్పు హైడ్రోపవర్‌కు అంతరాయం కలిగిస్తుందని అధ్యయనం హెచ్చరించింది. సరస్సు విస్ఫోటనం, వరదలు , ఇతర సంఘటనలు అనుబంధ ప్రాజెక్ట్‌లకు పెద్ద ప్రమాదాలను కలిగిస్తున్నాయి. దాదాపు మూడింట రెండు వంతుల మంది హిమానీనదుల బారిన పడుతున్నారని, విపత్తు ప్రమాద వ్యూహాలను పునరుత్పాదక ఇంధన వనరులతో అనుసంధానించాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక నొక్కిచెప్పింది. బహుళార్థక సాధక ప్రాజెక్ట్‌లు మాత్రమే మెగా వరదలు లేదా నీటి వృథా ప్రమాదాలను పరిష్కరించలేవని ఆ నివేదిక స్పష్టం చేసింది. సమర్థవంతమైన నీటి పారుదల, పట్టణ నీటి నిల్వ సౌర, పవన శక్తిని స్వీకరించడం వంటి చర్యల ద్వారా ఆనకట్టలకు సమానమైన వాటిని అన్వేషించాలని నివేదిక సిఫారసు చేసింది. అధిక వ్యయాలు, పరిమితమైన ప్రభుత్వ నిధులు, ప్రైవేట్ పెట్టుబడులు లేకపోవడం, సాంకేతిక అంతరాలు, భూపరిమితులు, నవీకరించబడిన చట్టం లేకపోవడం వంటి బహుళ అడ్డంకులను ఈ అధ్యయనం గుర్తించింది. 'మాలో అసాధారణమైన పునరుత్పాదక శక్తి సామర్థ్యం ఉంది. అలాగే భారతదేశం, చైనాలో కూడా అసాధారణమైన పునరుత్పాదక శక్తి ఉంది. ప్రపంచంలోని ఈ రెండు దేశాలూ క్లీన్ ఎనర్జీకి మార్గదర్శకులు' అని సమన్వయ ప్రధాన రచయిత అవిషేక్ మల్లా చెప్పారు. 'పునరుత్పాదక శక్తిలో ఉన్నటు వంటి ఈ అద్భుతమైన పోటీ ప్రపంచాన్ని నిర్మించడం అనేది ప్రజలను పేదరికం నుంచి బయటకు తీసుకువస్తూ గ్రీన్ ఆర్థికవృద్ధిని టర్బోచార్జి చేయడానికి మా ప్రతిష్ఠాత్మక ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను సాధించడానికి ఒక అద్భుతమైన అవకాశాన్ని సూచిస్తుంది' అని అవిషేక్ మల్లా తెలియజేశారు. హిందూకుష్ హిమాలయాల ప్రాంతానికి పునరుత్పాదక ఇంధన వనరులపై ఉన్న అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, మౌలిక సదుపాయాలలో పెట్టుబడి ఎలా అవసరమో, దక్షిణాదిలో భారీ పెరుగుదల, సాంకేతిక మార్పిడి ఎలా అవసరమో దేశాలు ఆలోచించడం చాలా కీలకమని మల్లా చెప్పారు.

## న్యాయవ్యవస్థ ప్రజలకు, రాజ్యాంగానికి మధ్య వారధి

'సుప్రీం' ప్రధానన్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ఉద్ఘాటన



న్యూఢిల్లీ : న్యాయవ్యవస్థ ప్రజల ఆకాంక్షలకు, రాజ్యాంగంలో పొందుపరచబడిన ఆదర్శాలకు మధ్య వారధిగా పనిచేస్తుందని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఉద్ఘాటించారు. శుక్రవారం ఖాట్మండ్‌లో జరిగిన నేపాల్‌ఇండియా జ్యుడీషియల్ డైలాగ్ 2025లో ఆయన ప్రసంగించారు. కేవలం వివాదాలను పరిష్కరించడం మాత్రమే న్యాయవ్యవస్థ విధి కాదని, న్యాయం, సమానత్వం, మానవ గౌరవం ఇనుమడించే సూత్రాలను ఆచరణలో పెట్టడం కూడా న్యాయవ్యవస్థ విధి అని ఆయన నొక్కిచెప్పారు. 'రెండు దేశాలలోనూ న్యాయవ్యవస్థ ప్రజల స్ఫూర్తికి, రాజ్యాంగంలో పొందుపర్చబడిన ఆదర్శాలకు మధ్య వారధిగా పనిచేస్తుంది. వివాదాలను పరిష్కరించడమే కాకుండా న్యాయం, సమానత్వం, మానవ గౌరవాన్ని పెంపొందిచడం ఆచరణలో పెట్టుకోవాలి' అని కోరుతున్నానన్నారు. న్యాయస్థానాలు సమయోచిత ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చట్టాలను వివరించడం ద్వారా పాలన పరిణామాలకు మార్గనిర్దేశనం చేయగలవని, ప్రజలను ప్రేరేపించగలవని సిజెఐ గవాయ్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని బలోపేతం చేసేందుకు సుప్రీంకోర్టు కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

దేశం విడిచివెళ్లకుండా నిఘా



**న్యూఢిల్లీ :** బాలీవుడ్ నటి శిల్పాశెట్టితోపాటు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 60 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి సంబంధించిన చీటింగ్ కేసులో ముంబయి పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం వారిపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. శిల్పాశెట్టి దంపతులు తరచూ అంతర్జాతీయ పర్యటనలు చేపడుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. 60 కోట్ల రుణం, పెట్టుబడులకు సంబంధించి ఆర్థిక ఒప్పందం చేసుకున్న ఒక వ్యాపారవేత్తను శిల్పా దంపతులు మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. నిందితులు దేశం విడిచివెళ్లకుండా వారిపై నిఘా ఉంచడం కోసం లుకౌట్ నోటీసులు జారీ చేస్తారు. ఫలితంగా ఇమ్మిగ్రేషన్, సరిహద్దు నియంత్రణ పాయింట్ల వద్ద అధికారులు నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుంది. కాగా, ముంబయి చెందిన దీపక్ కొఠారీ అనే వ్యాపారవేత్త నటి శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2015లో రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా శెట్టి కుంద్రాతో తనకు పరిచయం ఏర్పడిందని దీపక్ ఫిర్యాదులో చెప్పారు. అప్పుడు వీరు ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫామ్ అయిన బెస్ట్ డీల్ టీవీకి డైరెక్టర్లుగా ఉన్నారని, అప్పటికి ఆ కంపెనీలో 87 శాతం కంటే ఎక్కువ వాటా ఉందని పేర్కొన్నారు. అయితే 20152023 మధ్య కాలంలో వ్యాపార విస్తరణ కోసం దీపక్ వీరికి రూ. 60.48 కోట్లు ఇవ్వగా, ఆ నిధులను శెట్టి తన వ్యక్తిగతంగా ఖర్చు చేశారని వాపోయారు. 2015 ఏప్రిల్‌లో మొదటి విడతగా రూ. 31.95 కోట్లు ఇచ్చానని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015 జులై, 2016 మార్చి మధ్య రూ. 28.54 కోట్లు అదనంగా బదిలీ చేశానని చెప్పారు. అలా మొత్తంగా రూ. 60.48 కోట్లుకు పైగా బదిలీ చేశానని చెప్పుకొచ్చారు. ఓ సమావేశం నిర్వహించి డబ్బును సకాలంలో తిరిగి ఇస్తామని శెట్టి హామీ ఇవ్వడంతో ఒప్పందం కుదిరినట్లు దీపక్ వివరించారు. కానీ నెల తర్వాత సెప్టెంబర్‌లో శెట్టి కంపెనీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆ కంపెనీపై రూ. 1.28 కోట్ల దివాలా కేసు బయటపడిందని, ఈ విషయాన్ని బయటకి చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఉక్రేన్‌లోని విదేశీ దళాలే లక్ష్యం

ఆతర్వాత శాంతి ఒప్పందంపై సంతకం చేస్తామన్న పుతిన్

**కైవ్:** ఉక్రేన్‌తో శాంతి ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు, అక్కడ మోహరించిన విదేశీ దళాలనే లక్ష్యంగా చేసుకుంటామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. మాస్కో దళాలు ఈ లక్ష్యంవైపే ముందడుగు వేస్తాయన్నారు. యూరోపియన్ నాయకులు సంభావ్య శాంతి పరిరక్షక దళానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించిన కొన్ని గంటల్లోనే పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇప్పుడు పోరాటం కొనసాగుతున్నదని, కాబట్టి ఉక్రేన్‌లో విదేశీ దళాలు ఏవైనా కనిపిస్తే, అవే తమ చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయని రష్యా తూర్పు నగరమైన వ్లాడివోస్టాక్‌లో జరిగిన ఆర్థిక ఫోరమ్ ప్యానెల్‌లో పాల్గొన్న పుతిన్ పేర్కొన్నారు. శాంతి ఒప్పందం తర్వాత కూడా ఉక్రేన్‌లో శాంతి పరిరక్షక దళాలను రష్యా ఉంచుతుందనే వార్తలను పుతిన్ తోసిపుచ్చారు. ఉక్రేన్‌తో శాంతి ఒప్పందానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన పునరుద్ఘాటించారు.

## నకిలీ ఐఎఎస్ అధికారి గుట్టురట్టు..

లక్నో: నకిలీ ఐఎఎస్ అధికారి గుట్టురట్టయ్యింది. పలు లగ్జరీ కార్లతో అతడు బిల్డప్ ఇచ్చాడు. కార్లపై నీలి బీకాన్లు అమర్చాడు. నకిలీ పాసులతో సచివాలయంలోకి ప్రవేశించేవాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతోపాటు సీనియర్ అధికారులతో సమావేశాలు కూడా నిర్వహించాడు. బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. గౌతమ్ బుద్ధ నగర్‌కు చెందిన 36 ఏళ్ల సౌరభ్ త్రిపాఠి కంప్యూటర్ సైన్స్‌లో బిటెక్ పూర్తి చేశాడు. ఒక ఎన్‌జిఒ సంస్థను ఏర్పాటు చేశాడు. దీని కోసం చాలా మంది సీనియర్ అధికారులు, నాయకులను కలిశాడు. ఈ సందర్భంగా అధికారుల తీరు, వారి ప్రవర్తనను నిశితంగా గమనించాడు. సీనియర్ అధికారిగా బిల్డప్ ఇచ్చేందుకు మూడు ఇన్నోవాలతోపాటు రేంజ్ రోవర్ డిఫెండర్, మెర్సిడెస్ బెంజ్, టయోటా ఫార్చ్యూనర్ వంటి సూపర్ లగ్జరీ కార్లను కాన్వాయ్‌లో వినియోగించాడు. కార్లపై నీలి బీకాన్లు అమర్చాడు. 'ఉత్తరప్రదేశ్ విధాన సభ, విధాన పరిషత్, సెక్రటేరియట్, భారత ప్రభుత్వం' అని ఉన్న స్టిక్కర్లు వినియోగించేవాడు.

## ఆర్టికల్ 15(5)ను అమలు చేసేలా
# పార్లమెంట్‌లో చట్టం చేయాలి

కాంగ్రెస్ ఎస్‌సి విభాగం డిమాండ్



**న్యూఢిల్లీ :** ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రిజర్వేషన్లకు సంబంధించిన ఆర్టికల్ 15(5)ను అమలు చేయడానికి వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రభుత్వం చట్టం తీసుకురావాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. తన వాదనను బలపరిచేందుకు ప్రతిపక్ష పార్టీ పార్లమెంటరీ కమిటీ నివేదికను ఉదహరిస్తూ ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి కమ్యూనిటీ విద్యార్థులు తక్కువగా ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొంది. ఆదివాసీ కాంగ్రెస్ చీఫ్ విక్రాంత్ భూరియా, పార్టీ ఒబిసి విభాగాధిపతి అనిల్ జైహింద్‌లతో కలిసి సంయుక్త విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ఎస్‌సి విభాగం చీఫ్ రాజేంద్ర పాల్ గౌతమ్ మాట్లాడుతూ దేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉందని, అయితే అక్కడ రిజర్వేషన్లు అమలు చేయకపోవడం, డబ్బు లేకపోవడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల పిల్లలు అందులో విద్య అభ్యసించలేకపోతున్నారన్నారు. ఈ కారణంగానే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం చేసిందన్నారు. కానీ ప్రజలు దీనిని వ్యతిరేకిస్తూ కోర్టుకు వెళ్లారని, ఆ తరువాత 2008లో రిజర్వేషన్లపై నిర్ణయం సరైనదని సమర్థిస్తూ ఒక ప్రకటన వచ్చిందన్నారు. తర్వాత 2011లో కూడా ప్రైవేట్ విద్యా సంస్థలలో రిజర్వేషన్లపై నిర్ణయాన్ని కోర్టు సమర్థించిందన్నారు. 2014లో సుప్రీంకోర్టు కూడా ఈ చట్టం చెల్లుబాటు అవుతుందని ప్రకటించిందని, ఇది చట్టబద్ధంగా అనుకూలంగా ఉందని చెప్పిందని గౌతమ్ గుర్తుచేశారు. గత సంవత్సరం పార్లమెంటు కమిటీ వివిధ సంస్థలతో చర్చలు జరిపిందని, ఆ తర్వాత ప్రైవేట్ విద్యా సంస్థలలో షెడ్యూల్డ్ కులాల నుండి 0.89% విద్యార్థులు, షెడ్యూల్డ్ తెగల నుండి 0.53% విద్యార్థులు, ఒబిసిల నుండి 11.16% విద్యార్థులు మాత్రమే ఉన్నారని తేలిందన్నారు. సామాజిక సమానత్వం తీసుకురావాలంటే ఓటు హక్కు, రిజర్వేషన్లు ఉండాలని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పారని భూరియా అన్నారు. కానీ బిజెపి పాలకులు ఓటు హక్కు, రిజర్వేషన్ రెండింటినీ దొంగిలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను క్రమంగా మూసివేసే కుట్ర జరుగుతుందని, ఆపై మొత్తం విద్యా వ్యవస్థను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే యత్నాలు సాగుతున్నాయని మండిపడ్డారు. 11 గడిచినా మోదీ ప్రభుత్వం యుపిఎ ప్రభుత్వం చేసిన ఈ చట్టంపై ఎలాంటి చర్య తీసుకోలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు సంబంధించి చట్టం చేసిందని, సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని అమలు చేయాలని పేర్కొందని, కానీ మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తోందని జైహింద్ ఆరోపించారు. ఆగస్టు 20, 2025న పార్లమెంటుకు విద్యపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఇచ్చిన నివేదికను ఉటంకిస్తూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని అమలు చేసే చట్టాన్ని ప్రభుత్వం ఆమోదించాలని ఏకగ్రీవంగా సిఫార్సు చేసిందని వారు ఎత్తి చూపారు. మోదీ ప్రభుత్వం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫార్సును పరిగణనలోకి తీసుకుని పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని అమలు చేసే చట్టాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్ చేస్తోందన్నారు.

## గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సుదీర్ఘకాలంగా తగ్గుతున్న నిధులు

పథకం డిమాండ్ దార్శనికతను మోదీ ప్రభుత్వం ఎద్దేవా చేస్తోంది : కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం సుదీర్ఘకాలంగా గ్రామీణ ఉపాధిహామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తోందని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఈ పథకం డిమాండ్ ఆధారిత దార్శనికతను ఎద్దేవా చేస్తోందని విమర్శించింది. నిజ ఆదాయ వృద్ధిని ప్రారంభించడానికి గణనీయమైన బడ్జెట్ పెంచాలని, రోజుకు కనీస వేతనం రూ. 400 ఇవ్వాలనే తన డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. గ్రామీణ ఉపాధిహామీ పథకం చట్టంగా మారి 20 ఏళ్ల పూర్తి చేసుకున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద సాంఘిక సంక్షేమ పథకం సాధించిన అనేక విజయాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలన్నారు. మోదీ ప్రభుత్వంలో ఈ పథకం అనిశ్చితిలో ఉందని, దీనిపై అందరం కలిసి పోరాడాలని శుక్రవారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ నిబంధనలు ప్రభుత్వ పథకాలకు కేటాయించిన మొత్తం బడ్జెట్‌లో ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో 60 శాతానికి పైగా ఖర్చు చేయడాన్ని నిషేధించాయని ఆయన అన్నారు. అయితే మంత్రిత్వ శాఖ ఐదు నెలల్లోనే తన బడ్జెట్‌లో 60 శాతాన్ని గాలికొదిలేసిందని, దీంతో భారతదేశంలోని కోట్లాది గ్రామీణ కుటుంబాల భవిష్యత్తు ఏమిటనే దానిపై ప్రశ్నార్థక గుర్తును మిగిల్చింది అని రమేష్ అన్నారు. ఈ 'తాజా సంక్షోభం' ఒక భ్రాంతి కాదని, మోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అణచివేయడానికి చేసిన పెద్ద ప్రయత్నానికి ప్రతిబింబమని ఆయన అన్నారు. గత పదకొండు సంవత్సరాలుగా ఈ పథకం దీర్ఘకాలికంగా నిధుల కొరత ఎదుర్కొంటోందన్నారు. అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ గత మూడు సంవత్సరాలుగా బడ్జెట్ స్థిరంగా ఉందని, ఈ పథక డిమాండ్ ఆధారిత దృక్పథాన్ని అపహాస్యం చేస్తుందని మండిపడ్డారు. కోట్లాది మంది కార్మికులకు అవసరమైనప్పుడు పనిని పొందలేకపోతున్నారని రమేష్ అన్నారు. కార్మికులకు చెల్లింపుల్లో చట్టబద్ధమైన 15 రోజుల వ్యవధి ఎక్కువగా తరుచూ ఆలస్యమవుతున్నాయని, అయినా ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదన్నారు. ప్రతి సంతవ్సరం గత ఏడాది బకాయిలు చెల్లించేందుకే కేటాయించి మొత్తం బడ్జెటంలో 20–30 శాతం బడ్జెట్ వెళ్తుందన్నారు. గత పదకొండు సంవత్సరాలుగా ఉపాధిహామీ పథకం వేతనాలు చాలా తక్కువగా పెంచబడ్డాయి, ఫలితంగా ఆదాయం నిలిచిపోయే విస్తృత సంక్షోభం ఏర్పడిందని ఆయన అన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం పేరుతో ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్‌ఎంఎంఎస్) యాప్, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఎబిపిఎస్) వంటి మినహాయింపు సాంకేతికతను ప్రవేశపెట్టిందని, దీని వల్ల రెండు కోట్ల మందికి పైగా కార్మికులు పని, చెల్లింపునకు చట్టబద్ధమైన హక్కును పొందకుండా నిరోధించిన సంకేతాలు కనబడుతున్నాయని అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. బడ్జెట్‌ను గణనీయంగా పెంచాలని, సకాలంలో వేతనాల చెల్లింపుపై విధానాన్ని కఠినంగా అమలు చేయాలని పిలుపునిచ్చినట్లు రమేష్ చెప్పారు.

## ఆ వ్యాఖ్యలు తప్పుదారి పట్టించేలా ఉన్నాయ్

ట్రంప్ సలహాదారుడు నవారోపై భారత్ ఫైర్



భారత్‌పై అక్కసు వెళ్లగక్కిన నవారో

**న్యూఢిల్లీ :** ఇటీవల కాలంలో ఇండియాను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారుడు పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలను భారత్ ఖండించింది. అవి సరైనవి కావని, తప్పుదారి పట్టించే వ్యాఖ్యలని మండిపడింది. ఈ మేరకు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'పీటర్ నవారో చేసిన తప్పుదారి పట్టించే ప్రకటనలను మేము చూశాం. వాటిని ఖండిస్తున్నాం. భారత్–యుఎస్ మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యం ఉంది. మేము ఇరుదేశాల సంబంధాలను ముందుకు తీసుకెళ్లాలనుకుంటున్నాం. ఇండియా అమెరికా సంబంధాలు చాలా ముఖ్యమైనవి. రెండు దేశాలు సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటాయి. ఇది వారి ఉమ్మడి ఆసక్తులు, ప్రజాస్వామ్య విలువలు, బలమైన సంబంధాలతో ముడిపడి ఉంది. ఈ భాగస్వామ్యం అనేక మార్పులు, సవాళ్లను తట్టుకుంది. భారత్, అమెరికా కట్టుబడి ఉన్న ముఖ్యమైన అజెండాపై మేం దృష్టి సారించాం. పరస్పర గౌరవం, ఉమ్మడి ఆసక్తుల ఆధారంగా ఈ సంబంధం ముందుకు సాగుతుందని భారత్ ఆశిస్తోంది' అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. క్వాడ సమ్మిట్, భారత్–యుఎస్ సంబంధాల గురించి కూడా రణధీర్ జైస్వాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్య సమస్యలపై భారత్ అమెరికాతో చర్చలు జరుపుతోందన్నారు. క్వాడ్ ను సభ్య దేశాల అనేక ఉమ్మడి ప్రయోజనాలపై చర్చించడానికి విలువైన వేదికగా తాము భావిస్తున్నామని అన్నారు. క్వాడ సభ్య దేశాల మధ్య దౌత్యపరమైన సంప్రదింపుల ద్వారా ఆ శిఖరాగ్ర సమావేశం షెడ్యూల్ ఖరారు అవుతుందని వెల్లడించారు.

ఇటీవల కాలంలో భారత్‌పై ట్రంప్ వాణిజ్య సలహాదారుడు నవారో అక్కసు వెళ్లగక్కారు. పలు మార్లు ఇండియాపై విమర్శలు గుప్పించారు. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలను సమర్థించారు. రష్యా నుంచి భారత్ చౌకగా ముడి చమురు కొనుగోలు చేస్తోందన్నారు. దానిని శుద్ధి చేసి అధిక ధరలకు విక్రయించి లాభపడుతోందని ఆరోపించారు. ముడి చమురును విక్రయించడం ద్వారా రష్యాకు భారత్ 'లాండ్రోమాట్' లాగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తద్వారా ఉక్రెయిన్ తో యుద్ధంలో రష్యా నిధులు సమకూర్చుకోవడానికి సహాయపడుతోందని పేర్కొన్నారు. అలాగే భారత్‌పై డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను సమర్థించే నేపథ్యంలోనే నవారో మాట జారారు. భారత్‌లో కులతత్వాన్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యానించారు. రష్యా నుంచి చౌకగా చమురును కొనడం వల్ల భారత ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెబుతున్నప్పటికీ, ఓవర్గీయులు మాత్రమే లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. భారత ప్రజల పేరుతో ఓ వర్గానికి లబ్ధిని చేకూరుస్తున్నారని, దీన్ని ఆపాల్సిన అవసరం ఉందని ఆరోపించారు. భారతీయ వస్తువులను అమెరికాకు దిగుమతి చేస్తారని, కానీ తమ వస్తువులను ఇండియా విక్రయించనివ్వరని అక్కసు వెళ్లగక్కారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారత్ పుతిన్, జిన్‌పింగ్‌తో ఎందుకు సన్నిహితంగా ఉంటుందో అర్థం కావట్లేదన్నారు.

# ఆలస్యంగానైనా మేల్కొన్న కేంద్రం

ఎట్టకేలకు సరుకులు, సేవల పన్ను (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ – జిఎస్‌టి)లో జిఎస్‌టి కౌన్సిల్ కీలక మార్పులను తీసుకువచ్చింది. ఈ నెల 22వ తేదీ నుంచి అమలులోకి రానున్న కొత్త జిఎస్ టి–2.0లో స్లాబులను సున్నా శాతానికి, 5 శాతానికి, 18 శాతాలకు పరిమితం చేశారు. అనేక నిత్యావసరాల పన్నులను తగ్గించి, ఈ స్లాబులలో సర్దుబాటు చేశారు. గతంలో ఉన్న 0, 5, 12, 18, 28 శాత ం జిఎస్‌టి స్లాబులలో 12, 28 శాతాలు రద్దు కాబడ్డాయి.అదనంగా గతంలో మాదిరిగానే విలాస వస్తు, సేవలపై 40 శాతం సిన్ ట్యాక్స్‌ను కొనసాగిస్తున్నారు.

అమెరికా అసమంజస టారిఫ్ ఒత్తిళ్ళు, దేశీయ వినిమయ మందగమనం, అడుగంటిన పొదుపు, పెరుగుతున్న కుటుంబ రుణభారం వంటి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అనివార్యంగా ఎన్నిమిదేళ్ళుగా జిఎస్‌టి పన్నులతో నడ్డివిరిగిన సామాన్యులకు ఉపశమనం కల్పించాల్సి వచ్చింది. అనేక చర్చోపచర్చలు, మేధోమథనాల ఫలితంగా 2017 జూలై 1 నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చింది. 'ఒకే దేశం– ఒకే పన్ను' నినాదంతో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా పార్లమెంటు ఉభయ సభలు సెంట్రల్ హాల్‌లో అర్ధరాత్రి సమావేశపరిచి మరీ, ప్రత్యేక గంటను కొట్టి కేంద్రీకృత జిఎస్‌టి పన్నులకు పచ్చ జెండా ఊపింది. ఈ కార్యక్రమాన్ని నాడు ప్రతిపక్షాలు బహిష్కరించాయి. నాటి నుంచి పన్నుల మోతతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు, జిఎస్‌టి ఫైలింగ్‌లో అపసవ్యాలతో చిన్న, మధ్య తరహా వ్యాపారులు సతమతమవుతూనే ఉన్నారు. దీనికి తోడు పిడిగుపడినట్లుగా దాపురించిన మహమ్మారి కరోనా ప్రజల ఆర్థిక కష్టాలను అనేక రెట్లు పెంచింది. అనేక మంది చిరు, మధ్య తరహా వ్యాపారాలు మూతపడడమే కాకుండా, లక్షల మంది ఉద్యోగ, ఉపాధి కోల్పోయారు. ఇన్ని జరిగినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కనికరం చూపలేదు. కళ్ళు మూసుకొని ప్రజల నుంచి ముక్కు పిండి మరీ జిఎస్‌టిని వసూలు చేసింది. ఏటేటా పన్ను వసూళ్ళలో నూతన రికార్డులను సృష్టిస్తూ, ప్రపంచంలోనే తృతీయ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని గొప్పలకు పోయింది.

చివరకు అమెరికా అధ్యక్షుడు తెంపరి ట్రంప్ భారత దేశంపై 25 శాతం టారిఫ్‌లను విధించడంతో పాటు, రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు అదనంగా 25 శాతం అపరాధ టారిఫ్ విధింపుతో 50 శాతానికి పెరిగింది. ఇది టెక్స్‌టైల్స్, డైమండ్స్, మ్యానుఫాక్చరింగ్ రంగాలపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా, అనేక మంది ఇప్పటికే ఉద్యోగాలు కోల్పోయినట్లు వార్తలు వస్తున్నాయి. విపరీతంగా పెరిగిన అసమానతలతో కష్టాల కడలిలో సాగుతున్న దేశ ప్రజలపై తాజా పరిణామాలు శరాఘాతంగా పరిణమిస్తున్నాయి. అందుకే కుంభకర్ణ నిద్ర నుంచి మేల్కొన్న కేంద్ర సర్కార్ జిఎస్‌టి పన్నులను తగ్గించేందుకు పూనుకుంది. గత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ దీపావళి కానుకగా రెండవ తరం జిఎస్‌టి సంస్కరణలను అమలు చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు సభ్యులుగా ఉండే జిఎస్‌టి కౌన్సిల్ 56వ సమావేశంలో పన్నుల మార్పులు చేర్పుల నిర్ణయం తీసుకున్నారు. ఆలస్యమైనప్పటికీ స్వాగతించాల్సిన నిర్ణయమే. జిఎస్‌టి కౌన్సిల్‌లో కేంద్రం, రాష్ట్రాలు సమానమని, నిర్ణయాలు సమష్టిగా జరుగుతాయని చెప్పుకుంటున్నప్పటికీ కేంద్రమే నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ప్రధాని ఆగస్టు 15 ప్రకటన తెలియజేస్తున్నది.

ప్రజాపక్షం
06-09-2025, శనివారం

జిఎస్‌టి హేతుబద్ధీకరణ తరువాత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలపై పన్నును 18 శాతం నుంచి సున్నాకు, అన్ని రకాల మందులు, ఔషధాలపై 12 శాతం, వైద్య పరికరాలపై 18 శాతం నుంచి 5 శాతానికి, పౌడర్, షాంపూ, టూత్ బ్రష్‌లు, హెయిర్ ఆయిల్‌లపై 18 శాతం నుంచి 5 శాతం, డైపర్లు, నాప్‌కిన్‌లు, దువ్వెనలపై 12 శాతం నుంచి 5 శాతం, రూ.7500 వరకు హోటల్ అద్దెపై 12 నుంచి 5 శాతం, కేకులు, బిస్కెట్‌లు, కార్న్ ఫ్లేక్స్, కాఫీ, ఐస్‌క్రీమ్‌లపై 18 నుంచి 5 శాతం, వెన్న, నెయ్యి, చీజ్, పాల పదార్థాలు, చేప నూనెలపై 12 నుంచి 5 శాతం, కార్లపై 28 నుంచి 18 శాతం, బైకులు, సైకిళ్ళపై 12 నుంచి 5 శాతానికి తగ్గించారు.

తగ్గింపుతో పాటు కొన్నిటిపై పన్నులు పెంచారు. వాటిలో పాన్ మసాలా, క్యాసినో, రేస్ క్లబ్, ఖరీదైన మోటార్ సైకిళ్ళు, సిగరెట్లుపై జిఎస్‌టిని 28 నుంచి 40 శాతం పెంచడం మంచి పరిణామమే. కానీ, లేబర్ ఛార్జీలపై జిఎస్‌టిని 12 నుంచి 18 శాతానికి పెంచడం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు ఇబ్బందికరం. అలాగే వస్త్రాలు, పాదరక్షల విలువ రూ.2,500 దాటితే జిఎస్‌టిని 5 శాతం నుంచి 18 శాతం పెంచడంపై బేసబబు. వీటిని తక్షణమే సవరించాల్సిన సంబంధిత పారిశ్రామికవర్గాలు కోరుతున్నాయి.

అన్నిటికి మించి, జిఎస్‌టి తగ్గింపుతో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆందోళన మొదలైంది. ఆదాయం భారీగానే కోల్పోతామని, దాని ప్రభావం సంక్షేమ, అభివృద్ధి పథకాలపై పడుతుందనే ఆందోళన రాష్ట్రాలకు, ముఖ్యంగా బిజెపియేతర పార్టీలు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలకు అధికంగా ఉంది. తెలంగాణకు రూ.7వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల వరకు పన్ను ఆదాయం తగ్గుతుందని ఉజ్జాయింపు లెక్క. పైగా రాష్ట్రాలకు మొండి చేయి చూపుతూ కేంద్ర ప్రభుత్వమొక్కటే సెస్సులు, డ్యూటీల పేరుతో వసూలవుతున్న లక్షల కోట్లు జుర్రుకుంటున్నది. ఇది రాజ్యాంగం నిర్దేశించిన సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం.

వెంటనే జిఎస్‌టి తగ్గింపు భారం రాష్ట్రాలపై పడకుండా, గతంలో మాదిరిగా రాష్ట్రాలకు ఐదేళ్ల పాటు జిఎస్‌టి పరిహారమివ్వడంతో పాటు, పదహారవ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల వాటాలో రాష్ట్రాలకు 50 శాతం ఇచ్చే విధంగా సిఫార్సు చేయాలి. అలాగే తగ్గిన జిఎస్‌టి ఫలితం వినియోగదారులకు చేరితేనే ఫలితం దక్కుతుంది. వ్యాపారులు ఇదే అదునుగా ధరలు పెంచితే ప్రయాస వృథా అవడం తథ్యం.

# అమెరికా ఆధిపత్యంపై ప్రతిఘటన వేదికగా ఎస్‌సిఒ

టి.ఎన్.అశోక్

> ఉద్భవిస్తున్న రష్యా–చైనా–భారత్ కూటమి ప్రపంచ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతుంది? ఇది వాషింగ్టన్ స్వయంప్రతిపత్తి, ఐరోపా దుర్బల భద్రత, మధ్య ప్రాచ్యం సున్నిత స్థితి, దక్షిణ భూగోళం ఆర్థిక ఆకాంక్షలపై ఎలా ప్రభావం చూపుతుంది? అంతకు మించి అమెరికా ఒత్తిడిని తిరస్కరించడం ద్వారా భారతదేశం ఏమి సాధిస్తుంది?

2018 తర్వాత మొదటిసారిగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2025 ఆగస్టు మాసం చివర్లో చైనాలో అడుగుపెట్టారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) వార్షిక సదస్సు కోసం వెళ్ళిన మోదీకి చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సాదరంగా స్వాగతం పలికారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా అక్కడే ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా, అపారమైన ఇంధన వనరులు, సైనిక సామర్థ్యం గల ఈ ముగ్గురు నాయకులు కలిసిన దృశ్యం అద్భుతమైన సంఘీభావాన్ని ప్రదర్శించింది.

ఈ ప్రతీకాత్మకత తప్పక చూడాల్సిందే.. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ ఆర్థిక జాతీయవాదాన్ని ఎంచుకుని, భారతీయ ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించడం, రష్యాను పలు ఆంక్షల వలయంతో చుట్టేయడం వంటి నిర్ణయాలు తీసుకున్న సమయంలో, ఎస్‌సిఒ కేవలం ఒక ప్రాంతీయ కూటమిగా కాకుండా ఒక భౌగోళిక రాజకీయ ప్రతిఘటన శక్తిగా మారి, ప్రపంచ క్రమాన్ని పునర్నిర్వచించే అవకాశం కనిపిస్తోంది.

అయితే, ఉద్భవిస్తున్న రష్యా–చైనా–భారత్ కూటమి ప్రపంచ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతుంది? ఇది వాషింగ్టన్ స్వయంప్రతిపత్తి, ఐరోపా దుర్బల భద్రత, మధ్య ప్రాచ్యం సున్నిత స్థితి, దక్షిణ భూగోళం ఆర్థిక ఆకాంక్షలపై ఎలా ప్రభావం చూపుతుంది? అంతకు మించి అమెరికా ఒత్తిడిని తిరస్కరించడం ద్వారా భారతదేశం ఏమి సాధిస్తుంది? అమెరికా ఏమి కోల్పోవచ్చు?



2001లో ఏర్పడిన ఎస్‌సిఒ తొలినాళ్ళలో మధ్య ఆసియాలో ఉగ్రవాదం, అతివాదంపై పోరాడేందుకు ఉద్దేశించబడింది. కానీ రెండు దశాబ్దాలలో ఇది భారత్, పాకిస్తాన్‌లతో పాటు ఇరాన్ వంటి మధ్యప్రాచ్య దేశాలను కూడా కలుపుకుని విస్తరించింది. ప్రస్తుతం ఎస్‌సిఒ ప్రపంచ జనాభాలో దాదాపు 40 శాతం, ప్రపంచ జిడిపిలో పావు వంతుకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

ట్రంప్ విధించిన అధిక సుంకాలు అనుకోకుండా ఎస్‌సిఒకు కొత్త ప్రాముఖ్యతను కల్పించాయి. యూరేసియా సహకారం కోసం ఏర్పాటు చేసిన ఒక చర్చా వేదికగా కాకుండా, ఇది అమెరికా ఆధిపత్యానికి ఆర్థిక ప్రతిఘటనను అందించే ఒక వేదికగా రూపాంతరం చెందింది. 2025 సదస్సులో బహుళధృవ ప్రపంచం, సార్వభౌమాధికారం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి వంటి ఉమ్మడి అంశాలపై మోదీ, షీ, పుతిన్ ఏకకంఠంతో మాట్లాడారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా పాశ్చాత్య దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా తన మనుగడ కోసం చైనా, భారత్‌పై అధికంగా ఆధారపడింది. భారత్‌కు చమురు ఎగుమతులు రికార్డు స్థాయికి పెరిగాయి. అదే సమయంలో రష్యాకు గ్యాస్, రక్షణ సహకారానికి ప్రధాన మార్కెట్‌గా చైనా ఉంది. ఇప్పుడు మాస్కో ఎస్‌సిఒను కేవలం ఒక వేదికగా కాకుండా చట్టబద్ధతకు జీవన రేఖగా చూస్తోంది.

ట్రంప్ విధించిన అధిక సుంకాలు ఎగుమతుల ఆధారిత చైనా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. అదే సమయంలో వాషింగ్టన్ అధునాతన సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు 5 జి సాంకేతికతపై నియంత్రణను కఠినతరం చేసింది. రష్యా, భారత్‌లతో సంబంధాలను పెంపొందించుకోవడం ద్వారా షీ ప్రత్యామ్నాయ మార్కెట్లను, భద్రతా భాగస్వామ్యాలను, అమెరికా ఆర్థిక యుద్ధానికి వ్యతిరేకంగా తమ శక్తిని నిరూపించుకోవాలని చూస్తున్నారు.

ఇప్పుడు భారత్ ఆసక్తికరమైన ఆటగాడిగా ఉంది. సంప్రదాయంగా (సోవియెట్ యూనియన్ పతనం అనంతరం)వాషింగ్టన్, మాస్కో మధ్య సమతుల్యతను పాటిస్తున్న న్యూఢిల్లీ ఇప్పుడు దేశంలో అత్యధిక శ్రమశక్తి అవసరమయ్యే వజ్రాలు, ఆభరణాలు, వస్త్ర ఎగుమతులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాల సమస్యను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితులకు లొంగిపోకుండా, మోదీ ఎస్‌సిఒ వేదికను భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని నిరూపించుకోవడానికి ఉపయోగించుకుంటున్నారు. తమకు అవసరమైనప్పుడు రష్యా, చైనాలతో కలిసి ముందుకు సాగుతూనే, పాశ్చాత్య దేశాలకు ద్వారాలను తెరిచి ఉంచుతున్నారు.

ఈ అవసరాల కూటమి బయటి ఒత్తిడి వల్ల ఏర్పడింది తప్ప సైద్ధాంతిక అనుబంధం వల్ల కాదు. అయితే, 21వ శతాబ్దపు భౌగోళిక రాజకీయాల గమనాన్ని నిర్ణయించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

అమెరికన్ ఉద్యోగాలను రక్షించడం, ప్రత్యర్థులను దెబ్బతీయడమే ట్రంప్ సుంకాల వ్యూహం లక్ష్యం. కానీ ఆచరణలో ఇది అమెరికా ప్రపంచ ఆధిపత్యం విచ్ఛిన్నం వేగవంతం చేసేందుకు దారితీసే ప్రమాదం ఉంది. చైనా, భారత్, రష్యాలను మరింత దగ్గరగా చేర్చడం ద్వారా వాషింగ్టన్ అపారమైన ఇంధన వనరులు, తయారీ సామర్థ్యం, సైనిక పాటవం కలిగిన ఒక యూరేసియా కూటమి ఆవిర్భావం అనే పీడకలను ఎదుర్కోవచ్చు. ఎస్‌సిఒ దేశాల మధ్య అంతర్గత వాణిజ్యం వృద్ధి చెందుతున్నందున, అమెరికా ఎగుమతిదారులు మార్కెట్లను కోల్పోవచ్చు. భారత్, చైనా మధ్య ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, అమెరికా ఆంక్షలను అధిగమించడానికి సరఫరా గొలుసులలో సహకరించుకోవచ్చు. రష్యా ఇప్పటికే రూబుల్ ఆధారిత చమురు లావాదేవీలను ప్రోత్సహిస్తుండగా, చైనా యువాన్‌ను ముందుకు తెస్తోంది. భారత్ రూపాయితో వాణిజ్య లావాదేవీలను ప్రయోగాత్మకం చేస్తోంది. కలిసికట్టుగా, ఈ దేశాలు డాలర్ వినియోగాన్ని తగ్గించి, అమెరికా ఆర్థిక ప్రభావాన్ని బలహీనపరచవచ్చు. చైనాకు వ్యతిరేకంగా ఒక సహజ మిత్రుడు అని భావించిన భారత్‌ను ఆర్థిక ప్రత్యర్థిగా చూడడం ద్వారా, ట్రంప్ రెండు దశాబ్దాల పాటు వాషింగ్టన్ తయారు చేసుకున్న భాగస్వామిని దూరం చేసుకునే ప్రమాదం ఉంది.

**ఇంధన సంక్షోభాలు, వృద్ధి మంగమనంతో ఇబ్బందులు పడుతున్న ఐరోపా** ఈ కొత్త కూటమిని అసౌకర్యవంతంగా చూస్తుంది. మరింత బలమైన రష్యా–చైనా–భారత్ కూటమి తూర్పు ఐరోపాలో మాస్కోకు ధైర్యాన్ని ఇవ్వవచ్చు. ఇది ఇయును వాషింగ్టన్‌పై సైనికపరంగా ఆధారపడటాన్ని పెంచుకునేలా చేస్తుంది. చైనా, భారత్ వాణిజ్య ప్రవాహాలను మళ్లించడం ద్వారా ఆసియా మార్కెట్ల నుండి ఐరోపా బయటకు నెట్టబడే ప్రమాదం ఉంది. అనేక ఐరోపా దేశాలు భారత్‌ను ఒక స్వింగ్ పవర్(ఒక పక్షంవైపు మొగ్గని శక్తి)గా చూస్తూ, దానితో సంబంధాలు పెట్టుకోవడానికి ఇష్టపడతాయి. న్యూఢిల్లీ మరీ తూర్పు వైపు మొగ్గు చూపితే, బ్రస్సెల్స్ (ఇయు) తన అత్యంత ఆశాజనకమైన ఆసియా భాగస్వామిని కోల్పోవచ్చు.

**మధ్య ప్రాచ్యానికి, ప్రత్యేకించి ఇరాన్‌కు** ఎస్‌సిఒ ఒక భౌగోళిక రాజకీయ వరంగా మారింది. ఇరాన్ 2023లో అధికారికంగా ఎస్‌సిఒలో చేరడం ద్వారా అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ టెహ్రాన్‌కు కొత్త చట్టబద్ధత వచ్చింది. ఇరాన్ చమురు, చాబహార్ పోర్ట్ వినియోగం మీద ఆధారపడిన భారత్‌కు ఇప్పుడు వాషింగ్టన్ జోక్యం లేకుండా సంబంధాలను సమతుల్యం చేసుకునే అవకాశం ఉంది. అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా కూడా ఎస్‌సిఒ చర్చలపై ఆసక్తి చూపింది. ఇది అమెరికా ప్రభావం తగ్గుతున్నందున జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తుంది. ఎస్‌సిఒలో లేదా దానికి సమీపంలో ఒక సమన్వయ రష్యా–ఇరాన్–సౌదీ–చైనా కూటమి ప్రపంచ చమురు నిల్వలను సమర్థవంతంగా నియంత్రించి, అమెరికా ప్రభావాన్ని సవాలు చేయవచ్చు.

**ఎస్‌సిఒ సదస్సు ప్రభావం దక్షిణ ఆసియాపైనా ఉంది.** సభ్య దేశంగా ఉన్న పాకిస్తాన్ చైనా, రష్యాలకు మరింత దగ్గరవుతుంది. కానీ భారత్ నాయకత్వ పాత్రను పోషిస్తుండటం చూసి ఇబ్బంది పడుతుంది. సభ్య దేశం కానప్పటికీ, ఆఫ్ఘనిస్తాన్ సుస్థిరత ఎస్‌సిఒ ఎజెండాలో ప్రధాన అంశం. అమెరికా ప్రభావం తగ్గుతున్నందున భారత్, చైనా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నాయి. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాలు అమెరికా ఆర్థిక నిర్బంధాన్ని మధ్యస్థాయి దేశాలు ప్రతిఘటించగలవని భారత్ నిరూపించడాన్ని చూస్తున్నాయి.

**ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఆగ్నేయాసియా** వ్యాప్తంగా భారత్ ధిక్కారం లోతుగా ప్రతిధ్వనిస్తుంది.. పెద్ద ఆర్థిక శక్తి దేశాల వాణిజ్య ఆంక్షలతో తరచుగా ఇబ్బందులు పడే దేశాలకు, న్యూఢిల్లీ సుంకాల ప్రభావాలను భరిస్తూ తమ స్వయంప్రతిపత్తిని నిరూపించుకోవడం ఒక ఉదాహరణగా నిలిచింది. దక్షిణాఫ్రికా, నైజీరియా వంటి దేశాలు ప్రత్యామ్నాయ పెట్టుబడుల కోసం ఎస్‌సిఒ దేశాలతో సంబంధాలను పెంచుకోవచ్చు. బ్రెజిల్ అధ్యక్షుడు లులా ఇప్పటికే బహుళధృవ ప్రపంచం కోసం పిలుపునిచ్చారు. ఎస్‌సిఒ ఆవిర్భావం దక్షిణ–దక్షిణ సహకారాన్ని వేగవంతం చేయవచ్చు. అమెరికా, చైనా మధ్య ఎంచుకోవడానికి వెనుకాడుతున్న ఆగ్నేయాసియా దేశాలు బహుళధృవ కూటమిలో భారత్‌ను ఒక తటస్థ భాగస్వామిగా చూడవచ్చు.

**ఇంధన భద్రత** విషయానికొస్తే, చౌకైన రష్యన్ చమురు, ఇరాన్ చమురు మార్గాలు, చైనా మౌలిక సదుపాయాల పెట్టుబడులు భారతదేశ వనరుల స్థావరాన్ని బలోపేతం చేస్తాయి. అమెరికా సుంకాలకు లొంగిపోవడానికి నిరాకరించడం ద్వారా, వాషింగ్టన్ ఇండోపసిఫిక్ చదరంగంలో భారత్ ఒక పావు కాదని సంకేతాలు ఇస్తుంది. ఎస్‌సిఒలో భారత్ ఒక స్వింగ్ పవర్‌గా అవతరిస్తోంది. మోదీ ధిక్కార వైఖరిని భారతదేశం పెరుగుతున్న స్థాయికి నిదర్శనంగా చూపిస్తున్నారు. ఈ ఇతివృత్తం ఆయన జాతీయవాద మద్దతుదారులకు బాగా నచ్చుతుంది.

వాషింగ్టన్ చేసిన తప్పుడు అంచనా న్యూఢిల్లీని దాని ప్రత్యర్థులకు మరింత దగ్గరగా చేర్చి, దాని 'ఇండో–పసిఫిక్ వ్యూహం'ను బలహీనపరుస్తుంది. బలవంత సుంకాలు బదులుగా భారతదేశ మార్కెట్లను వైవిధ్యపరచి, అమెరికా వాణిజ్యంపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు. విచక్షణారహితంగా సుంకాలు, ఆంక్షలను ఆయుధంగా ఉపయోగించడం ద్వారా, అమెరికా ఒక నాయకుడిగా కాకుండా ఒక బెదిరించే శక్తిగా కనిపించే ప్రమాదం ఉంది. ఎస్‌సిఒ దేశాలు సమర్థవంతంగా సమన్వయం చేసుకుంటే, మధ్య ఆసియా, దక్షిణ ఆసియా, మధ్య ప్రాచ్యంలో కూడా అమెరికా ప్రభావం తగ్గుతుంది.

అవకాశాలు ఉన్నప్పటికీ, ఈ త్రిపక్ష కూటమిలో సమస్యలు లేకపోలేదు. భారత్–చైనా సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వివాదాస్పద హిమాలయ సరిహద్దు అస్థిరంగా ఉండడమే కాక విశ్వాసం చాలా తక్కువ. చైనాకు జూనియర్ భాగస్వామిగా మారతానేమోనని రష్యా భయపడుతుంది. బీజింగ్ బెల్ట్ అండ్ రోడ్ ఆధిపత్యాన్ని భారత్ ఇష్టపడదు. చైనా జిడిపి భారత్, రష్యా దేశాల మొత్తం జిడిపి కన్నా ఎక్కువ. ఇది సమతుల్యతపై ప్రశ్నలను లేవనెత్తుతుంది. కాబట్టి, ట్రంప్ సుంకాలు వాటిని దగ్గర చేసినప్పటికీ, వాటి సహకారం కేవలం లావాదేవీల వరకు మాత్రమే ఉండవచ్చు, పెనుమార్పులు తీసుకురాకపోవచ్చు.


2025 ఎస్‌సిఒ సదస్సు కేవలం ఒక దౌత్య ఫోటో అవకాశం కన్నా ఎక్కువ. ఇది ప్రపంచం మారుతోందని, అమెరికా సుంకాలు, ఆంక్షలు వాషింగ్టన్ భయపడుతున్న బహుళధృవ ప్రపంచాన్ని వేగవంతం చేస్తున్నాయని తెలియజేస్తుంది. మోదీ, షీ, పుతిన్‌లకు ప్రపంచ వాణిజ్యం, ఇంధనం, భద్రత నియమాలను తమ సొంత నిబంధనలపై తిరిగి రూపొందించడానికి ఇది ఒక అవకాశం. ట్రంప్‌కు ఇది అమెరికాను ఏకాకిగా చేసి దాని ప్రత్యర్థులకు సాధికారతను కల్పించే ఒక ప్రమాదకరమైన జూదం.

అవసరాల కూటమి (ఆక్సిస్ ఆఫ్ నెసిసిటీ) ఒక చెదరని కూటమి కాకపోవచ్చు, కానీ ఇది ఒక హెచ్చరిక. తిరుగులేని అమెరికా స్వయంప్రతిపత్తి శకం మసకబారుతోంది. .యూరేసియా ఒక భౌగోళిక రాజకీయ శక్తి కేంద్రంగా ఎదుగుతోంది.

ప్రపంచం దీనిని ఏకధృవ ఆధిపత్యం నుండి విముక్తిగా చూస్తుందా లేదా కొత్త పోటీల ఆరంభంగా చూస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది. కానీ ఒక నిజం మాత్రం స్పష్టం. వాషింగ్టన్ పట్టును సడలించడానికి ఉత్సాహంగా ఉన్న ప్రపంచానికి భారతదేశం తిరస్కార వైఖరి అందరూ ఒక వేదికపైకి వచ్చేందుకు అవకాశంగా మారింది.

(ఐపిఎ సర్వీస్)

# జ్ఞాన దేవాలయం పుస్తకం



పుస్తకం విజ్ఞాన భాండాగారం. పుస్తకం హస్తభూషనమే కాదు మస్తిష్క వికాస సాధనం. సరస్వతి కొలువైన దేవాలయం గ్రంధాలయమే. విజ్ఞాన సమపార్జనకు మూల సూత్రం పుస్తక పఠనం. జ్ఞాన వితరణ మాధ్యమం పుస్తకమే. పుస్తకాన్ని నమ్మిన వాడు మహాజ్ఞాని అవుతాడు. పుస్తకాన్ని వ్యతిరేకించిన వాడు నిక్కంగా అపర అజ్ఞాని అవుతాడు. ఒక పుస్తకం వేల మెదళ్లను వెలిగించే జ్ఞానదీపం. గ్రంధాలయంలో పుస్తక దర్శనంతో మనో విస్తృతి విస్తరిస్తుంది, ప్రపంచం కళ్ల ముందు కదలాడుతుంది. పుస్తక పఠన ప్రాధాన్యాన్ని గుర్తించిన పౌర సమాజం ప్రతి ఏట 06 సెప్టెంబర్ రోజున ప్రపంచవ్యాప్తంగా జాతీయ పుస్తక పఠన దినోత్సవం (నేషనల్ రీడ్ ఏ బుక్ డే)ను నిర్వహించుట ఆనవాయితీగా మారింది. పుస్తకాలు చదవడం ఓ నిత్య అభిరుచిగా మారాలి. మనం చదువుకున్న రోజుల్లో పాఠ్య పుస్తకాలు చదువుతాం, ఉద్యోగ ఉపాధుల్లో మునిగినపుడు కూడా తీరిక సమయాల్లో పలు ఆసక్తికర పుస్తకాలను పఠించడం అనబడే అలవాటును కొనసాగించాలి. ఈ రోజున ప్రత్యేకంగా పిల్లలు లేదా సీనియర్ సిటిజన్స్ సమక్షంలో వారికి నచ్చిన కథలు లేదా ఆసక్తికర అంశాలకు సంబంధించిన పుస్తకాలను గట్టిగా చదివి వినిపించడం కూడా చేయవ చ్చు. దీనివల్ల మనకే కాకుండా విన్నవారికి కూడా జ్ఞానం కొంతవరకైనా అబ్బుతుంది. పుస్తకాలు వెలకట్టలేని వినోదాలు, విజ్ఞానాన్ని అందించే ఉపకరణాలు, కాలయంత్రాలు కూడా. కామిక్ పుస్తకాలు, ఈపుస్తకాలు, ఆడియో పుస్తకాలు కూడా నేటి డిజిటల్ ప్రపంచంలో అందుబాటులోకి రావడం శుభపరిణామం. పిల్లలతో రోజు 10 నిమిషాలు కథల పుస్తకాలు చదవడంతో వారి లో ఆశావహ దృక్పథం క్రమంగా పెరుగుతుందని గమనించారు. డిజిటల్ అంతర్జాల వలలో విశ్వమే కుగ్రామం అయ్యింది. చందమామ కథలు, బాలమిత్ర చతురతలు అంతరించాయి. బామ్మ ఒడికి దూరమై గూగులమ్మ పంచన చేరుతున్నారు యువత. పిల్లలతో పాటు పెద్దలు సహితం పుస్తకపఠనాన్ని త్యాగం చేసి చరవాణి/ల్యాప్‌టాప్/ట్యాబ్‌లతో స్నేహం చేస్తున్న విచిత్ర ఏఐ యుగం నడుస్తున్నది. విశ్వ మానవాళిని పుస్చక పఠనం వైపు ఆకర్షించడానికి, గ్రంధాలయాల ప్రాధాన్యాలను ఏకరువు పెట్టడానికి జాతీయ పుస్తక పఠన దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం సముచితంగా ఉన్నది. ఈ దినోత్సవంలో భాగంగా మనకు నచ్చిన ఒక కొత్త పుస్తకాన్ని చదవడం, పుస్తక పాఠక ప్రేమికులను సన్మానించుకోవడం, పుస్తక పఠన ప్రయోజనాలు, రచయితలను గుర్తించడం, ఉన్నత స్థితులకు ఎదిగిన మేధావులను సన్మానించుకోవడం, విద్యాలయాల్లో పోటీలను నిర్వహించ డం, పుస్తకాల విక్రయశాలల సందర్శన, పుస్తక ప్రదర్శనల నిర్వహణ, పుస్తకాలు కొని వ్యక్తిగత లైబ్రరీలను నెలకొల్ప డం, నీతి కథల పుస్తకాలను చదివించడం, పఠనాసక్తి కలిగిన యువతకు ప్రోత్సాహకాలు ఇవ్వడం లాంటి పలు కార్యక్రమాలను ఈ దినోత్సవ వేదికగా నిర్వహించవచ్చు.

(నేడు జాతీయ పుస్తక పఠన దినోత్సవం)




# సిపిఐ రెండవ కాంగ్రెస్

## కలకత్తా, 1948

## పార్టీకి అపారమైన హాని జరిగిన కాలం

1947 డిసెంబర్‌లో జరిగిన సిపిఐ కేంద్ర కమిటీ సమావేశం, పి.సి.జోషికి 'సంస్కరణ వాది' ముద్రవేసి ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తొలగించింది. అది పచ్చి అతివాదం పార్టీ నాయకత్వాన్ని ఆవహించిన కాలం. బి.టి.రణదివెను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. 'బి.టి.ఆర్ లైన్' పేరుతో ఆత్మహత్యాసదృశ దుస్సాహసిక పిడివాద పంథాను పార్టీ ఎంచుకుంది. 1948 ఫిబ్రవరి 28 నుంచి మార్చి 6 వరకు సిపిఐ రెండవ కాంగ్రెస్ (జాతీయ మహాసభ) కలకత్తాలో జరిగింది. 632 మంది ప్రతినిధులు హాజరైనారు. బి.టి.రణదివె ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు.

**పొలిట్ బ్యూరో సభ్యులు :** భవాని సేన్, సోమనాధ్ లాహిరి, జి.అధికారి, అజయ్ ఘోష్, ఎస్.కె.కృష్ణన్, సి.రాజేశ్వరరావు, ఎం.చంద్రశేఖర రావు, ఎస్.ఎస్.యూసుఫ్.

**31మంది సభ్యులతో కేంద్ర కమిటీ :**

1. బిటి రణదివె (జనరల్ సెక్రటరీ), 2. భవానీ సేన్, 3. సోమనాధ్ లాహిరి, 4. జి.అధికారి, 5. అజయ్ ఘోష్ 6. ఎస్.కె.కృష్ణన్, 7. చంద్ర రాజేశ్వరరావు, 8. మద్దుకూరి చంద్ర శేఖరరావు, 9. ఎస్ఎస్.యూసుఫ్, 10. రణేన్ సేన్, 11. ఎస్.ఎ.డాంగే, 12. ఎస్.వి.ఘాటె, 13. డి.ఎస్.వైద్య, 14. పుచ్చలపల్లి సుందరయ్య,15. ఇఎంఎస్ నంబూద్రిపాద్, 16. అరుణ్ బోస్, 17. ఎస్.జి.సర్దేశాయ్, 18. విశ్వనాధ్ ముఖర్జీ,19. పి.కృష్ణ పిళ్లై, 20. కె.సి.జార్జి, 21. మాకినేని బసవపున్నయ్య, 22. డి.వి.రావు, 23. ఎల్.కె.ఓక్ , 24. ఎస్.వి.పరులేకర్, 25. బీరేష్ మిశ్రా, 26. ఎం.కళ్యాణసుందరం, 27.బి.శ్రీనివాసరావు, 28. ముజఫర్ అహ్మద్, 29. మొహ్మద్ ఇస్మాయిల్ ,30. సునీల్ ముఖర్జీ, 31.రావి నారాయణరెడ్డి.

భారతదేశ స్వాతంత్ర్యం ''బూటకం'', నెహ్రూ ప్రభుత్వం 'సామ్రాజ్య వాదుల ఏజంటు' అని మహాసభ పేర్కొన్నది. నెహ్రూ ప్రభుత్వాన్ని 'సాయుధ తిరుగుబాటు' ద్వారా వెంటనే కూల్చివేయాలని, 'సోషలిజం' దిశగా ప్రయాణించాలని అది పిలుపు ఇచ్చింది. విప్లవం సంభవిస్తుందన్న ఆశాభావంతో 1948 మార్చి 9న రైల్వేల నిరవధిక సమ్మెకు ఇచ్చిన పిలుపు పూర్తిగా విఫలమమైంది. అది కార్యరూపం దాల్చలేదు.

రాచరిక హైదరాబాద్ నిజాం సంస్థానానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభ నాయకత్వంలో 1947 సెప్టెంబర్‌లో ప్రారంభమైన రైతాంగ సాయుధ పోరాటం, 1948 సెప్టెంబర్ 13న భారత ప్రభుత్వ సైన్యాలు ప్రవేశించిన తదుపరి కూడా కొనసాగించిన తప్పు అప్పుడు జరిగింది. నిజాం లొంగిపోయి, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన తదుపరి కూడా సాయుధ పోరాటం కొనసాగించటం, నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు విస్తరించాలన్న పిడివాద నిర్ణయం వల్ల పార్టీ తెలంగాణాలోనే కాదు ఆంధ్ర ప్రాంతంలో కూడా తీవ్రంగా నష్టపోయింది. సిపిఐ, ప్రజాసంఘాలు ఒంటరి అయి గందరగోళంలో పడ్డాయి. వేలసంఖ్యలో కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు మిలటరీ తూటాలకు బలైంది, చిత్రహింసల పాలైందీ అప్పుడే. సాయుధ పోరాటం విరమించాలా, లేదా అన్న భిన్నాభిప్రాయం ఇక్కడ పార్టీలో తేలలేదు. అగ్రనాయకత్వం నుంచి అజయ్‌ఘోష్, డాంగే, రాజేశ్వరరావు, బసవ పున్నయ్య మాస్కో వెళ్లి, స్టాలిన్‌తో చర్చించాకగాని, విరమణ ప్రకటించలేదు. అజయ్‌ఘోష్, డాంగే పోరాట విరమణను అనుకూలించగా రాజేశ్వరరావు, బసవపున్నయ్య కొనసాగింపుకోసం వాదించారు. రాజకీయ పంథాపై పార్టీ భేదాభిప్రాయాలు ఎంత లోతుగా, తీవ్రంగా ఉన్నాయో దీన్నిబట్టి అర్థం చేసుకోవచ్చు. అప్పుడు సాయుధ పోరాటం విరమించటం తప్పు అని భావించేవారు పార్టీ చీలిక అనంతరం ఏర్పడిన ఇతర పార్టీలు, గ్రూపుల్లో ఇప్పటికీ ఉన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఫ్యూడలిజం వ్యతిరేక పోరాటాల్లో ఘనమైన పాత్ర వహించిన కమ్యూనిస్టుపార్టీ ఈ దుస్సాహసిక పంథాతో మళ్లీ నిషేధానికి గురైంది. 1948 ఆరంభంలో 89వేలకుపైగా ఉన్న పార్టీ సభ్యత్వ 1950 చివరకు కేవలం 9 వేలకు పడిపోయింది. బిటిఆర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. 1950 మే నెలలో, కలకత్తాలో అజ్ఞాతంలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశం రణదివెను సస్పెండ్ చేసింది. చంద్ర రాజేశ్వరరావును (సిఆర్) ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

అయితే దురదృష్టం ఏమంటే, బిటిఆర్ 'రష్యా లైన్' స్థానంలో సిఆర్ 'చైనా లైన్' వచ్చింది. 'ఆంధ్రా లైన్'గా దానికి పేరు. 'సాయుధ తిరుగుబాటు' బదులు 'సాయుధ గెరిల్లా పోరాటం' లైన్ వచ్చింది. పార్టీ ఏకాకి అయిన పరిస్థితుల్లో సాయుధ పోరాటం కొనసాగింది. ఈ పంథా తప్పు అని డాంగే, ఘాటే, అజయ్ ఘోష్ ఆంధ్రా లైన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. 1950 సెప్టెంబర్‌లో విడుదలైన ప్రసిద్ధ '3 పి లెటర్' అదే. పార్టీలో అంతర్గత పోరాటం తీవ్రతరమైంది. పార్టీ ప్రతిష్టంభనలో పడింది. సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ సహాయం కోరాలని పార్టీ నిర్ణయించింది. పైన ప్రస్తావించిన నలుగురు కామ్రేడ్స్ మాస్కో వెళ్లారు. ఎలా వెళ్లారో ఇప్పటికీ వెల్లడి కాలేదు.


### 1951లో స్పెషల్ కాన్ఫరెన్స్

1951 అక్టోబర్ 9 నుంచి 15 వరకు కలకత్తాలో అజ్ఞాతంలో పార్టీ ప్రత్యేక మహాసభ జరిగింది. కొత్త, రెగ్యులర్, పార్టీ ప్రోగ్రాం ఆమోదించబడింది. అజయ్ ఘోష్, డాంగే, ఘాటేల '3–పి'ల లేఖ ప్రాతిపదికగా అది నూతన పరిస్థితికి అనుగుణంగా అభివృద్ధి చేయబడింది. పార్టీ సాయుధ పోరాటం విరమించింది. 1952 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనాలని నిర్ణయించింది.

పార్టీ కార్యక్రమం ''మిలియన్లమంది శ్రమజీవులకు – కార్మికులు, కర్షకులు, శ్రమచేసే మేధావులు, మధ్యతరగతులకు, అలాగే దేశ స్వాతంత్ర్యంలో దాని అభివృద్ధిలో ఆసక్తి కలిగిన బూర్జువా వర్గానికి – ఏకైక డెమొక్రటిక్ ఫ్రంట్‌లో ఐక్యం కావలసిందిగా'' పిలుపు ఇచ్చింది. **భారతదేశ విప్లవదశ సోషలిస్టుకాదు, ప్రజాతంత్ర విప్లవం** అని చెప్పింది.

అది ఒక విధాన ప్రకటన కూడా ఆమోదించింది. ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ అజయ్ కుమార్ ఘోష్‌ను ఎన్నుకుంది.

### ప్రధాన కార్యదర్శి బి.టి. రణదివె



బాలచంద్ర త్రియంబక్ రణదివె(బిటిఆర్) 1905 డిసెంబర్ 19న దాదర్, బొంబాయిలో జన్మించారు. చాలా తెలివైన విద్యార్థి. 1928లో బొంబాయి విశ్వవిద్యాలయం నుండి ఎం.ఎ. అర్ధశాస్త్రంలో డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులైనారు. తన పెద్ద తల్లి కుమారుడైన డాక్టర్ జి.అధికారి ద్వారా మార్క్సిజం వైపు ఆకర్షితులైనారు. సిద్ధాంత అధ్యయనానికి, కార్మిక సంఘాల నిర్మాణానికీ కృషి చేశారు. 1928లో సిపిఐ సభ్యత్వం స్వీకరించారు. ఎఐటియుసి, గిర్నీ కాంగార్ యూనియన్‌లలో పనిచేశారు. 1939లో జిఐపి రైల్వేమెన్స్ యూనియన్ కార్యదర్శిగా పనిచేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం (బొంబాయి)లో చాలాకాలం పనిచేశారు. 1940– 42లో దియోలీ డిటెన్షన్ శిబిరంలో నిర్బంధంలో ఉన్నారు. 1943లో సిపిఐ మొదటి కాంగ్రెస్‌లో పొలిట్‌బ్యూరోకు ఎన్నుకోబడ్డారు. 1948లో కలకత్తాలో రెండవ కాంగ్రెస్‌లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. దుస్సాహసిక 'సాయుధ తిరుగుబాటు' పిడివాద పంథాకు కర్త అయినారు. పార్టీ తీవ్రంగా నష్టపోయింది. పార్టీ 1950లో ఆయన్ను నాయకత్వ బాధ్యతలనుంచి తొలగించింది. చంద్ర రాజేశ్వరరావును తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. 1964లో పార్టీలో చీలికతో రణదివె చీలిక గ్రూపుతో బయటకు వెళ్లారు. అనంతరం అది సిపిఐ(ఎం)గా ఏర్పడింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉంటూ 1970 మే నెలలో సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షునిగా బాధ్యతలు చేబట్టారు. పార్టీ పత్రికలకు సంపాదకునిగా పనిచేశారు. ఆర్థిక అంశాలపై వందలకొద్దీ వ్యాసాలు రచించారు. 1990 ఏప్రిల్ 6న మరణించారు.

## ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం

**ప్రజా పక్షం/ వేములవాడ:** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడలో గురువారం ప్రారంభించిన వినాయక నిమజ్జన వేడుకలు శుక్రవారం సాయంత్రం వరకు ప్రశాంతంగా ముగిశాయి. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్రను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి పరిశీలించారు. అనంతరం వినాయకుడికి పూజలు చేశారు. నిమజ్జన స్థలం వద్ద అధికారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల భక్తి గీతాలు, ఇతర కళాకారుల మ్యాజిక్ షో భక్తులను అలరించింది. పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, ఆర్డీవో రాధాబాయి, తహసిల్దార్ విజయ్ ప్రకాష్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండిసంజయ్ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ట్రాక్టర్ నడిపారు. కరీంనగర్‌లో శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మహాశక్తి అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో బండి సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి బండి సంజయ్ స్వయంగా గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ప్రతిష్టించారు. ఆ వెంటనే బండి సంజయ్ ట్రాక్టర్ ఎక్కి కొద్ది దూరం ప్రయాణించారు. గణేష్ నిమజ్జనానికి శోభాయాత్రను ప్రారంభించారు. తమ ఇంట్లో ప్రతిష్టించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలోనూ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు నిమజ్జనోత్సవ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు అనుచరులు తెలిపారు.

## గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురు అరెస్టు



**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని అక్రమ గంజాయి అమ్ముతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కోరుట్ల సర్కిల్ ఇన్స్పెక్టర్. బి.సురేష్ బాబు వివరాలు వెల్లడిస్తూ కోరుట్ల పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ వెనుక ఆరుగురు వ్యక్తులు, గంజాయి తాగుతున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు కోరుట్ల ఎస్ఐ ఏం.చిరంజీవి ఆధ్వర్యంలో కోరుట్ల పోలీస్ సిబ్బంది, ఆకస్మిక దాడి చేసి అట్టి ఆరుగురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి 500 గ్రాముల (అరకిలో)(15000/విలువగల) గంజాయి, మూడు బైకులు, 5 సెల్ ఫోన్ లు సీజ్ చేయడం జరిగిందని కోరుట్ల, జగిత్యాల పట్టణానికి చెందిన ఆరుగురు వ్యక్తులు, కోరుట్ల నుండి మూడు మోటార్ సైకిల్ మీద బయలుదేరి నిర్మల్ లోని ఒక వ్యక్తి వద్ద అరకిలో (500 గ్రాములు) సుమారు 15 వేల విలువగల గంజాయి అమ్మడానికి కొనుక్కొని వచ్చి , వారు అక్కడ గంజాయి తాగుతూ, ఎవరైనా వస్తే అమ్ముదామని అక్కడ ఉండగా వారిని కోరుట్ల పోలీసులు పట్టుకున్నారు. వారికి గంజాయి సరఫరా చేసిన మరొక వ్యక్తి పరారీలో ఉన్నాడని. ఇట్టి ఆరుగురు వ్యక్తులని కోర్టు వారి ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలించడం జరిగిందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు కోరుట్ల పట్టణాన్ని గంజాయి రహిత పట్టణముగా మార్చాలని ఉద్దేశంతో కోరుట్లలో గంజాయిని నిర్మూలించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఈ గంజాయి అమ్మేవారిని, సరఫరా చేసే వారిని అలాగే తాగే వారిని, గుర్తించి వారిపై ప్రత్యేక నిఘ పెట్టి దాని గురించే పని చేయుచున్నామని ఇట్టి ఆరుగురు వ్యక్తులను పెట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల ఎస్ఐలు ఏం.చిరంజీవి , రామచంద్రం, పోలీస్.కానిస్టేబుళ్లు రాజేశ్వరరావు, పురుషోత్తం, గట్టు శ్రీనివాస్ లను, పై అధికారులు అభినందించారు.

## అమరజీవి కొమురయ్య





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బొగ్గు గని కార్మికుల పెన్షన్ సాధకుడు, నిరంతర కార్మిక వర్గ శ్రేయస్సు కోసం పాటు పడిన మహా నాయకులు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ మనుబోతుల కొమురయ్య (యూనియన్ కొమురయ్య) అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు పేర్కొన్నారు. శుక్రవారం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆద్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్ లలో, గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన కొమురయ్య 29 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటాలకు కార్మికులు, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో ఏఐటియుసి యూనియన్ స్థాపించిన వ్యవస్థాపకుల్లో కొమురయ్య గారు ఒకరని, నలబై ఏళ్ళ కు పైగా యూనియన్ కు ప్రధాన కార్యదర్శి గా ఉంటూ బొగ్గు గని కార్మికుల సమస్యలతో పాటు పెన్షన్ సాధించిన మహానేత కొమురయ్య గారని వారు పేర్కొన్నారు. నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న ప్రతి హక్కు కొమురయ్య గారి కృషి ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ సంకె అశోక్, సయ్యద్ సోహేల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎం ఎ గౌస్ తో పాటు ఆయా గనులు, డిపార్ట్మెంట్ ల కు చెందిన పిట్ కార్యదర్శులు, ఆఫీస్ బేరర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పాముకాటుకు బాలిక మృతి



**ప్రజాపక్షం/చొప్పదండి:** పాముకాటు వేయడంతో ఓ బాలిక మృతి చెందిన సంఘటన చొప్పదండి మండలం వెదురుగట్ట గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గర్వంద రవీందర్ చిన్న కుమార్తె గర్వంద దీప్తిక(12) పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుకుంటోంది. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తన తండ్రి కిరాణ దుకాణంలో ఉన్న దీప్తికను విష సర్పం కుడికాలిపై కాటు వేసింది. పక్కనే ఉన్న పెద్ద కూతురు దర్శిక చూసి కేకలు వేసుకుంటూ ఎదురింట్లో ఉన్న రవీందర్ తమ్ముడు సంతోష్‌కు తెలిపింది. వెంటనే సంతోష్ తన ఆటోలో నగునూరులోని ప్రతిమ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో మరణించింది. తన తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## మద్యం సీసాలు పట్టివేత



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్న వ్యక్తిని కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చల్మెడ ఆనందరావు ఆసుపత్రి ముందు అశ్వత్థామ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో బెజ్జంకి శివశంకర్ అనే వ్యక్తి మద్యం అమ్ముతుండగా పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి 56 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మద సీసాల విలువ సుమారు పది వేల వరకు ఉంటుందన్నారు. కరీంనగర్‌లో వినాయక నిమజ్జనం నేపథ్యంలో మద్యం అమ్మకూడదని నిషేధం ఉన్నప్పటికీ అక్రమంగా మద్యం అమ్ముతున్న శివశంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి చెప్పారు.

# గంగమ్మ ఒడికి చేరిన గణపయ్య

### ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం
### భక్తిశ్రద్ధలతో సాగిన శోభాయాత్ర





**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లో గణపతుల నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో గణేష్ విగ్రహాలకు మండపాలలో చివరి పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న గణనాధులను ఉత్సాహంగా ఊరేగింపు చేపట్టి బ్యాండు మేళాలు,డప్పు చప్పుళ్లతో కోలాటాలు, వివిధ సంస్కృతి నృత్యాలతో శోభాయాత్ర చేస్తూ వినాయకులను చెరువుల వద్దకు నిమజ్జనాలకు తరలించారు. కరీంనగర్ టవర్‌సర్కిల్ వద్ద ఒకటో నెంబర్ వినాయకునికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభించారు. కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో పాటు అధికారులు ప్రత్యేక పూజలు చేసారు. కాగా మధ్యాహ్నం నుంచే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ వినాయక నిమజ్జనం పాయింట్లను సందర్శించి పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన మానకొండూర్, చింతకుంట, కొత్తపల్లి నిమజ్జనం పాయింట్ల వద్ద గణనాథుల నిమజ్జనాలను స్వయంగా పర్యవేక్షించి విగ్నేశ్వరుల విగ్రహాలకు చివరి పూజను చేసి పలు వినాయకులను చెరువులో నిమజ్జనం చేశారు. ప్రశాంత వాతావరణంలో విగ్రహాలను నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు వస్తున్న భక్తులకు ఎక్కడ ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. విగ్రహాల నిమజ్జనాలు మధ్యాహ్న సమయం నుంచి ప్రారంభం అయ్యాయి. నగరవ్యాప్తంగా పలు మండపాల్లో తొమ్మిది రోజులు పూజలందుకున్న చిన్న చిన్న విగ్రహాలు మొదటగా నిమజ్జనాలు చేశారు. తదనంతరం భారీ విగ్రహాలు మానకొండూర్, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌లో నిమజ్జనం చేయడం జరిగిందని కమిషనర్ పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు నగరపాలక సంస్థ ద్వారా అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. మూడు నిమజ్జనం పాయింట్ల వద్ద నగరపాలక సంస్థ అధికారులు ,సిబ్బందిని ఏర్పాటు చేసి నిమజ్జనం వేడుకలను నిర్వహించారు. అధికారులు, పోలీసుల పర్యవేక్షణ మధ్య విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. ప్రత్యేక గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయడంతో పాటు పారిశుద్ధ్య పనులకు కార్మికులను ఎప్పటికప్పుడు పురమాయించారు. కమిషనర్ వెంట సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేశ్వర్, అధికారులు సిబ్బంది పర్యవేక్షించారు.

**పటిష్టమైన భద్రత ఏర్పాట్లు**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గణేష్ శోభాయాత్ర నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా దాదాపు 867 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సిసి కేడెట్‌లు, వాలంటీర్లను విధుల్లో నియమించారు. బందోస్తులో ఇద్దరు అడిషనల్ డిసిపిలు, 5గురు ఏసిపిలు, 20 మంది ఇన్స్‌పెక్టర్లు, 40 మంది కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, 100 మంది హోంగార్డులు, 15 మంది ఎన్‌సిసి కేడెట్‌లు, 200 మంది వాలంటీర్లు పాల్గొన్నారు. అంతకుముందు సిపి గౌష్ ఆలం పోలీసుల అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిఘా కోసం ఇప్పటికే మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన 750 కెమెరాలతో పాటు, పోలీసు శాఖ అదనంగా 100 సిసి కెమెరాలను ఏర్పాటు చేసింది. నిరంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తున్నారు. అగ్నిమాపక, ఈతగాళ్లు, లైఫ్ జాకెట్స్, లైఫ్ బోయ్స్ మొబైల్ బైక్స్ సిద్దంగా ఉంచారు. ఆరోగ్యశిబిరాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి సిపి సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిమజ్జన కార్యక్రమం పటిష్ట భద్రత ఏర్పాట్ల మధ్య కొనసాగింది.

## ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో వినాయకుడి నిమజ్జన సంబరాలు



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన వివిధ గణపతి మండపాల్లో వినాయకునికి శోభాయాత్ర నిర్వహించి నిమజ్జన ఉత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానకర్తగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విఘ్నాలకు అధిపతి అయిన గణనాథుని కొలవడం ద్వారా మన జీవితంలో ఎదురైన సమస్యలతో పాటు విజయానికి అడ్డుగా ఉన్న అడ్డంకులను చాలా సులభంగా తొలగించవచ్చని చెప్పారు. గణనాధున్ని తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూజలతో వైభవంగా పూజించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ గణపతి వలె తల్లిదండ్రుల పట్ల విధేయతతో ఉండాలని, గురువుల పట్ల మర్యాదగా వివరించాలని, వారికి విజయం తప్పనిసరిగా వరిస్తుందని చెప్పారు. నిమజ్జన మహోత్సవం సంధర్భంగా విధ్యార్థులు చేసిన నృత్యాలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల సంబంధిత ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, సిబ్బంది, తల్లిదండ్రులు, విధ్యార్థులున్నారు.

## విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

### 17 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం
### ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** అంకితభావంతో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా సమీకృత కార్యాలయంలోని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అతిథులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడారు. విద్యారంగ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తుందని తెలిపారు. ఇందులో భాగంగా 11వేల టీచర్ పోస్టులు భర్తీ చేసిందని, ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిందని, బదిలీలకు అవకాశం కల్పించిందని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వర్గాల విద్యార్థులకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తుందని, అలాగే ఏటి సి సెంటర్లు మంజూరు చేసిందని దీంతో విద్యార్థులు యువతకు వివిధ రంగాల్లో నైపుణ్యత అది పుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

జిల్లాలోని టీచర్లు జాతీయ, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక అవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా బోధించాలని, విద్యార్థులను తీర్చిదిద్దాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

**ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు..**

చకినాల శ్రీనివాస్, గుర్రం కృష్ణారెడ్డి, కైరి పద్మ, సీహెచ్ సత్తయ్య, గోలి రాధాకిషన్, అరుకాల బాల్ రెడ్డి, బోగారపు నవీన్, కట్ట రవీందర్, గోవుల కొండ శ్రీనివాస్, ఎన్ దేవేందర్, నరహరి నాగమణి, జంగిటి రాజు, పీచు సుభాష్ రెడ్డి, గుండమనేని మహేందర్ రావు, దిడిగం స్రవంతి, బద్దం రవీందర్ ఓరుగంటి పద్మకళకు అవార్డులు అందజేసి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల,స్వరూపారెడ్డి, రాజు, డీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.

## గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** విఘ్నాలను తొలగించే ఆది దేవుడు గణపయ్య ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు . గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో పలు వినాయక మండపాలలో ఏర్పాటుచేసిన గణనాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయక మండపాల నిర్వాహకులు మంత్రి అడ్లూరి ని శాలువాలతో సత్కరించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు , సుఖశాంతులను అందించాలని విఘ్నేశ్వరుడిని మంత్రి ఆకాంక్షించారు. వారి వెంట ఏఎంసీ చైర్మన్ భీమా సంతోష్, రాజి రెడ్డి, ముస్కు నిశాంత్ రెడ్డి ,కట్ట లక్ష్మణ్ రావు ,రాపల్లి గంగన్న, నేరెళ్ల మహేష్ ఆయా మండపాల కమిటీ సభ్యులు మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నివారణకు అవగాహన అవసరం



**ప్రజాపక్షం/రామడుగు:** తెలుగు రాష్ట్రాలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా రూపొందించిన 'సరైన అవగాహనే సైబర్ క్రైమ్స్‌కు నివారణ' అనే వాల్ పోస్టర్‌ను శుక్రవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చిన్న పొరపాటే పెద్ద నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని, ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఎక్కువగా ఉందన్నారు. కన్వీనర్ గజ్జెల అశోక్ మాట్లాడుతూ యువత, మహిళలు, ఉద్యోగస్తులు చాలా మంది అవగాహన లేకపోవడం వల్ల సైబర్ మోసాలకు గురవుతున్నారని, అందుకే పోస్టర్ రూపంలో ప్రామాణికమైన సమాచారాన్ని పోతిరెడ్డి మాధవరెడ్డి, సైబర్ వారియర్ సహకారంతో అందించేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా కార్యదర్శి వేముండ్ల కుమార్, జేరిపోతుల పోచయ్య, జేరిపోతుల నర్సయ్య, జేరిపోతుల మహేష్, నవీన్ కుమార్, చందు, సామాజిక సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది

### సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఏసిపి కృష్ణ



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అన్ని దానాల్లోకెల్లా రక్తదానం చాలా గొప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, పెద్ద పెల్లి ఏసిపి గజ్జి కృష్ణ అన్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకొని శుక్రవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక యం బి గార్డెన్లో మర్కజే మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశం ఇచ్చిన గొప్ప మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని, నేటి యువత మహమ్మద్ ప్రవక్త మార్గం ఎంచుకొని సన్మార్గంలో నడచి కన్న తల్లి దండ్రులకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది వరకు రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లతోపాటు పండ్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్ రావు, మౌలానా అజీముద్దీన్, మిలాద్ కమిటీ అధ్యక్షులు రఫీ ఉల్లా ఖాన్, ప్రధాన కార్యదర్శి సయ్యద్ సల్లావుద్దీన్ ఖాదిరి, మాజీ కౌన్సిలర్ తబ్రేజ్ ఖాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిదీలోని గద్దపాక గ్రామానికి చెందిన సోమిడి తిరుపతి అనే వ్యక్తి శుక్రవారం ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గద్దపాక వాగు నుండి గ్రామాలకు ఇసుక రవాణా చేస్తుండగా కాచాపూర్ శివారులో పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ శేకర్ రెడ్డి తెలిపారు.

## యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు



**ప్రజాపక్షం/హుజురాబాద్ :** కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా రోజు రోజుకు యూరియా కష్టాలు తీవ్రం అవుతున్నాయి. గత రెండు వారాలుగా యూరియా రాకపోవడంతో పండుగ రోజు హుజురాబాద్ పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రం వద్ద శుక్రవారం రైతులు, మహిళా రైతులు తెల్లవారు జామున బారులు తీరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వేసిన పంటలు చేతికి అందుతాయో లేవోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూరియా సరిపడా పంపిణీ చేయలేదని చివరి దశలో ఎరువులు వేసే టైం వచ్చినప్పటికి అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. లైన్‌లో నిల్చోలేక ఇబ్బంది పడిన ఓ రైతు క్యూలైన్‌లో చాప వేసుకుని కూర్చొని నిరసన వ్యక్తం చేశాడు. అధికారులు చొరవ తీసుకుని రైతులకు సరిపడా ఎరువులు అందజేయకపోతే రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు బ్లాక్ చేసిన యూరియాను పంపిణీ చేయాలని డిమాండ్‌చేశారు.

### పోలీసు పహారా మధ్య యూరియా పంపిణీ



**శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నారు. శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, కాచాపూర్, ఆముదాలపల్లి, కరీంపేటలో గోదాములకు యూరియా బస్తాలు రాగా రైతులు ఆధార్ జిరాక్స్‌తో క్యూ కట్టారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా యూరియాను అందించారు. కాగా కరీంపేట గ్రామంలో యూరియా రాదేమోనన్న ఆందోళనతో రైతుల మధ్య స్వల్ప తోపులాట జరిగింది. కాచాపూర్‌లో తోపులాటలో ఒక రైతు చొక్కా చిరిగిపోగా కన్నాపూర్, కాచాపూర్ గ్రామాలలో పోలీస్ పహారా మధ్య యూరియా బస్తాల పంపిణీ చేశారు.



### యూరియా అడిగితే రైతుపైనే కేసులా?

**ఎల్లారెడ్డిపేట:** యూరియా కోసం వెళ్ళిన రైతు పడిగాపులు కాసి ప్రభుత్వాన్ని అసహనం కోల్పోయి విమర్శిస్తే రాజకీయ కక్ష్యసాధింపులు చేస్తున్నారని ఎల్లారెడ్డిపేట రైతులు మండి పడుతున్నారు.మానుక లక్ష్మణ్ సీఎంకు ఓటువేసినందుకు చెప్పుతో కొట్టుకోవాలి లేదా మళ్ళీ తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాకుండా చేస్తానని రైతు విసిగి వేసారిపోయి ప్రభుత్వాన్ని విమర్శించినందుకు అతడిపై మండల పట్టణాధ్యక్షులు చెన్నిబాబు పోలీసులకు పిర్యాదు అయ్యాడు.విశేషమేమిటంటే కాంగ్రెస్ మండలధ్యక్షుడు లక్ష్మారెడ్డి సాక్షిగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని దూషించారని మీడియాతో చెప్పారు.

**రైతుపై కేసుచేయడం సమంజసం కాదు**

యూరియా కోసం పడిగాపులు కాసి నాన ఇబ్బందులు పడి విసిగి రైతులు ఇబ్బంది పడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని ప్రతిపక్షనాయకులు మాజి జడ్పిటీసీ లక్ష్మణ్‌రావు,పీఏసీఎస్ గుండారపు కృష్ణారెడ్డి,వర్స కృష్ణహరి రైతులు అందరు కలిసి వెళ్ళి పోలీసుస్టేషన్‌కు వెళ్ళారు.అతడు బీఆర్ఎస్ కార్యకర్త కాదని బీఆర్ఎస్ పార్టీకి చెందిన వ్యక్తి అనే అక్కసుతో రైతు లక్ష్మణ్‌పై కేసు వేయడం సరైందికాదన్నారు.రైతులను ఇబ్బందులను పెట్టడం మన సంస్కృతి కాదని వారిని ఇబ్బందులకు గురి చేయడం పద్దతి కాదని విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.కార్యక్రమంలో ఎలుగందుల నర్సింహులు,పందిర్ల పర్శరాములు, బీఆర్ఎస్ నాయకులు తదీతరులున్నారు.

## గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవాలు నిర్వహించాలి.పలు గణేష్ మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అశోక్ కుమార్ అన్నారు.పట్టణంలోని అంబేద్కర్ నగర్,రాజీవ్ నగర్ కాలనిలోని గణేష్ మండపాలను సందర్శించి వినాయకులకు ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం పలు మండప నిర్వాహకులతో మాట్లాడుతూ,నిమజ్జనం శాంతియుతంగా జరగేలా గణేష్ మండపాల నిర్వాహకులు సహకరించాలని తెలిపారు.ప్రభుత్వ నిబంధనల మేరకు మండప నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేసుకోవాలని,నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని.ఈ సందర్భంగా సీఐ అజయ్ కుమార్,ఎస్ఐ రాహుల్ గైక్వాడ్‌లను,మాజీ ప్రజా ప్రతినిధులను పలువురు ప్రముఖులను మండప నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం,హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేష్,ఆత్మ చైర్మన్ తోట సత్యం,జన్నారపు శంకర్,మేసు చిన్న రాజన్న,దండు రాజేశ్వర్,మునుగూరి భూమన్న,మగ్గిడి నారాయణ,మ్యాదరి రాజేశ్వర్,గొర్రె గంగాధర్, గణేస్ మండపాల నిర్వాహకులు పలు కుల సంఘుల పెద్దలు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే చింతాప్రభాకర్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయం నుంచి సదాశివపేట ఎడి రమేష్,తో ఫోన్ లో మాట్లాడి యూరియా కొరతపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేయాలని సూచించారు. యూరియా స్టాక్ అందుబాటులో ఉంచాలని, రైతులకు యూరియా కోసం ఇబ్బంది పెట్టకూడదని పేర్కొన్నారు. స్టాక్ ఎంత ఉంది అని తెలుసుకున్నారు. యూరియా కోసం రైతులను క్యూ లైన్‌లో చెప్పులు ఉంచకుండా యూరియా సరఫరా చేయాలని కోరారు. రైతులకు అన్ని విధాలా సహకరించాలని సూచించారు. యూరియా అందరికీ అందేటట్టు చూడాలన్నారు. రైతులను ఇబ్బంది పెట్టొదన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మేన్ రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచిర్యాలను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి : డిసిపి భాస్కర్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** వినాయక చవితి వేడుకల సందర్భంగా మంచిర్యాల జిల్లా ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లాలని, నిమజ్జన వేడుకలు శాంతియుతంగా నిర్వహించాలని మంచిర్యాల డిసిపి భాస్కర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వంద ఫీట్ల రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంజనీ పుత్ర గణ నాథుని మండపంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డిసిపి మాట్లాడుతూ తెలంగాణ పండుగలు మన సంస్కృతికి అద్దం పడతాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే స్ఫూర్తితో ప్రతి పండుగను వేడుకగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంజనీ పుత్ర ఎస్టేట్స్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, ఎండి పిల్లి రవి డిసిపి భాస్కర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమం లో సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల సహకారంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులను సత్కరించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం, ఇతర డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులపై సమావేశం



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ :** ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఖానాపూర్ ఎంపీడీవో చిక్యాల రత్నాకర్ రావు అన్నారు.శుక్రవారం ఆయన మండలంలోని రాజురా, బావాపూర్(ఆర్), చందు నాయక్ తండా, దాసు నాయక్ తండా,సింగాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులపై రాజురా గ్రామంలో ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు,కమిటీ సభ్యులు,మేస్త్రిలతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.బేస్మెంట్,పిల్లర్లు,గోడ్ల నిర్మాణం పూర్తయితే మొదటిదశలో లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమవుతాయని అన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు,ఏఎంసీ డైరెక్టర్ నారాయణ రెడ్డి, గ్రామస్థులు చిన్నం రవీందర్,నిమ్యా నాయక్, నర్సారెడ్డి,రాజేందర్, ఇళ్ల కమిటీ సభ్యులు, అశోక్, ఫరీద్ ఖాన్, లావణ్య, సుజాత ఇళ్ల లబ్దిదారులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## అక్రమంగా పశువుల రవాణా..

### 43 పశువులతో మూడు వాహనాలు పట్టివేత

**ప్రజాపక్షం / చింతలమానేపల్లి :** అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరేష్ హెచ్చరించారు. శుక్రవారం చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామం సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మహారాష్ట్ర నుంచి జగిత్యాలకు అనుమతులు లేకుండా పశువులను రవాణా చేస్తూ వచ్చిన మూడు బొలేరో వాహనాలను పోలీసులు గుర్తించి ఆపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 43 పశువులను తరలిస్తున్నట్లు బయటపడగా, అందులో 9 పశువులు అప్పటికే మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఆదే బాపురావు, షాయిక్ అసీం, ముక్తార్ బీగ్, నక్క శంకర్, షకీల్‌లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృత పశువులను పశు వైద్యుల పంచనామా అనంతరం గ్రామ పంచాయతీకి అప్పగించి ఖననం చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ, పశువుల అక్రమ రవాణా కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కాగజ్‌నగర్ డిఎస్‌పిగా వహిదుద్దీన్

**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి (డిఎస్‌పి)గా వహిదుద్దీన్ శుక్రవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ డిఎస్పిగా విధులు నిర్వహించిన రామానుజంకు అడిషనల్ ఎస్‌పిగా పదోన్నతి పొందారు. ఆయన స్థానంలో హైదరాబాద్‌లో రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ విభాగంలో డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తున్న వహిదుద్దీన్ కాగజ్‌నగర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి వహిదుద్దీన్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని కోరారు.

## డిజె యజమానులపై కేసులు నమోదు



**ప్రజాపక్షం/నేరడిగొండ :** సుప్రీం కోర్టు నియమ నిబంధనకు లోబడి సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని అతిక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఇచ్చోడ సిఐ బండారి రాజు,తెలిపారు.వడూరు గ్రామంలో గణపతి మండపాల వద్ద నిబంధనలను అధిక్రమించి ఏర్పాటు చేసిన నాలుగు డీజెలను స్వాధీనం చేసుకొని యజమానులపై,అపరేటర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధిక శబ్దం వచ్చే విధంగా డీజేలను ఏర్పాటు చేస్తే,గణపతి మండపాల వద్ద ఎలాంటి డీజేలకు అనుమతి లేవని అతిక్రమించిన వారి పై చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 28న బహుజన బతుకమ్మ

**ప్రజాపక్షం/నిజాంపేట్:** మెదక్ జిల్లా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో సెప్టెంబర్ 28న విమలక్క ఆధ్వర్యంలో బహుజన బతుకమ్మ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రైతు కూలీ సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనాల స్వామి, ఏఐఎఫ్‌టియూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల నర్సింలు మాట్లాడుతూ సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 3 వరకు ఊరూరా వాడవాడలా విమలక్క ఆధ్వర్యంలో బహుజన బతుకమ్మ సంబరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలో బహుజన బతుకమ్మ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కల్వకుంట గ్రామం మాజీ ఉప సర్పంచ్ నాగరాజ్ గౌడ్, గ్రామస్తులు చంద్రం, రాజు, మల్లేశం, పరుశరాములు, రాజు పాల్గొన్నారు.

# ప్రతి జిల్లాలో 'డే' కేర్ సెంటర్లు



### రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

### ఇప్పటికే తొమ్మిది వేల పోస్టులు భర్తీ

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** రాష్ట్రంలోని నిరుపేద ప్రజలందరికి మెరుగైన ఉచిత వైద్యం అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం మంత్రి దామోదర్ రాజనర్సింహ నారాయణ ఖేడ్ నియోజకవర్గంలోని పలు మండలాలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు రూ. 12.86 కోట్ల విలువైన వాళ్లు అబివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మొదటగా నారాయణఖేడ్ జుకల్ చౌరస్తాలో రూ. 1.1.5 కోట్లతో చేపట్టనున్న కన్వెన్షన్ సెంటర్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయణఖేడ్ మండలం జుకల్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ. 3.9 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్న అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్ పార్కు శంకుస్థాపల చేశారు. దవ్వూరు నుండి మనూరు మండలం ఎన్జీ ముక్రాన్‌వరకు ఉన్న ఆర్అండ్‌బి బీటీ రోడ్డు రూ. 6 కోట్లతో చేపట్టనున్న పునరుద్దరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నారాయఖేడ్ పట్టణంలోని అంతర్గత రోడ్ల అనుసందానానికి ఫార్మేషన్ రింగు రోడ్డు ఏర్పాటు కోసం కోట్లతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం సిర్గాపూర్ లో రూ. 1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని జహీరాబాద్ ఎంపి సురేష్ షట్కార్ నారాయణ ఖేడ్ శాసనసభ్యులు ,సంజీవరెడ్డి,లతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం రాష్ట్రంతలోని నిరుపేద ప్రజలు నాణ్యమైన ఉచిత విద్యతో పాటు మెరుగైన ఉచిత వైద్య సేవలు ప్రభుత్వ పరంగా అందించడానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం అదికారంలోకి వచ్చిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న తొమ్మిది వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్యశాఖలో మరోవేల పోస్టులు భర్తీకి ప్రణాలికలు సిద్ధం చేసినట్లు మంత్రి తెలిపారు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను కార్పోరేట్ ఆసుపత్రులకు దీటుగా అబివృద్ధి చేయడంతో పాటు అవసరమైన మౌళిక వసతులు కల్పించడం ఉద్యోగులు ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ఆసుపత్రుల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు . ప్రజా ప్రభుత్వం ప్రతి జిల్లాలో ఒక డేకేర్ క్యాన్సర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి గ్రామంలో మొబైల్ వాహనాలు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైవే రోడ్డులలో ప్రమాదాలు జరిగితే వెంటనే చికిత్స అందించడానికి ప్రమాదం జరిగిన 15 నిముషాల్లో ఆసుపత్రికి చేరుకునేలా హైవే ల వెంట ట్రామా కేర్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. హైవేల వెంట ప్రతి 30 కిలోమీటర్ల పరిదిలో ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు అంబులెన్స్ లు పాడు చేయన్నున్నట్లు పేర్కొన్నారు. అవసరాన్ని బట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాని అధికారులకు సూచించారు. ఏ రాత్రి పేషంట్ వచ్చిన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్లవాగు ప్రాజెక్టును టూరిస్టు కేంద్రంగా మార్చలని సంజీవరెడ్డి ఎమ్మెల్యే నారాయణఖేడ్ కోరారు. సిర్గాపూర్ లోని నల్ల వాగు ప్రాజెక్టు నిధులు కేటాయించి టూరిస్ట్ కేంద్రంలో అభివృద్ధిచేయాలని నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఈసందర్భంగా మంత్రికి విజ్ఞప్తి చేశారు. సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి ఇంకా నిదులు అవసరమని ఏమ్మెల్యే కోరారు. ఆసుపత్రిలో వైద్యులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని ఎమ్మెల్యే మంత్రికి విజ్ఞప్తి చేశారు. మారుమూల ప్రాంతమైన నారాయణ ఖేడ్‌ను విద్యా రంగాలలో అబివృద్ధి చేయాలని సురేష్ షెట్కర్ ఎంపి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని మారుమూల నియోజకవర్గమైన నారాయణ ఖేడ్ నియోజకవర్గాన్ని విద్యా వైద్య రంగాల్లో అబివృద్ధి పరచాలని అవసరమున్న చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆవిష్కరించారు. ఎంప సురేష్ షెట్కర్ విజ్ఞప్తి చేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ ఉమాహారతి, రెవెన్యూ అధికారులు పంచాయతీరాజ్ ,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాల కోసం కార్మికుల మొర



**ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ :** కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎంఎల్‌సి దండే విఠల్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గత మూడు నెలల నుండి జీతాలు రావడం లేదని పెండింగ్ వేతనాలు మంజూరు అయ్యేలా చూడాలని వినతిపత్రం అందజేశారు. తమకు జీతాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతన్నామని వాపోరారు. గతంలో తమ వేతనాలు వచ్చేందుకు కృషిచేశారని ఈ సారి కూడా తమకు వేతనాలు మంజూరు చేయించాలని వారు ఎంఎల్‌సిని కోరారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఎంఎల్‌సి దండే విఠల్ త్వరలోనే జీతాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని తెలిపినట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మనుబోతుల కొమరయ్యకు నివాళి



**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి కార్మిక నాయకుడు కామ్రేడ్ మనుబోతుల కొమరయ్య 29వ వర్ధంతి సందర్భంగా మందమర్రి ఏరియాలోని అన్ని గనుల డిపార్ట్‌మెంట్లలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ భీమనాథని సుదర్శనం, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్ పాల్గొని కొమరయ్య సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1928లో ఖమ్మం జిల్లా ఇల్లందులో జన్మించిన కొమరయ్య 1940లో సింగరేణిలో చేరి, 1942లో యూనియన్ స్థాపనలో పాలుపంచుకున్నారని గుర్తుచేశా రు. సింగరేణి సంస్థను బిఐఎఫ్ఆర్ నుండి కాపాడిన ఘనత ఆయనదేనని తెలిపారు. దాదాపు 42 సంవత్సరాలు యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి రికార్డు సృష్టించారని చెప్పారు. 1996 సెప్టెంబర్ 5న అమరులైన కొమరయ్య సింగరేణి కార్మికుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ఏరియా నాయకులు సోమిశెట్టి రాజేశం, పెద్దపల్లి బానయ్య, ఇ. రాజేశ్వరరావు, ముక్కలపల్లి వెంకటేశ్వర్లు, గోపతి సత్యనారాయణ, సి.వి. రమణ, సాధనవేణి ప్రభాకర్, పిట్ కార్యదర్శులు మర్రి కుమార స్వామి, ప్రేమ్‌లాల్, పారిపల్లి రాజేశం, కలవల శ్రీనివాస్, కె. ఓదెలు, పిట్ నాయకులు కన్నం వేణు, రాజేశ్ కుమార్ యాదవ్, ఎస్. కొండయ్య, కసం సమ్మయ్య, పొన్నం శ్రీనివాస్, రాజేందర్, సదానందం, ఎస్. లక్ష్మణ్, విక్రమ్ సింగ్, హేమచందు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కష్టాలతో రైతులు సతమతం



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** యూరియా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. నిజాంపేట మండల కేంద్రంలో గల ఓ ప్రైవేట్ పర్టిలైజర్ లో యూరియా పంఫిణి కార్యక్రమం చేపట్టారు. ఈ యూరియా పంఫిణిలో రైతులు అధిక సంఖ్యలో టోకెన్ తీసుకొని క్యూలైన్ లో ఉదయం నుంచి వేచి ఉండగా పోలీస్ బందోబస్తు మద్య యూరియా పంపిణి చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత కొన్ని నెలల క్రితం వర్షాలు లేక వర్షాలకు ఏడిస్తే ఇప్పుడు వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికి యూరియా కోసం పడిగాపులు కాయవలసి వస్తుందని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చౌటకూర్ మండల రైతులకు చౌటకూర్ ప్రైవేట్ సెక్టార్ వీరభద్ర 10 టన్నులు డీసీఎం ఎస్సీ 20 టన్నులు ,శివంపేట్ యూరియా 30 టన్నులు ఈ ఖరీఫ్ సీజన్లో 950 టన్నుల యూరియాను అందుబాటులకు వచ్చిందని రైతు వేదిక అధికారి ఏవో చెప్పారు. మండల కేంద్రంలోని వీరభద్ర ఫర్టిలైజర్ సోసైటీ కార్యాలయం ఎదుట యూరియా బస్తాలు కోసం రైతన్నలు ఉదయం 6 గంటల నుండే క్యూ లైన్ లో నిలబడి నిరీక్షంచారు. రాత్రి 7 వరకు కూడా క్యూలైన్ లో నిలబడిన యూరియా బస్తాలు దొరకడం లేదని రైతన్నలు అగ్రహం వ్యక్తం చేశారు.

## యూరియా తిప్పలు.. రైతుల బారులు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** యూరియా కోసం రైతులు భారీ సంఖ్యలో బారులు తీరారు. గత 15 రోజుల నుంచి యూరియా సరఫరా జరుగుతున్నా గానీ సరిపోను సంచులు దొరకకపోవడం రైతులు ప్రతి రోజు భారీ సంఖ్యలో బారులు తీరాల్సి వస్తుంది. ఏడెనిమిది సంచులు అవసరం ఉన్న రైతులు ఇంట్లో ఎంతమంది ఉంటే అంత మంది ఇక్కడే వచ్చి క్యూలైన్‌లో నిలబడి యూరియా తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, పొద్దున లేచిన నుంచి యూరియా కోసమే తిరగాల్సి వస్తుందని రైతులు అసహనం వ్యక్తం చేశారు. బెదురు చింతల్ మల్లన్నగుడి వెనకాల నుంచి వెంచర్ మీదుగా కో ఆపరేటీవ్ బ్యాంకు వరకు రైతులు మహిళా రైతులు భారీ సంఖ్యలో క్యూ లైన్ కొట్టడంతో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి కట్టడి చేశారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరా చేసేందుకు ప్రతి నిత్యం యూరియా లోడ్ తెప్పించేందుకు ప్రయత్నిస్తూనే రైతులకు సరిపడ యూరియా తెప్పించి ఇస్తామని సూచించారు. జిల్లా అధికారులతో మాట్లాడి మండలానికి మరింత యూరియాను తెప్పించి ఇస్తామని పీఏసీఎస్ సీఈఓ మధుయాదవ్ అన్నారు.

## లక్ష్మీనర్సింహుని సన్నిధిలో హైకోర్టు జడ్జి ప్రవీణ్‌కుమార్



**ప్రజాపక్షం/భీమ్‌గల్:** ప్రముఖ పుణ్యక్షేత్రం నింభాచల లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాన్ని హైకోర్టు జడ్జీ గాడి ప్రవీన్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ధర్మకర్త నంబి పార్థసారథి ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోశ్చరణతో స్వాగతం పలికారు. మొదటగా గర్భాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు స్వామివారి శేష వస్త్రాన్ని అందజేసి జడ్జీ ఆట్లాడారు. ఎంతో ప్రాముఖ్య కలిగిన క్షేత్రాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. తన స్వగ్రామమైన భీమ్‌గల్‌కు హైకోర్టు జడ్జీగా పదవి చేపట్టి మొదటిసారిగా రావటంతో గ్రామస్తులంతా వచ్చి తనకు స్వాగతం పలకడం ఎంతో సంతోషంగా అనిపించిందని తెలిపారు. ఆలయం ధకర్మకర్త నంబి పార్థసారథి ఆలయ విశిష్టత జడ్జీకి తెలిపారు. జడ్జీ వెంట ఆర్మూర్ సీనియర్ సివిల్ జడ్జీ శ్రీనిధి సిబ్బంది మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లెల రాజశ్రీ, లక్ష్మన్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు నర్సయ్య, ఆలయ పురోహితులు నంబి వాసుదేవ్, శ్రీనివాస్, పవన్, శ్యామ్, భూమయ్య, శ్రీనివాస్, సుదర్శన్, రాజశేఖర్ ఉన్నారు.

## నిర్మల్‌లో గణేష్ నిమజ్జనం కోసం పటిష్ఠ భద్రత

### జిల్లా ఎస్‌పి జానకి షర్మిల



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** గణేష్ నిమజ్జన శోభాయాత్రను విజయవంతంగా,శాంతియుతంగా నిర్వహించేందుకు నిర్మల్ జిల్లా పోలీసు శాఖ విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల స్వయంగా నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు.ఆమె మాట్లాడుతూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.శోభాయాత్ర సాగే మార్గంలో ప్రధాన కూడళ్ల వద్ద, అలాగే బంగల్‌పేట్‌లోని నిమజ్జన ఘాట్ వద్ద మొత్తం 180 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఈ కెమెరాల దృశ్యాలను నేరుగా కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి,ప్రతి కదలికపైనా నిఘా ఉంచుతున్నారు.అవాంఛనీయ ఘటనలు జరగకుండా నివారించేందుకు యాత్ర మార్గంలో ఉన్న ధార్మిక స్థలాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాటు చేశారు.ఈ నిమజ్జన కార్యక్రమం కోసం జిల్లా ఎస్పీతో పాటు,ఒక అదనపు ఎస్పీ,ఇద్దరు ఏఎస్పీలు,11 మంది ఇన్‌స్పెక్టర్లు, 31 మంది ఎస్ఐలు,106 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 323 మంది కానిస్టేబుళ్లు,31 మంది మహిళా పోలీసులను మోహరించారు.నిబంధనలుఉల్లంఘించిన వారిపై చట్టపరమైనచర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గణేష్ నిమజ్జన ఉత్సవాలను పోలీసులు ఇచ్చిన సూచనలు పాటిస్తూ శాంతియుత వాతావరణంలో విజయవంతం చేయాలని ఎస్పీ.డా.జి.జానకి షర్మిల ప్రజలకు కోరారు.

## విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించాలి

### కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రధాన కార్య క్రమానికి టీజీఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డితో కలసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్‌పి. ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని తమ విద్యార్థుకు సంపూర్ణ భోదనను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో బోదన సవాలుతో కూడుకున్నదని ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా కొత్త కొత్త విషయాలను నేర్చుకున్నపుడే విద్యార్థులకు సులభంగా అన్ని అంశాలను బోదించగలుతాడన్నారు. ప్రభుత్వ పరంగా పాఠశాలలో మౌళిక వసతులు మెరుగు కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. బోదనకు అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సంపూర్ణ విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గతంలో లా కాకుండా ప్రభు త్వం పాఠశాల మెయింటెనెన్స్ నిదులు సకాలంలో విడుదల చేస్తున్నదని ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన ఉపాధ్యాయులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో ఉపాధ్యాయునికి ,తల్లిదండ్రుల తరువాత స్థానం ఇవ్వబడిందన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పాఠశాలల్లో మౌళిక వసతుల మెరుగు కోసం కృషి చేస్తున్నదన్నారు. ప్రైవేటు పాఠశాలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం గల ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని తమ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు జిల్లాలోని వివిద ఉపాధ్యాయులు సంఘాలు నాయకులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాల్గొన్నారు.

# క్రీడ

# రూ.400 కోట్ల ఆదాయంపై కన్ను

## టీమిండియా జెర్సీ స్పాన్సర్‌షిప్ ధర పెంపు!



భారత జట్టుకు కొత్త జెర్సీ స్పాన్సర్ వేటను ప్రారంభమైంది. ఆశావహుల నుంచి దరఖాస్తులు అహ్వానించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరల్లో మార్పులు చేసింది. ఆన్ లైన్ గేమింగ్, గ్యాంబ్లింగ్ నియంత్రణ చట్టం కారణంగా డ్రీమ్ 11తో ఒప్పందం రద్దు చేసుకున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు బిసిసిఐ వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక సిరీస్‌లకు.. వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలకు విడిగా ధరను నిర్ణయించింది. మొత్తంగా వచ్చే మూడేళ్లలో రూ.400 కోట్లకు పైగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో బిసిసిఐ ఉందని సమాచారం. ప్రస్తుతం భారత జట్టు జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరలు.. ద్వైపాక్షిక సిరీస్‌లో రూ.3.17 కోట్లు, ప్రపంచ కప్ వంటి మ్యాచ్‌లకు రూ.1.12 కోట్లుగా ఉన్నాయి. అయితే.. డ్రీమ్ 11తో ఒప్పందం అనూహ్యంగా రద్దు చేసుకోవాల్సి రావడంతో బిసిసిఐ ధరల్లో మార్పులు చేసింది. ఇకపై నుంచి రెండు దేశాల టోర్నీలో జెర్సీ స్పాన్సర్‌షిప్ ధర రూ.3.5 కోట్లు, పలు దేశాలు పోటీపడే వరల్డ్ కప్ వంటి టోర్నీలకు రూ.1.5 కోట్లు చెల్లించాలనే నిబంధన పెట్టింది. ఉన్నట్టుండి జెర్సీ స్పాన్సర్‌షిప్ ధరల పెంపు నిర్ణయానికి కారణాలు ఉన్నాయి.

### ధరలో వ్యత్యాసం అందుకే

ద్వైపాక్షిక సిరీస్‌లు అనుకోండి.. స్పాన్సర్ పేరు జెర్సీ ముందు భాగంలో ఉంటుంది. ఆ సిరీస్ ఆసాంతం పలు మార్లు స్పాన్సర్ కంపనీ పేరు కనపిస్తుంది. అదే వరల్డ్ కప్ వంటి టోర్నీల్లో స్పాన్సర్ పేరు జెర్సీ చేతుల మీద మాత్రమే ఉంటుంది. దాంతో, పేరు స్పష్టంగా.. తరచుగా కనిపించే అవకాశాలు తక్కువ. కాబట్టి.. ధరలను నిర్ణయించే ముందు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్నట్టు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి.

వచ్చే మూడేళ్లలో భారత జట్టు మూడు ఫార్మాట్లలో కలిపి 130 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో టీ20 వరల్డ్ కప్, వన్డే వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలు ఉన్నాయి. సో.. ఈ కాలంలో కొత్త స్పాన్సర్ ద్వారా రూ.400 కోట్ల ఆదాయం బిసిసిఐ ఖజానాకు చేరనుంది. టీమిండియా జెర్సీ స్పాన్సర్ కోసం సెప్టెంబర్ 16 లోపు బిడ్డింగ్‌లు వేయాలని ప్రకటన విడుదల చేసిన విషయ తెలిసిందే.

## ఏడో వరల్డ్ కప్‌పై గురి..!



## ‘ఆల్‌రౌండర్ల’తో ఆస్ట్రేలియా రె‘ఢీ’

ఐసిసి టోర్నీల్లో తిరుగులేని ఆస్ట్రేలియా మరోసారి వన్డే వరల్డ్ కప్ లక్ష్యంగా సిద్ధమవుతోంది. ఇప్పటికే ఏడుసార్లు విజేతగా నిలిచిన ఆసీస్ పటిష్టమైన స్క్వాడ్‌తో భారత్‌కు వస్తోంది. అలీసా హేలీ కెప్టెన్‌గా శుక్రవారం సెలెక్టర్లు పదిహేను మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఎప్పటిలానే ఇప్పుడు కూడా మ్యాచ్ విన్నర్లు అయిన ఆల్‌రౌండర్లకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గాయం నుంచి కోలుకున్న లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ సోఫీ మొలినెక్స్, డార్సీ బ్రౌన్, జార్జియా వరేహమ్‌లను వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ‘వరల్డ్ కప్ స్క్వాడ్ ఎంపికలో మేము అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకున్నాం. భారత్, శ్రీలంకలో స్పిన్నర్లు కీలక పాత్ర పోషిస్తారని తెలుసు. అందుకే.. సోఫీ మొలినెక్స్‌కు స్క్వాడ్‌లో చోటిచ్చాం. గాయం నుంచి కోలుకుంటున్న ఆమె వరల్డ్ కప్ వరకూ ఫిట్‌నెస్ సాధిస్తుందనే నమ్మకం మాకుంది అని ఆస్ట్రేలియా జాతీయ సెలెక్టర్ షాన్ ఫ్లెగ్లెర్ వెల్లడించాడు.

ప్రపంచ కప్‌లో అధిపత్యం చెలాయించే ఆసీస్ ఈసారి కూడా మెగా టోర్నీకి పక్కా ప్లాన్‌తో వస్తోంది. టాపార్డర్‌లో దంచికొట్టేందుకు అలీసా హేలీ, డార్సీ బ్రౌన్, ఫొబె లిచ్‌ఫీల్డ్ ఉన్నారు. తహ్లియా మెక్‌గ్రాత్, జార్జియా వరేహం, ఎలీసా పెర్రీ, అషే గార్డ్‌నర్ ఆల్‌రౌండర్లుగా ఇరగదీయడం ఖాయం. మేఘన్ షట్, సథర్‌లాండ్ జార్జియా వొల్‌తో కూడిన పేస్ దళం కూడా పటిష్టంగానే ఉంది.

**ఆస్ట్రేలియా స్క్వాడ్ :** అలీసా హేలీ(కెప్టెన్), తహ్లియా మెక్‌గ్రాత్(వైస్ కెప్టెన్), డార్సీ బ్రౌన్, అషే గార్డ్‌నర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిస్, అలనా కింగ్, ఫొబె లిచ్‌ఫీల్డ్ సోఫీ మొలినెక్స్, బేత్ మూనీ, ఎలీసా పెర్రీ, మేగన్ షట్, అనాబెల్ సథర్‌లాండ్ జార్జియా వొల్, జార్జియా వరేహమ్.

## దుబాయ్ చేరుకున్న టీమిండియా తొలి బృందం


ఆసియా కప్ కోసం భారత బృందం దుబాయ్ చేరుకుంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, పేసర్ హార్దిక్ పాండ్యా, హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌లు గురువారం ఉదయం ముంబై విమానాశ్రయం నుంచి దుబాయ్‌కి బయలుదేరారు. షెడ్యూల్ ప్రకారం 4వ తేదీ సాయంత్రం వరకూ స్క్వాడ్‌లోని క్రికెటర్లు దుబాయ్‌లో సమావేశం కావాల్సి ఉంది. కానీ.. ఇప్పటికైతే కోచ్, కెప్టెన్, పాండ్యా మాత్రమే వెళ్లారు. అనారోగ్యం నుంచి కోలుకుని.. ఫిట్‌నెస్ పరీక్ష ఎదుర్కొంటున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేరుగా బెంగళూరు నుంచే దుబాయ్ వెళ్లనున్నాడు. దులీప్ ట్రోఫీలో ఆడుతున్న పేసర్లు అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానాలు, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ కూడా శుక్రవారంలోపు స్క్వాడ్‌తో కలుస్తారు. కోచింగ్ సిబ్బంది కూడా ఈరోజుకల్లా ఎడారి దేశం చేరుకోనున్నారు. స్క్వాడ్‌లోని అందరూ కలిశాక.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు వెళ్లనుంది టీమిండియా బృందం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ షురూ కానుంది. ఇప్పటివరకూ ఎనిమిది సార్లు (ఏడు సార్లు వన్డే ఫార్మాట్‌లో, ఒకసారి టీ20 ఫార్మాట్‌లో) ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా తొమ్మిదో ట్రోఫీపై గురి పెట్టింది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా బృందం సెప్టెంబర్ 4న దుబాయ్‌కు చేరుకోనుంది. తొలి పోరులో భాగంగా ఆతిథ్య యూఏఈతో తలపడనుంది. అనంతరం సెప్టెంబర్ 14న పాకిస్థాన్ జట్టును, సెప్టెంబర్ 19న పసికూన ఒమన్ టీమ్‌ను టీమిండియా ఢీకొట్టనుంది.

**ఆసియా కప్ స్క్వాడ్ :** సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ (వికెట్ కీపర్), రింకూ సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రానా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.



# సైన్స్ ఫోకస్

## తగ్గుతున్న భూభ్రమణ వేగం!





భూమిపై ఒక పూర్తి రోజు దాదాపు 86,400 సెకన్లు లేదా 24 గంటలు. కానీ శాస్త్రవేత్తల ప్రకారం, ఈ వేసవిలో గ్రహం వేగంగా తిరుగుతోంది, దీని వలన సమన్వయ సార్వత్రిక సమయం (యుటిసి) నుండి ఒక సెకను తగ్గించే ఆలోచన వచ్చింది. ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్, యుఎస్ నావల్ అబ్జర్వేటరీ జులై 10న, ఇప్పటివరకు సంవత్సరంలో అతి తక్కువ రోజుగా ప్రకటించాయి. ఆ రోజున 24 గంటల కంటే 1.36 మిల్లీసెకన్లు తక్కువ నమోదైంది. ప్రపంచంలోని అధికారిక సమయపాలనదారులు ఈ వేగం ఇలాగే కొనసాగితే అపూర్వమైన చర్య తీసుకోవలసి ఉంటుందిదని, ప్రపంచ సమయం నుండి ఒక పూర్తి సెకనును తీసివేయాల్సి వస్తుందని అంటున్నారు.



## అనంత విశ్వంలో అంతుచిక్కని రహస్యాలు

తన లోతుల్ని కనుక్కోమంటూ అనాదిగా మనిషికి సవాళ్లు విసురుతున్న అనంత విశ్వం ఎన్నో రహస్యాలను తనలో ఇముడ్చుకుంది. ఒక సిద్ధాంతం ఖరారయ్యేలోగా, వేల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. నిత్యం జరుగుతున్న విస్తారమైన పరిశోధనలు విజయాలు సాధిస్తున్నప్పటికీ, విశ్వం యొక్క విశాలమైన విస్తీర్ణం మానవాళి ఇంకా పరిష్కరంకాని, అంతుచిక్కని రహస్యాలతో నిండి ఉంది. భూమిని ఆలంబనంగా చేసుకొని, విశ్వం యొక్క నిజమైన పరిధిని అర్థం చేసుకోవడం కష్టం. అయినప్పటికీ, శాస్త్రవేత్తలు అంతరిక్షంలోని వింతలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తునే ఉన్నారు. ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతునే ఉంది. కాగా, ఇటీవల కాలంలో శాస్త్రవేత్తలు అంతరిక్షంలో కనుగొన్న విషయాల్లో అంగారక గ్రహం ఒకప్పుడు ఆవసయోగ్యంగా ఉండేదని, ఆ తర్వాత దాని పరిస్థితులు మారాయన్నది ప్రధానమైనది. హార్వర్డ్‌లోని పాలియోమాగ్నెటిక్స్ ల్యాబ్ పరిశోధకులు జరిపిన అధ్యయనంలో , జీవానికి మద్దతు ఇచ్చే అంగారకుడి అయస్కాంత క్షేత్రం గతంలో అనుకున్నదాని కంటే చాలా ఎక్కువ కాలం ఉండి ఉండవచ్చని తేలింది. అంగారక గ్రహం ఇప్పుడు చల్లగా, బంజరుగా, రాతితో నిండి ఉన్నప్పటికీ, అయస్కాంత క్షేత్రం 3.9 బిలియన్ సంవత్సరాల క్రితం వరకు ఉండి ఉండవచ్చని ఆధారాలు సూచిస్తున్నాయి. మునుపటి అంచనాలు 4.1 బిలియన్ సంవత్సరాలతో పోలిస్తే ఎర్ర గ్రహం జీవానికి అనుకూలమైన వాతావరణం క్రమంగా మెరుగుపడుతున్నది. అయితే, ఎప్పటికి అది ఆవాసయోగ్యమవుతుందనేది సమాధానం లేని ప్రశ్న.

## అగ్నిపర్వతాల విస్ఫోటనాలను చెట్లు గుర్తిస్తాయి!



ఇది నిజం.

అగ్ని పర్వతాలు విస్ఫోటనం చెందే ముందు, భూమి పొరల్లో పలుచని తరంగాలు మెల్లగా కదులుతూ ఉంటాయి. ఈ కదలికలను చెట్లు ముందుగానే గుర్తిస్తాయి. శాస్త్రవేత్తలు ఇటీవల ఈ అంశాన్ని గుర్తించారు. వారి నివేదికలను అనుసరించి, ఒక అగ్నిపర్వతం పేలడానికి ముందు, భూమి పొరల్లో జరిగే మార్పులను చెట్లు గురిస్తాయి. అంతేకాదు, వాటి ప్రతిస్పందనను అంతరిక్షం నుంచే చూడగలిగేలా ఒక ప్రత్యేక నమూనాను కూడా సృష్టిస్తాయి. అంటే, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు చోటు చేసుకోకముందే, ప్రకృతి హెచ్చరిక జారీ చేస్తుంది. కానీ, ఆ హెచ్చరికలను వినడానికి, అర్థం చేసుకోడానికి మనుషులు చేసే ప్రయత్నాలు చాలా తక్కువ. కేవలం యంత్రాలు మాత్రమే ప్రకృతి ప్రమాదాలను గుర్తిస్తాయని మనం నమ్మినా, ఈ ఆవిష్కరణ జీవజాతులే భూమి రీతులను ఎప్పటి నుంచో అర్థం చేసుకుంటూ వస్తున్నాయని నిరూపిస్తున్నది. మొక్కల ప్రతి ఆకు, వేరులు, కొమ్మలు మనకంటే ప్రాచీనమైన జ్ఞానాన్ని మోసుకెళ్తున్నాయన్నది మరోసారి రుజువైంది. వాటి స్పందనల్లో భూమితో ఉన్న గాఢమైన అనుభూతి, మమేకమయ్యే విధానం దాగి ఉంటాయి. మనం ప్రకృతి సంకేతాలను అర్థం చేసుకోవడం మొదలుపెడితే, ఒక విస్మరిస్తున్న సత్యం మళ్లీ మనకు అర్థమవుతుంది. ప్రకృతి విలయాలపై హెచ్చరికలు గుర్తించే విధానం తెలుస్తుంది. మనుషులు మాత్రమేకాదు.. చెట్లు కూడా భూమిలో ఒక భాగమేనని ఎంత తొందరగా నమ్మితే అంత మంచిది.

## డార్క్ ఎనర్జీ బలహీనం..

విశ్వంలో దాదాపు 70 శాతం డార్క్ ఎనర్జీ ఆక్రమించి ఉంది. కానీ కొన్ని ఇటీవలి నివేదికలు అది కాలక్రమేణా బలహీనపడుతోందని సూచిస్తున్నాయి. 900 కంటే ఎక్కువ మంది పరిశోధకులతో కూడిన అంతర్జాతీయ బృందం 15 మిలియన్ గెలాక్సీలు, క్వాసార్ల నుండి మూడు సంవత్సరాల డేటాను విశ్లేషించిన తర్వాత తమ పరిశోధనలను సమర్పించింది. పరిశోధనలు చీకటి శక్తి ఒక ‘విశ్వ స్థిరాంకం‘ అని చూపించాయి. కానీ, అది కాలక్రమేణా ఊహించని విధంగా మారుతోందని పేర్కొంటున్నాయి. విశ్వం ప్రారంభంలో చీకటి శక్తి చాలా బలంగా ఉందని డేటా చూపించింది. అయితే, అది కాలక్రమేణా బలహీనపడిందని ఈ పరిశోధనలు ఒక కొత్త సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చాయి. దీనిపై మరింత విస్తృతమైన పరిశోధనలు జరగాల్సి ఉంది.



# పాఠ్యాంశంగా తెలంగాణ సాయుధ పోరాటం

సిపిఐ జాతీయ నేత చాడా వెంకటరెడ్డి డిమాండ్

ఈనెల 11 నుండి 17 వరకు తెలంగాణ రైతు సాయుధ పోరాట వారోత్సవాలు





**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని సిపిఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 77వ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను ఈనెల 11 నుండి 17 వరకు ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని ప్రభాకర్ భవన్‌లో సిపిఐ జగిత్యాల జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం ములుగురి హనుమంతు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా గ్రామ, మండల, జిల్లా కేంద్రాలలో ఎర్ర జెండాలు ఎగురవేసి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాలలో నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్లమెంటు సభ్యుడు బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మగ్గం మోహినుద్దీన్, ఆరుట్ల కమల రామచంద్రారెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం, రాజ్‌బహదూర్‌గౌడ, దొడ్డి కొమరయ్య, అనవీరి ప్రభాకర్, సోయాబుల్లా ఖాన్, షేక్ బందగి, చాకలి ఐలమ్మలు భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం హీరోచిత పోరాటాలు చేశారన్నారు. నాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో 4500 మంది అమరులయ్యారన్నారు. నాటి పోరాటంలో 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచబడిందన్నారు. రజాకార్ల పాలన నుండి 3000 గ్రామాలు విముక్తి పొందాయని వివరించారు 1948 సెప్టెంబర్ 17న నిజాం నవాబ్ హైదరాబాద్ సంస్థానం తెలంగాణలో విలీనం అయింద న్నారు. ఈ చరిత్ర ప్రజలకు వివరించాలన్నారు. బిజెపి ప్రభుత్వం సాయుధ పోరాట చరిత్రను హిందూ–ముస్లిం పోరాటంగా వక్రీకరిస్తుందని విమర్శించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని దినోత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచులుగా, ఎంపిటిసిలుగా పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. సమావేశానికి ముందు సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, సహాయ కార్యదర్శి ఎరుగు రాల భూమేశ్వర్, మాజీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్, ఎర్రదండి భూమయ్య, జిల్లా నేతలు సుతారి రాములు, మహమ్మద్ మౌలానా, ఎండి ముఖం, మహమ్మద్ ఉస్మాన్, కొక్కుల శాంత, అన్నం రాధ, మాడిశెట్టి కిరణ్, కొండ రాజయ్య, సనిగారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం, కుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మతోన్మాదానికి, కుల విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ కోరారు. దేశంలో నిరంతరం ప్రజల కోసం సిపిఐ పని చేస్తుందన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఆధ్వర్యంలో ప్రజాపంథా జిల్లా నాయకులు సిహెచ్.సాయ గౌడ్‌తో పాటు డిచ్‌పల్లి, ఇందల్వాయి నాయకులు పలువురు సిపిఐలో చేరారు. వారికి పశ్య పద్మ ఎర్రకండువా కప్పి పార్టీ ఆహ్వానించారు. దేశంలో జరుగుతున్న భౌతిక పరిస్థితులకు అనుకూలంగా సిపిఐ పోరాటాలు చేస్తునందున సిపిఐలో చేరుతున్నట్లు సాయగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పశ్య పద్మ మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసే నాయకులు సిపిఐలో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమయ్య, సుధాకర్, ఓమయ్య, రాజేశ్వర్, విఠల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## 27న వ్యవసాయ మార్కెట్ యార్డు కార్మికుల రాష్ట్ర రెండవ మహాసభలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** వ్యవసాయం మార్కెట్‌యార్డు కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఉమా మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర హమాలి, దడువాయి, చాట, గుమాస్తా, స్వీపర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండవ మహాసభలను నిర్వహిస్తున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు గుమాస్తా సంఘం కార్యాలయంలో ఏఐటియుసి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండవ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ పార్టీ శాసనసభా పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజు హాజరవుతున్నారన్నారు. ఈ మహాసభల్లో తెలంగాణ వ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై చర్చించడంతోపాటు మార్కెట్ యార్డుల అభివృద్ధి, మార్కెట్ యార్డుకు తమ పండించిన ధాన్యాన్ని తీసుకువచ్చే రైతుల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై చర్చించడంతో పాటు భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపకల్పన చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలకు రాష్ట్రంలోని మార్కెట్ యార్డులకు సంబంధించిన కార్మికులందరు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ అధ్యక్షులు పరశురాం, కార్యదర్శి శ్రీహరి, దడువాయి యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి రణం రవిందర్ గౌడ్, గుమాస్తా సంఘం అధ్యక్షులు బాలాంజనేయులు, శివ, అనసూయ, నరసయ్య, సుధాకర్ గౌడ్, నరేష్, స్వామి పాల్గొన్నారు.

## రైతు సమస్యలు పరిష్కరించాలని 8న ధర్నా

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (ఎం):** రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 8న తహసీల్దార్ కార్యాలయాల ముందు చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ జిలా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సిపిఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు కొరత లేకుండా యూరియాను సరఫరా చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, మండలంలోని అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలని, అసంపూర్తిగా ఉన్న కల్వర్ట్‌లను పూర్తి చేయాలన్నారు. వర్షాలతో అనేక ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని వారందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని, ఇండ్లు కూలిన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జక్క దయాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శులు చేడే చంద్రయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి మహ్మద్ నయీమ్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుర్రం రాజమణి, కార్యవర్గ సభ్యులు యాస బుచ్చిరెడ్డి, కసరబోయిన సత్తయ్య, కల్వల నర్సయ్య, మారుపాక అంజయ్య, ఆత్మకూర్ పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య, దుర్గపతి నరసింహ, సోమనబోయిన నరసింహ, తాళ్ళపల్లి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలి

సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా



**ప్రజాపక్షం/చండూరు :** సమగ్ర వ్యవసాయ కార్మిక సంక్షేమ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం మునుగోడు నియోజకవర్గ కౌన్సిల్ సమావేశం శుక్రవారం చండూరులోని సిపిఐ కార్యాలయం మాధగోని నర్సింహ్మా భవనంలో ఎండి జానీమియా అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిధిగా బొల్గూరి నర్సింహ్మా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ బీసీ బలహీన వర్గాల పై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ను అమలు జరిపి వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 12వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ 6వేలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం అమలు చేయాలని , ప్రభుత్వ స్థలాలలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్న వారికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జిహెచ్ ఊషయ్య , మాజీ జడ్‌పిటిసి గోసుకొండ లింగయ్య , సంఘం మండల కార్యదర్శి ఇరిగి సంజీవ, దోటి బిక్షం, కాయత వెంకన్న, జక్కల అంజయ్య , వల్లపు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పోరాట ఫలితంగానే భవన నిర్మాణ కార్మికులకు బీమా

యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ :** ఎఐటియుసి పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయం తీసుకున్నాయని బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్(ఎఐటియుసి) జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య తెలిపారు. తెలంగాణ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శుక్రవారం జరిగింది. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గందె కొమురయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పిట్టల సమ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదంలో మరణించిన వారికి రూ.పది లక్షలు, సహజ మరణం పొందిన వారికి రూ.2లక్షలు ఆర్థిక సహాయం అందించనున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల చాలామంది మరణించిన కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వివాహం, ప్రసవ(డెలివరీ) బెనిఫిట్స్ పెంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అందుకు కార్మికులు ఐక్యంగా ముందుకు వచ్చి తమ డిమాండ్లు సాధించుకోవాలని కోరారు. 55 సంవత్సరాలు నిండిని కార్మికులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న లేబర్ కార్డుల ఫైళ్లను వెంటనే క్లియర్ చేసి అర్హులైన వారికి కార్డులు అందజేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిలు రేగుల కుమార్, కసిబోజుల సంతోష్ చారి, జిల్లా కోశాధికారి గోదారి లక్ష్మ ణ్, పుట్ట మహేష్‌కుమార్ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## రైతాంగ హక్కుల కోసం నిరంతర పోరాటం



ప్రజాపక్షం/జఫర్‌గఢ్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకిచ్చిన హామీలు అమలు కోసం నిరంతరం ఉద్యమాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తమ్మడపల్లి ఐ గ్రామంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మహాసభ నిర్వహించారు.ఈ సందర్భంగా రాపర్తి సోమయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపి అధికారంలో వచ్చిన నాటి నుండి రైతాంగ హక్కులను కాలరాస్తూ రైతులకు వ్యతిరేకంగా విద్యుత్ చట్టాన్ని, మార్కెట్లో ముసాయిదా చట్టం తీసుకొచ్చిందన్నారు. పంటల బీమా పథకాన్ని తీసుకు రావాలన్నారు. అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బుచ్చిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రాజిరెడ్డి, బాలు, ప్రధాన కార్యదర్శిగా ఏలియా, సహాయ కార్యదర్శిగా భూపాల్‌రెడ్డి, సత్యం, కమిటీ సభ్యులుగా రాజమౌళి, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక జిఒలను రద్దు చేయ్యాలి



ప్రజాపక్షం / నల్లబెల్లి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు వ్యతిరేక జివోలను రద్దు చేయ్యాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేస్తు జివో కాపీలను దగ్ధం చేశారు . శుక్రవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కడియాల వీరాచారి ,బోడిగే సమ్మయ్యలు మాట్లాడుతూ రైతులు పండించే పత్తి పంటకు 11 శాతం సుంకం పెంచుతు తీసుకు వచ్చిన జివోలను రద్దు చేయ్యాలన్నారు . రైతుల నడ్డి విరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు ,జివోలను తీసుకు వచ్చి రైతులు పండించే పంటలు ఉత్పత్తిని దెబ్బ తీస్తుందన్నారు . ఈ కార్యక్రమంలో బూస నరయ్య ,రాయమూర్తి ,మంద రాజన్న ,పెద్ద రాజన్న తదితరులు పాల్గొన్నారు .

## కొమురయ్య ఆశయాలను కొనసాగించాలి

ఏఐటీయూసి బ్రాంచ్ కార్యదర్శి రమేష్



ప్రజాపక్షం/భూపాలపల్లి :నిరంతరం సింగరేణి కార్మికుల హక్కుల కోసం పోరాడిన కామ్రేడ్ కొమురయ్య ఆశయాలను కొనసాగించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొమురయ్య 29వ వర్ధంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని ఏఐటీయూసి కొమురయ్య భవన్లో బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ముఖ్యఅతిథిగా హాజరై ఏఐటీయూసీ నాయకులతో కలిసి కామ్రేడ్ కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ,కార్మికులందరికీ ఇప్పుడు అనుభవిస్తున్న పెన్షన్ ను ప్రసాదించిన గొప్ప కార్మిక నాయకుడు మనతోటి కొమురయ్య అని అన్నారు. ఆయన మన మధ్యలో లేకపోయినా ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.కార్యక్రమంలో ఏఐటియూసీబ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, ఏఐటీయూసి నాయకులు పాల్గొన్నారు.

## వికలాంగులు, నడవలేని వృద్ధులకు ఇంటి వద్దకే పించన్ అందజేయాలి


ప్రజాపక్షం/ములుగు:ఫించన్ తీసుకోవడానికి వికలాంగులు, నడవలేని స్థితిలో ఉన్న వృద్దులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు అధికారులు వారికి ఇండ్ల వద్దనే ఫించన్లు అందజేయాలని కోరారు. వారిని ఫించన్ల కేంద్రాల వద్దకు తీసుకురావడానికి కూలీ పనులు చేస్తే బతికే కుటుంబ సభ్యులు కూలీ పనులు మానుకొని చాలా ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వారందరికి అధికారులు ఇంటి వద్దనే ఫించన్లు అందజేయాలని కోరారు.

## ముఖ్యమంత్రి నుండి అవార్డు అందుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ :ఎన్ఏఎస్‌లో ప్రతిభ కనబర్చి దేశంలోనే అభ్యాసనలో 50 జిల్లా లో చోటు సంపాదించి తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టినందుకు గాను జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్, ఇంచార్జ్ విద్యాశాఖ అధికారి పింకేష్‌కుమార్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సన్మానించి అభినందనలు తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో పలు రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించారు. అభ్యాసనలో జనగామ జిల్లా దేశంలోనే 50 జిల్లాలో చోటు సంపాదించింది. తెలంగాణ రాష్ట్రంలో జనగామ ఒక్కటే ఉండడం అభినందనీయం. దేశంలోనే జనగామ ప్రతిభను నిలబెట్టిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌ను ఎక్స్ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో శాలువాలతో సన్మానించి మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనగామ జిల్లాలోని ఉపాధ్యాయుల కృషి ఫలితంగా ఇది సాధ్యమైందన్నారు. దేశంలోనే జనగామకు పేరు రావడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి అభినందించడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ సందర్భంగా అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

## గణపతికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, టిపిసిసి వైస్ చైర్మన్



ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొలువుదీరిన మట్టి వినాయకుడికి నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్‌రెడ్డి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో పార్టీ నాయకులు, మహిళలు డప్పులు, భక్తిగీతాలు, సాంప్రదాయ నృత్యాలతో ఊరేగింపుగా గణనాథుని నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఘ్న పతి అయిన గణనాథుని ఆశీస్సులతో మన ప్రాంతాని శ్రేయస్సు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక**

మండలంలోని మంచుప్పుల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారిలో సోమిరెడ్డి, యాకయ్య, మహేష్, సైదులు, ప్రశాంత్, శ్రీను, వెంకన్న, గణేష్, మల్లేష్, యాకయ్య, అశోక్, రవి, యాదగిరి, సతీష్, మల్లయ్య ఉన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే
# మార్గదర్శకులు గురువులు



గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి

ప్రజాపక్షం / వరంగల్ : తరగతి గదుల్లో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు గురువులని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం లో భాగంగా వరంగల్ లోని ఆకుతోట ఫంక్షన్ హాల్లో శుక్రవారం మేయర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి లతో కలసి జ్యోతి ప్రజలను చేసి గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ విద్యతోపాటు విలువైన జ్ఞానాన్ని నేర్పించేది గురువులని అన్నారు. ఒక విద్యార్థి జీవితాన్ని మారుస్తుంది చదువు కాదు చదువు నేర్పించే గురువు అని అన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే గురువుల మనకు జీవితం బోధిస్తారు అన్నారు. గురువు లేకుండా సమాజానికి మార్గం ఉండదని వారి జీవితాలే విద్యార్థులకు బోధనలుగా నిలుస్తాయని, గురువుల సేవలు ఎన్నటికీ మరువలేమని తెలిపారు. గురువుల తయారు చేస్తున్న విద్యార్థులే రేపటి డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, నాయకులు దేశ సేవకులను అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఉపాధ్యాయుల నియామకం చాళ్లల్లో మౌలిక సదుపాయాల కల్పన చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగాఎక్కువమంది పిల్లలు ఉన్న 571 గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది పాఠశాలలు ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు. నాణ్యమైన భోజనం, యూ నిఫామ్‌లు, కొత్త డైట్ మెనూ, విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నా రు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలు. వారి చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ విద్య ఇచ్చిన గొప్ప అవకాశం తోనే ఈ స్థాయికి ఎదిగామని పేర్కొన్నారు. జన్మిఇచ్చిన తల్లిదండ్రులకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో ఉపాధ్యాయులకు అంతకంటే రెట్టింపు గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించినట్లయితే ప్రభుత్వ పాఠశాలల్లో సంఖ్య పెరుగుతుందన్నారు. నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నేడు ఈ స్థానంలో ఉండడానికి కారణం విద్యను అందించిన గురువులేనని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి జీవిత చరిత్ర మనందరికీ ఆదర్శం అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయుల పిల్లలు ప్రభుత్వ పాఠశాల్లో విద్యాభ్యాసం చేసినట్లయితే విద్య పై నమ్మకం కలిగి పిల్లల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు.అనంతరం వరంగల్ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందిని అతిథుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సిఇఒరామిరెడ్డి, డిఇఒ రంగయ్య నాయుడు, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, మండల విద్యాధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతోనే మున్సిపల్ కార్మికుడి మృతి



ప్రజాపక్షం/తొర్రూరు : ములుగు జిల్లాలో మున్సిపల్ కార్మికుడు మైదం మహేశ్ అధికారులు నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆ ఫ్ ఇండియా మహబూబాబాద్ జిల్లా కమి టీ అధ్యక్షులు కొత్తపల్లి రవి ఆరోపించారు. మైదం మహేశ్ మృతిపై తొర్రూరు మున్సిపల్ కార్యాలయం ము oదు కార్మికులతో నిరసన తెలిపారు. అనంతరం రవి మాట్లాడుతూ ములుగులోని మా ధవరావుపల్లెకు చెందిన మైదం మహేశ్ గతంలో గ్రామ పంచాయతీ కార్మికుడిగా కొ నసాగినప్పుడు మూడు నెలల వేతనం బకాయి ఉందని దాని చెల్లించమని అధికారు ల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా కనీసం పట్టించుకోలేదన్నారు. తన తోటి కార్మికులైన 10 9మందికి వేతనాలు అందించి మహేశ్‌కు అందని కారణంగా ఆ రోగ్యం బాగాలేక డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మనస్థాపానికి గురైనాడని ఆవేదన వ్య క్తం చేశారు. సంబంధిత అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కార్మికులపై చిన్న చూపు చూస్తున్న అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మైదం మహేశ్ కుటుంబానికి నష్టపరిహారం కోటి రూపాయలు అ ఒదించి, పిల్లలకు మెరుగైన విద్య అందించాలని, మృతుడు భార్యకు మున్సిపాలిటీలో ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అర్వపల్లి వెంకన్న, అధ్యక్షుడు మంగళపల్లి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయుడే

జిల్లా కలెక్టర్ అద్వేత్‌కుమార్ సింగ్




ప్రజాపక్షం/మహబూబాబాద్:దేశ భవిష్యత్‌కు దిక్సూచి ఉపాధ్యాయుడేనని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వేత్‌కుమార్ సింగ్, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి దక్షిణామూర్తి అన్నారు. మహబూబాబాద్ లో సమీకృత కలెక్టర్ సముదాయంలో ని మీటింగ్ హాల్లో ఘనంగా జరిగిన గురువారం ఘనంగా జరుపుకున్నారు, ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మన జిల్లా ఎస్ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానం సాధించినందుకు ఉపాధ్యాయులు అందరికీ అభినందనలు తెలిపినారు. ఈరోజు సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ ఒక పుస్తకం మనసును మార్చగలదు. కానీ ఒక ఉపాధ్యాయుడు జీవితాన్ని మార్చగలడు.అని మన దేశ భవిష్యత్తు విద్యార్థులపై ఆధారపడి ఉందని ,విద్యార్థులను ఆ భవిష్యత్తుకు సిద్ధం చేసే శక్తి, ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని ,అందుకే ఉపాధ్యాయుల వృత్తి అత్యంత పవిత్రమైనది, ఉపాధ్యాయుడు కేవలం పాఠాలు చెప్పేవాడు మాత్రమే కాదు, ఆయన ఒక మార్గదర్శకుడు, ప్రేరణ శక్తి,సమాజ నిర్మాత,ఒక విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి, ఉపాధ్యాయుల కృషి ఎప్పుడూ ఉంటుందని , అందుకే ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించి, సమాజంలో ముందుకు నడవాలి అని తెలిపినారు.ముఖ్య అతిథి గౌరవ ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు, మాట్లాడుతూ మన మొదటి గురువు మన తల్లిదండ్రులు తరువాత ఉపాధ్యాయులు.ఈ కార్యక్రమం లో శ్రీరాములు, అప్పారావు, సంతోష్, ఆజాద్, పూర్ణ చందర్, ఉమామహేశ్వర్, సతీష్, శ్రీనివాస్ మరియు వివిధ మండలాల ఎంఇఓ లు పాల్గొన్నారు.

## టీచర్లే భావి భారత నిర్మాతలు

కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ములుగు:మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సిద్దార్థరెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిధిగా ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, అదనపు కలెక్టర్ సంపత్‌రావు ప్రత్యేక అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు భావితరాల నిర్మాతలని, వారి చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్తు, సమాజ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని, మంచి సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంతమైన ములుగు జిల్లాలో అధిక సంఖ్యలో గిరిజన విద్యార్థులు చదువుతున్నారని, ఇక్కడ సేవలందిస్తున్న ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమని, విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని అన్నారు. అనంతరం ములుగు జిల్లాలో 33 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని అతిధుల చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిఈబి కార్యదర్శి ఈ సూర్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుళ్లపెల్లి సాంబయ్య, మండల విద్యాధికారులు, అవార్డు గ్రహీతలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, జిల్లా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పది

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



ప్రజాపక్షం/హనుమకొండ : బాలసముద్రంలోని మల్లికాంబ మనో వికాస కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ముందుగా డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీచర్స్ డే సందర్భంగా మానసిక దివ్యాంగా చిన్నారులు ఉపాధ్యాయుల వేషధారణలో అలరించారు. చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ఎంపి వారి ఆరోగ్యం, ఏం చదువుతున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలసి స్నేహపూర్వకంగా మెలిగిన ఎంపీ డాక్టర్ కావ్య సహజ సాన్నిహిత్యం పిల్లల్లో మరింత ఆనందాన్ని నింపింది.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని అన్నారు. ఒక ఉపాధ్యాయుడికి లభించే గౌరవం మరెవరికీ దక్కదు అని పేర్కొన్నారు. నేటి విద్యార్థులను రేపటి బావిభారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుల త్యాగం కృషి వల్లే సమాజంలో ప్రతిభావంతులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. మానసిక వికలాంగుల భద్రత కోసం ఐరిస్ కెమెరా టెక్నాలజీని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. మానసిక వికలాంగుల గుర్తింపు, భద్రత కోసం ఐరిస్ ఆధారిత బయోమెట్రిక్ సిస్టమ్ అమలుపై మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అమలుకు కృషి చేస్తానని తెలియజేశారు. పండగ ఏదైనా దివ్యంగా చిన్నారులతో కలసి జరుపుకోవడం తనకు ఎంతో సంతోషంగా ఉంటుందని ఎంపీ అన్నారు .ఈ సందర్భంగా దివ్యాంగుల సేవలో అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందిని ఎంపీ గారు చిరు సత్కారం చేసి ప్రోత్సహించారు. అదేవిధంగా మల్లికాంబ మనోవికాస కేంద్ర అభివృద్ధి కోసం తాను ఎల్లప్పుడూ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మ, ఫౌండర్ రామ లీల, ఈసీ మెంబర్లు సదానందం, కళ్యాణ్, ప్రముఖ ఇన్ఫ్లుయెన్సర్ లోకేష్, టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరం చేస్తే శిక్ష పడుతుందనే భయాన్ని కలిగించాలి: సిపి




ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : ఎదెనా నేరం చేస్తే కో ర్టులో శిక్ష పడుతుందనే భయాన్ని నేరస్తులకు కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ఈ ఏడాది జనవరి నెల నుండి ఆగస్టు మాసం వరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ న్యాయ స్థానాల్లో జరిగిన ట్రయల్స్ కేసుల్లో నిందితులకు శిక్షలు పడటంలో కృషి చేసిన పోలీస్‌అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల అభినందన సభను వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో శుక్రవారం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని నిందితులకు కోర్టులో శిక్షలు పడటంలో కృషి చేసిన జాయింట్ డిప్యూటీ డెరక్టర్, డిప్యూటీ డెరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, దర్యాప్తు అధికారులు, కో ర్టు,ప్రాసెస్ విధులు నిర్వహించే పోలీస్ అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనర్ చేతుల మీదుగా ఘనంగా సత్కరించి ప్రశంస పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ గత ంలో ఏన్నడూ లేని విధంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ నేరాలకు పాల్పడిన నేరస్తులకు కో ర్టులో శిక్షలు పడిన శాతం పెరిగిందని. ఇది ఏ ఒక్కరి వలన జరిగిందని కాదని.ఎవరికి వారు వారికి అప్పగించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం ద్వా రా ఇలాంటి మెరుగైన ఫలితాలను రావడం జరిగింద ని. కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది జరిగిన ట్రయల్ కేసుల్లో మొత్తం 16 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని,నిందితులకు శిక్షలు పడటం ద్వారా బాధితులకు న్యాయం జరగడంతో పాటు కోర్టు, పోలీసులపై ప్రజలకు నమ్మకం గౌరవం పెరుగుతుందని,ఇందుకోసం ఇన్స్‌స్పెక్టర్ స్థాయి పోలీస్ అధికారిని కోర్టు మానిటరింగ్ అధికారిగా నియమించడం జరిగిందని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.అదనపు డిసిపి రవి, వరంగల్ ప్రాసిక్యూషన్ ఆఫ్ జాయింట్ డి ప్యూటీ డెరక్టర్ రాములు, సంగారెడ్డి జిల్లా ప్రాసిక్యూష న్ డిప్యూటీ డెరక్టర్ ,సిసిఆర్‌బి ఏసిపి, పబ్లిక్ ప్రాసిక్యూ టర్లు,భ రోసా కేం ద్రం న్యాయధికారి, ఇన్స్‌స్పెక్టర్లు ,ఎ స్ఐ నర్సింహా రావుతో పాటు సిసిఆర్‌బి సిబ్బం ది,కో ర్టుహెడ్‌కానిస్టేబుళ్లు,కానిస్టేబుళ్లు,హోంగార్డ్సుపాల్గొన్నారు.

## ప్రతీ కాలనీలో రోడ్డు నిర్మాణాలు పూర్తి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని హామీ

ప్రజాపక్షం/కాజీపేట : శంకుస్థాపన చేసిన నిర్ణీత కాలవ్యవధిలోనే ప్రారంభోత్సవం కూడా చేసుకుంటూ అభివృద్ధిలో ము oదుకు వెళ్తున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కాజీపేట లోని అంబేద్కర్ కాలనీలో సుమారు 90 లక్షలతో 61,62,63 డివిజన్లకు సంబంధించిన అంతర్గత రోడ్డు నిర్మాణ పనులను ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూనగర ం లో ప్రధాన కాలనీలను అత్యవసర రోడ్ల ను నిర్మాణం చేపట్టుకొని చాలా కాలనీలను కూడా అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు.

## నగరంలో ప్రశాంతంగా గణేష్ నిమజ్జనోత్సవం



ప్రజాపక్షం/హనుమకొండ : నవరాత్రులు పూజలందుకున్న వినాయకులను భక్తజనం ఘనంగా సాగనంపారు. శుక్ర వారం వినాయక నిమజ్జనోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా కన్నులపండువగా జరుపుకున్నారు. అటు అధికార యంత్రాంగం, ఇటు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. ఆటపాటలతో, డప్పు చప్పుళ్లతో వినాయక ఊరేగింపులు, శోభాయాత్రలు మార్మోగాయి. వరంగల్ లోని చిన్నవడ్డెపల్లి, హనుమకొండలోని బంధం చెరువు, పద్మాక్షి గుండంలాంటి తదితర ప్రధాన ప్రాంతాలను పోలీస్ కమిషనర్ తోపాటు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు సందర్శించి నిమజ్జనాన్ని స్వయంగా పరిశీలించారు. శుక్రవారం ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనోత్సవానికి గణపతులను తరలించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుని మద్యాహ్నం నుండే తరలించారు. గణేష్ ప్రతిమలను స్వాగతించేందుకు వివిధ సంస్థల ఆధ్వ ర్యంలో కాజీపేట నిట్ సమీపంలో, హనుమకొండ చౌరస్తాలో, వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్లో ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేశారు. నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వివిధ శాఖలు, అధికారులు విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారదాదేవి, స్నేహశబరీష్, పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్, పాటు వివిధ విభాగాల అధికారులు పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమాల్లో అపశ్రుతులు, అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ, జీడబ్ల్యూఎంసీ అన్ని ఏర్పాట్లు చేపట్టి పర్యవేక్షించారు. నిమజ్జన కార్యక్రమం విజయవంతం చేసేందుకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్ పాయ్, మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారులతో కలిసి సందర్శించారు. గ్రేటర్ వరం గల్ పరిధిలోని 22 చెరువుల వద్ద అన్ని విభా గాలు కలుపుకుని 900 మంది సిబ్బంది, అధికా రులు కలిసి పని చేసినట్లు అధికారులు వెల్లడించారు. వినాయ విగ్రహాల నిమజ్జనానికి నగరపరిధిలో 22 చెరువులను నిమజ్జనం కోసం ఎంపిక చేశారు. హనుమకొండ లోకేషన్ పరిధిలో సిద్ధేశ్వరగుండం, కడిపికొండ చెరువు, బంధం చెరువు, సోమిడి చెరువు, కడిపికొండ చెరువు, ఎల్లా పూర్ చెరువు, హసన్ పర్తి చెరువు, భీమారం చెరువు, గోపాలపురం చెరువు, రాం పేట చెరువు, రాంపూర్ చెరువు, మడికొండ చెరువు, వంగపహాడ్ చెరువు, గుండ్ల సింగారం చెరువు, సింగారం చెరువు తో పాటు వరంగల్ పరిధిలో కోట చెరువు, చిన్నవడ్డెపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, అగర్తల చెరువు, బెస్తం చెరువు, ఉర్సు చెరువు, మామునూరు చెరువు, తిమ్మాపూర్ చెరువులను ఎంపిక చేసి నిమజ్జనం నిర్వహించారు.

**కమాండ్ కంట్రోల్ నుండి శోభాయాత్రను పరిశీలించిన సిపి:** గణేష్ నిమజ్జనం, శోభాయాత్రకు సంబంధించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను, నిమజ్జన ప్రాంతాలు, శోభాయా త్ర నిర్వహించే మార్గాలలో ప్రస్తుత స్థితిగతులపై వరంగ ల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతి సింగ్ శుక్రవారం పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ నుండి పర్యవేక్షించారు. నిమర్జనం. శోభాయాత్ర కై ఏర్పాటు చేసిన 583 సిసి కె మెరాలకు సంబంధించిన దృశ్యాలను కమాండ్ కంట్రోల్ ద్వారా పోలీసులు తిలకించారని సిపి పేర్కొన్నారు

# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## నిమజ్జన ఘాట్ల పరిశీలన



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ విగ్రహాల నిమర్జనం సజావుగా నిర్వహించాలని అడిషనల్ డిసిపి లాఅండ్ఆడర్ ప్రసాద్‌రావు సిబ్బందిని అదేశించారు. శుక్రవారం నగరం లోని ప్రకాశ్‌నగర్, కాల్వఒడ్డు, రూరల్ మండలం పెద్దతండాలోని మున్నేరు పరివాహకప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమర్జన ఘాట్లను ఆయన తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిమర్జన సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ముమ్మరం చేయాలన్నారు. విగ్రహాలతో పాటు వాహనం పై ఇద్దరుకి మించి ఎవరూ ఉండకుండా చూడాలని ఉన్నట్లు గమనిస్తే వారిని వెంటనే దింపి పంపించివేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## దంతాల సుధాకర్‌కు అవార్డు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం చెన్నూరు లోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దంతాల సుధాకర్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికై హైదరాబాద్‌లోని శిల్పకళ తోరణం లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రేవంత్‌రెడ్డి సుధాకర్‌కు ఉత్తమ అవార్డు ప్రశంసా పత్రం అందజేశారు. పలు ఉపాధ్యాయ సంఘాల వారు మాట్లాడుతూ బడిబాట ప్రచార కార్యక్రమం, నూతన విద్యార్థులను చేర్పించటం, కోవిడ్ సమయంలో పలు జాగ్రత్తలు, సూచనలు, ఉత్తమ విద్య బోధన విద్యార్థులకు పలు అంశాలు అవగాహనపై మండలంలో ఉమ్మడి రాష్ట్రాల జిల్లాలలో ద్విచక్ర వాహనంపై మై ప్రచారం చేస్తూ అవగాహన కార్యక్రమాలను చేయడంతో జిల్లా రాష్ట్రస్థాయి అవార్డులను అందుకోవటంతో పాటు పలువురు అధికారులు అభినందిస్తూ హర్షిస్తూ తోపాటు పిఆర్టియు, యుటిఎఫ్ లతో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల వారు, మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

## సర్వేపల్లి జీవితం నేటి తరానికి ఆదర్శం

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలని టిపిసిసి సభ్యులు నాగసీతారాములు, గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. సర్వేపల్లి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లాగ్రంధాల ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధ్యాపక వృత్తి నుండి మొదలైన ఆయన ప్రస్థానం భారత దేశ ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతిగా ఎదిగే వరకు సాగిందని, భారతదేశ రాజకీయాల్లో ఆయన చెరగని ముద్రవేసుకున్నారని, ఇలాంటి విద్యాకోవిదుని జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. విషయ పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, వాక్చాతుర్యం, అత్యుత్తమ బోధనా పరిణితి గల సర్వేపల్లి జీవితం నేటి తరానికి దిక్సూచి కావాలన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని శ్రద్ధతో చదువుకుని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని సూచించారు. ఎందరో విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దుతూ ఉద్యోగాలు సాధించుకోవడానికి కృషి చేసిన గ్రంధపాలకురాలు గుమ్మడి మణిమృదులను సన్మానించారు.

## నిమజ్జనం ప్రాంతం పరిశీలన



**ప్రజాపక్షం/వైరా:** వైరాలో వినాయక నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆ ప్రాంతాన్ని వైరా ఏసిపి రెహమాన్, సిఐ సాగర్, ఎస్సై రామారావు, మున్సిపల్ కమిషనర్ గురులింగం, శానిటేషన్ అధికారి వీరన్న పరిశీలించారు. విగ్రహాలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా పోలీసులు రూట్ మ్యాప్ ఏర్పాటు చేశారు. మున్సిపాల్ సిబ్బందితో పాటు వైద్య సిబ్బందిని గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ఏర్పాట్లను మున్సిపాల్ కమీషనర్ గురులింగం, ఎస్సై రామారావు పర్యవేక్షణ చేస్తున్నారు. వారు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా చూడాలని తెలిపారు.

## ‘భట్టి’ పిఎగా వెంకటసుబ్రమణ్యశాస్త్రి

**ప్రజాపక్షం/ బోనకల్ :** రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క పర్సనల్ అసిస్టెంట్ (పిఎ)గా బోనకల్ మండల పంచాయతీరాజ్ అధికారి వ్యాకరణం వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి నియమితులయ్యారు. గత నాలుగు సంవత్సరాలుగా ఎంపిఓగా విధులు నిర్వహించి పలువురు మన్ననలను పొందారు. గురువారం వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి డిప్యూటీ సిఎం క్యాంపు కార్యాలయంలో విధుల్లో చేరారు. ఎంపిడిఓ రవత్ రమాదేవికి ఎంపిఓగా అదనపు బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు.

## పేకాటస్థావరంపై దాడి..ముగ్గురు అరెస్టు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** దమ్మపేట మండలం చిన్నగొల్లగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న పక్కా సమాచారం అందుకున్న దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుండి 2610 రూపాయల నగదు, మూడు మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. మరో ఏడుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

## రహదారులకు మరమ్మతులేవీ?

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు మరమ్మత్తులు చేపట్టాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.పార్టీ జిల్లా నాయకులు కుటుంబరావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రహదారులు గ్రామీణ రహదారులు దెబ్బతిని గోతులుమయంగా మారాయని అన్నారు. ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురై దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రహదారిపై గుంతలు పూడ్చి వాహనదారుల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా తాటిపూడి నుంచి చిన్న మునగాల వెళ్లే రహదారి వైరా, మధిర జగ్గ,య్యపేట వెళ్లే ప్రధాన పూర్తిగా గోతులు పడి ధ్వంసం కావడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారన్నారు. సిపిఎం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలపై సర్వే

**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండల పరిధిలోని భువనపాలెం గ్రామంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సర్వే అనేక సమస్యలు వెలుగు చూశాయి. ఈ సందర్భంగా జరిగిన సభ గ్రామ శాఖ కార్యదర్శి దేవర నారాయణ అధ్యక్షతన జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్ రావు మాట్లాడుతూ వీధిలైట్లు వెలగక మూడు నెలలు అవుతుంది. కనీసం బ్లీచింగ్ చల్లే పరిస్థితి కూడా కనపడటం లేదని, ప్రజలు విషరాలతో ఇబ్బంది పడుతున్నారని, అక్కడ మురికి నీటితో వీధులు ఉన్నాయని గ్రామంలో, ఉపాధి హామీ పనులు చేయించుకొని, 200 మందికి గత నాలుగు నెలల నుండి పెండింగ్ కూలి ఇవ్వకుండా నిలుపుదల చేశారని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ ఉన్న కూలీలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు మాట్లాడారు. చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కారం చేయాలని, లేని పక్షంలో సోమవారం ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

# స్థానిక ‘పోరు’పై సర్వత్రా ఉత్కంఠ




### రిజర్వేషన్లపై ఊహాగానాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం సిటీ :** గ్రామాల్లో సర్పంచులు లేక గ్రామీణ వ్యవస్థ కుంటుపడుతుందని సెప్టెంబర్ 30వ తేదీలోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని హైకోర్టు హుకుం జారీ చేసిన విషయం విదితమే. హైకోర్టు ఆదేశాలు దగ్గరపడుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు పావులు కదుపుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా జిల్లా అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల జాబితాపై కసరత్తు మొదలుపెట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ లేదు. చిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను ఎదుర్కొని ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని చెబుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని కాంగ్రెస్ శ్రేణులు దీమాలో ఉండగా కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగడుతూ ఆరు గ్యారెంటీల అమలు చేయడం అటుంచి యూరియా కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని బిఆర్ఎస్ వర్గాలు దీమాతో ఉన్నాయి. కమ్యూనిస్టుల కంచుకోట అయిన ఖమ్మం జిల్లాలో సత్తా చాటేందుకు కమ్యూనిస్టులు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే సిపిఐ గ్రామ, మండల, జిల్లా మహాసభలను ఉత్తేజభరితంగా ముగించుకుని కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చింది. సిపిఎం జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి జరుగుతుందని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బిజెపి పార్టీని ఆదరిస్తారని బిజెపి శ్రేణులు దీమా వ్యక్తం చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి దీమా ఎలా ఉన్నా స్థానిక పోరుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

### పాత రిజర్వేషన్లు ఉంటాయా?

తెలంగాణ రాష్ట్రంలో రెండు కోట్ల పైచిలుకు ఉన్న బిసి లకు రాజ్యాంగ బద్ధంగా 29 శాతం ఉన్న రిజర్వేషన్లను 42 శాతం వరకు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీకి కేంద్ర ప్రభుత్వ తీరు తలనొప్పిగా మారింది. రాజ్యాంగబద్ధంగా బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధంగా లోక్‌సభలో రిజర్వేషన్ బిల్లును ఆమోదం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై సుముకంగా లేదని జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అర్థమవుతుంది. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో దిగాలని ఆశించే ఆశావాహులు రిజర్వేషన్లపై పలు రకాల ఊహాగానాలు చేస్తున్నారు. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాదని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. గత ప్రభుత్వం నిర్ణయించిన రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహిస్తే పాత రిజర్వేషన్ పద్ధతి అమలయ్యే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వంపై రోజు రోజుకు పెరుగుతున్న వ్యతిరేకత దృష్ట్యా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారనున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 20 మండలాల పరిధిలో 571 గ్రామ పంచాయతీలు , 5,214 వార్డులు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 8,02,691మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 3,88,244 మంది పురుషులు, 4,14,425 మంది మహిళలు, 22 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఎక్కువ ఓటర్లు కలిగిన మండలంగా కూసుమంచి మొదటి స్థానంలో ఉంది. మొత్తం 50,149 మంది ఓటర్లను కలిగి ఉంది. తక్కువ ఓటర్లు కలిగిన మండలంగా వైరా ఉంది. దీనిలో 27,306 మంది ఓటర్లు కలిగి ఉంది. జిల్లాలో మొత్తం ఓటర్లలో మహిళలు 4,14,425 మంది ఉన్నారు. పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 26,181 మంది అధికంగా ఉన్నారు.

## కార్మిక పక్షపాతి కొమరయ్య

### ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సారయ్య



**ప్రజాపక్షం/ఇల్లెందు:** కార్మిక పక్షపాతి, నిరంతరపోరాట యోధుడు, సింగరేణి పింఛన్ సాధకుడు, బొగ్గుగని కార్మిక ప్రియతమ నేత మనబోతుల కొమరయ్య అని ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ, బ్రాంచి కార్యదర్శులు కె.సారయ్య, ఎం.డి.నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మనుబోతుల కొమరయ్య 29వ వర్థంతిని ఘనంగా నిర్వహించి మాట్లాడారు. కొమరయ్య సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొన్నారని, నిరంతరం కార్మిక పక్షాన అనేక పోరాటాలు నిర్మించి హక్కులు సాధించిన ఘనుడని పేర్కొన్నారు. ఎఐటియుసి శాఖ ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, గడదాసు నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొరిమి సుందర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు - పొదెం



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:** కొత్తగూడెం నియోజకవర్గం ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం కొత్తగూడెం పట్టణంలో.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొదెం వీరయ్య అధ్యక్షతన,ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన నిర్ణయాలు కాంగ్రెస్ పార్టీ స్టాండ్ పై చర్చించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతీ మండలం, గ్రామం, పట్టణం స్థాయిలో పార్టీ బలోపేతం, సమన్వయ కర్తవ్యాలు, స్థానిక సమస్యలు ప్రజలతో అనుబంధం పెంపొందించుకోవడంపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఆయన మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గ జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణ కార్పొరేషన్, లో భాగంగా కలుపుకున్న సుజాతానగర్ మండల కేంద్రం, పాల్వంచ మండల కేంద్రం లో రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమని, ఈ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మిగులు మండలం, సుజాతానగర్ మండలం లో నాయకులు, కార్యకర్తలు వ్యక్తిగత అభిప్రాయాలు, వర్గ విభేదాలు పక్కన పెట్టి పూర్తి ఐకమత్యంతో పనిచేయాలని, అంతా కలిసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. పాల్వంచ, సుజాతానగర్ వంటి ప్రధాన కేంద్రాల్లో పార్టీ గెలుపు సాధిస్తే, అది కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ప్రభావాన్ని మరింత బలపరుస్తుందని, ప్రజల విశ్వాసం గెలుచుకునే అవకాశం మరింత పెరుగుతుందని తెలిపారు.టీపీసీసీ ప్రధాన కార్యదర్శిలు మోత్కూరి ధర్మారావు, నాగ సీతారాములు,టిపిసిసిసభ్యులు బాలశౌరి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు పోరాడిన ధన్యజీవి కొమరయ్య







**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసి, అనేక హక్కులు సాధించిపెట్టిన మహా గొప్ప కార్మిక నేత కామ్రేడ్ మనుబోతుల కొమరయ్య అని, వారి ఆశయ సాధనకు ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మణుగూరు సిపిఐ కార్యాలయంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)నాయకులు మనుబోతుల కొమరయ్య 29వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా కొమరయ్య చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడి పూలమాల వేశారు. జిల్లా మండల , పట్టణ, నాయకులు ఘనంగా నివాళులర్పించారు.సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అధ్యక్షత జరిగిన సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ సింగరేణి సంస్థలో కార్మికుల పక్షాన నిలబడి, వారి హక్కుల కోసం అనేక పోరాటాలు కొనసాగించారన్నారు, సింగరేణిని ఇంటి పేరుగా మార్చుకున్న గొప్ప వ్యక్తి యూనియన్ కొమరయ్య అని, వారు నిరంతరం కార్మికుల కోసం పనిచేసి నీతి, నిజాయితీగా కొనసాగారని, కార్మికుల పక్షపాతి, కొమరయ్య అని, వారు చేసిన సేవలను స్పూర్తి గా తీసుకొని ముందుగా సాగాలని వారు పిలుపునిచ్చారు. మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, జిల్లా సమితి సభ్యులు జంగం మోహన్ రావు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ లక్ష్మి నారాయణ మాట్లాడారు.సిపిఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, మాజీ ఎంపీపీ ఎడారిరమేష్,ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు రాయల భిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆఫీసు బెటర్ ఆవుల నాగరాజు లు పాల్గొని మాట్లాడారు.సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, తోట రమేష్, చింతల దశరథం, కొత్తపల్లి సీతారాములు, పిండిగ రఘువరన్, సమ్మక్క, నిర్మల, పులిగల్ల రమేష్, సుజాత, ప్రమీల, పాయం లక్ష్మి , అదెర్ల రాములు, పాయం శీను, కన్నెబోయిన ప్రసాద్, శ్రీకాకుళం వీరమల్లు, బోసెట్టి సంపత్, బాడిస సతీష్, దోమెట్టి ఏడుకొండలు, నరసింహారావు, నరసింహారావు, వలీ, యనమల సుధాకర్, లింగస్వామి, రంజిత్ పాల్గొన్నారు.

**సత్తుపల్లి:** సింగరేణి కార్మిక హక్కుల సాధన కోసం పోరాడిన ధన్యజీవి కామ్రేడ్ కొమరయ్య అని కొనియాడారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్. శుక్రవారం కొమరయ్య 29వ వర్ధంతి వేడుకలు సత్తుపల్లి జేవిఆర్ఓసిలో నిర్వహించారు. ముందుగా కొమరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ, యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సముద్రాల సుధాకర్ మాట్లాడారు. జేవిఆర్ ఓసి ఫిట్ సెక్రెటరీ జి నరసింహారావు, కోశాధికారి నరసింహారావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ ఉపేంద్ర చారి, ఐఎన్‌టియూసి నాయకులు, హెచ్ఎంఎస్ నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పాలకుర్తి వీరయ్య, రాజశేఖర్, ఎఐటియుసి నాయకులు భరణి, కిషోర్, కార్యదర్శి జాడి రవి, కంచ శ్రీనివాస్, డి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## రెజొనెన్స్‌లో ఘనంగా గురుపూజోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం విద్యావిభాగం :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో ప్రముఖ తత్వవేత్త, భారతదేశ ద్వితీయ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా టీచర్స్ డేని శుక్రవారం కన్నుల పండుగగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆది కాలం నుండి ఆధునిక కాలం వరకు ఉపాధ్యాయుల పట్ల గౌరవం పెరుగుతూనే ఉందని వారు తెలిపారు. గురుతర బాధ్యతగా ప్రతి ఉపాధ్యాయుడు తమ బాధ్యతను నిస్వార్థంగా నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి తమ జీవితానికి మార్గదర్శకుడైన తమ గురువుని మరువ రాదని గురువు పట్ల భక్తిశ్రద్ధలతో మెలగాలని ఆయన విద్యార్థులకు సందేశమిచ్చారు. సాంస్కృతి, సంప్రదాయాల్లో గురువుకు అత్యంత స్థానం ఉందని వారు పేర్కొన్నారు. టీచర్స్‌డే సందర్భంగా రెజొనెన్స్ స్కూల్ యాజమాన్యం ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పివిఆర్ మురళిమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### న్యూవిజన్‌లో :

ఖమ్మం నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో భారత ఉపరాష్ట్రపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవ సందర్భంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎండి అబాద్‌అలీ తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి బి. ధర్మేష్‌రెడ్డి తనకు విద్యను బోధించిన ఉపాధ్యాయులను శాలువ, మెమోంటోలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూవిజన్ విద్యా సంస్థల ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## కలిసికట్టుగా గిరిజన విద్యాభివృద్ధికి పాటుపడదాం




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, మట్టిలోని మాణిక్యాలైన గిరిజన విద్యార్థినీ విద్యార్థులను వెలికిసి తీర్చిదిద్దుతూ వారి భవిష్యత్ బాటలు వేస్తున్న మీరు ధన్యులని, అంతా కలిసికట్టుగా గిరిజన విద్యాభివృద్ధికి మరింత కృషి చేద్దామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గిరిజన భవన్‌లో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో పిఓ ముఖ్యాతిథిగా హాజరైన మాట్లాడారు. ముందుగాజ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల విద్యకు సంబంధించిన అంశాలను కవిత రూపంలో తెలిజేశారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, మా కుటుంబంలో అంతా ఉపాధ్యాయులు, అధ్యాపకులే అని, సహధర్మచారిణి కూడా ఉపాధ్యాయురాలే అన్నారు. తాను ట్రైనింగ్ చేసే సమయంలో విద్యావైద్యంపై పరిశీలన చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్‌గా ఉన్న సమయంలో పలుచోట్ల విద్యాప్రగితికి సంబంధించిన ప్రయోగాలు చేశామన్నారు. ఐటిడిఏ పిఓగా పనిచేస్తే అనేక అంశాలు తెలుసుకునే అవకాశం ఉందని అన్నారు. గిరిజనసంక్షేమశాఖ అశ్రమ పాఠశాలలు, గురుకులాలు, జిపిఎస్‌లలో, కళాశాలల్లో సుమారు35 వేల మంది చదువుతున్నారని, అందరి సహకారంతో గిరిజన విద్యావికాసానికి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పిల్లలు సులభరీతిలో చదువులు సాగించేందుకు ఉద్దీపకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. తద్వారా సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. బిఇడి,డిఇడి కాలేజీలో నూరుశాతం ఫలితాలు రాబట్టిన లెక్చరర్లకు మెమోంటోలు అందించి శాలువాలతో సత్కరించారు. డిడి మణెమ్మ, ఏసిఎంఓ రాములు, ఏటిడిఓలు అశోక్, చంద్రమోహన్, జిసిడిఓ అలివేలు మంగతాయారు తదిరులు పాల్గొన్నారు.

## 10న కిసాన్ మోర్చా సదస్సు

### రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్

**ప్రజాపక్షం/కొణిజర్ల :** కేంద్రంలో బిజేపి ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ఈనెల 10 వ తారీకున ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జిల్లా సంయుక్త మోర్చా ఎస్‌కెఎం సదస్సును పెద్ద ఎత్తున రైతులు ఈసదస్సులో జయప్రదం చేయాలని తెలంగాణ తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఎస్‌కెఎం జిల్లా నాయకులు దొండపాటి రమేష్, జిల్లా రైతుసంఘం సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక దొండపాటి భవన్‌లో తండు సోమయ్య అధ్యక్షతన జరిగిన రైతుసంఘం సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పత్తి దిగుమతులు సుంకం 11 శాతం కొనసాగించాలి జిల్లా ఖరీఫ్ పంటలకు సంపూర్ణంగా యూరియాను రైతులకు అందించాలి వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ప్రభుత్వం నుంచి తక్షణమే ఇవ్వాలలి. ప్రభుత్వ మార్కెఫెడ్ ద్వారా వర్షానికి బూజువచ్చిన పెసర ధాన్యాన్ని కొనుగోలు చేయాలి పంటల భీమా పథకం ఏర్పాటు చేసి అమలు చేయాలని ఖమ్మంలో ఈనెల 10 తేదీ ఉదయం 10 గంటలకు రామనర్సయ్య కేంద్రంలో జరిగే జిల్లా ఎస్‌కెఎమ్ సదస్సులో పాల్గొని పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని వారు తెలిపారు. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు డేరంగుల లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి తండు సోమయ్య, తోటపల్లి సీతారాములు, కొమ్మినేని వెంకయ్య, బండారు వెంకటేశ్వర్లు, అడపా శంకర్‌రావు, రామారావు, వెంకటేశ్వర్లు, గుడ్డుగొర్ల గిరి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఘనంగా సన్మానించారు. శుక్రవారం అన్నపురెడ్డిపల్లి సెక్టార్‌లో ఉన్నటువంటి తాటి బుచ్చన్నగూడెం అంగన్వాడీ టీచర్లు హెల్పర్స్ అసోసియన్ ద్వారా అంగన్వాడీ టీచర్ డీ రమాదేవి, ఏ విజయ, పర్స కుమారి, హెల్పేర్‌లు చిటమ్మ అనగాని, రాజమ్మలను ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ సన్మానం చేశారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసి 50 ఏళ్ళు కావస్తున్న నేపథ్యంలో పుట్టిన బిడ్డ మొదటి అడుగు అంగన్వాడీ సెంటర్‌లో అడుగు పెట్టి బాల్యంలో తొలి టీచర్‌గా అంగన్వాడీ టీచర్స్ వారికి విద్యను అభ్యసించడంలో సేవలు అమోఘమని కొనియాడారు. యూనియన్ నాయకులు భారతి, శివలక్ష్మి , పుష్ప, నర్సమ్మ, అరుణ, వెంకటలక్ష్మి , కుమారి, కృష్ణవేణి. కుమారి, సుధ, తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 'కే-ర్యాంప్' పోస్టర్ విడుదల



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కే ర్యాంప్'. ఈ సినిమాను హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్ల మీద నిర్మాత రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. 'కే ర్యాంప్' సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న థియేటర్ లో విడుదల కానుంది. 'ఓనమ్' పండుగ సందర్భంగా 'కే ర్యాంప్' సినిమా నుంచి విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కేరళ నేపథ్యంగా జరిగే కథను 'కే ర్యాంప్' మూవీలో సరికొత్తగా చూపించబోతున్నారు. ఓనమ్ పండుగ సెలబ్రేషన్స్ తో సాగే పాటను కూడా ఈ మూవీలో ప్రత్యేకంగా చిత్రీకరించారు. ఈ నెల 9న ఈ సినిమా నుంచి మ్యాజికల్ లవ్ మెలోడీ సాంగ్ 'కలలే కలలే' విడుదల చేయబోతున్నారు. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.


## వారికి రుణపడి ఉంటా..

### మీడియా 'చిట్ చాట్'లో మంచు మనోజ్



హీరో తేజ సజ్జా నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. ఈ చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించారు. రాకింగ్ స్టార్ మనోజ్ మంచు పవర్ ఫుల్ పాత్ర పోషించారు. సెప్టెంబర్ 12న ఈ సినిమా రిలీజ్ కాబోతుంది. ఈ సందర్భంగా మనోజ్ మంచు మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నాకు కార్తిక్ ఎప్పటి నుంచో తెలుసు. అలాగే తేజ చిన్నప్పటి నుంచి తెలుసు. తను ఒక ఈవెంట్ కలిసినప్పుడు 'మంచి స్క్రిప్ట్ వుంటే కలిసి సినిమా చేద్దాం తమ్ముడు'అని చెప్పాను. 'నిజమా అన్నా' అన్నాడు. ఓ రోజు మా గేమింగ్ స్టూడియోలో వున్నప్పుడు తేజ వచ్చి మిరాయ్ గురించి చెప్పాడు. కథ, మా ఇద్దరి పాత్రల గురించి ఇప్పుడే ఎక్కువ రివిల్ చేయకూడదు. కార్తిక్ చెప్పిన కథ చాలా నచ్చింది. శ్రీరాముల వారి నేపథ్యం, తొమ్మిది పుస్తకాల బ్యాక్ డ్రాప్, ఇతిహాసల కోణం చాలా అద్భుతంగా వుంటుంది. ఇందులో నా క్యారెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా వుంటుంది. లేజీగా వుండే వాడు బ్రతకకూడదనే క్యారెక్టర్. కార్తిక్ చాలా అద్భుతంగా డిజైన్ చేశారు. చాలా స్పెషల్ కేర్ తీసుకున్నాం. దాదాపు ఈ సినిమా మూడేళ్ళు పెట్టాం. డైరెక్టర్ ప్రతి విషయంలో చాలా డిటెయిల్‌గా వున్నారు. ప్రతి డీటెయిల్ ని ఆయన మోనిటర్ చేసుకుంటారు. ఈ విషయంలో మొత్తం క్రెడిట్ డైరెక్టర్‌కె ఇవ్వాలి.రజినీకాంత్ గారిని కూలికి ముందు కలిశాను. మిరాయ్ ట్రైలర్ చూపించాను. ఆయనకు చాలా నచ్చింది. ఇలాగే కంటిన్యూ చెయ్, గ్యాప్ లేకుండా సినిమాలు చేయమని చెప్పారు. చాలా ఎంకరేజ్ చేశారు. మంచి ఎనర్జీ ఇచ్చారు. మిరాయ్ యాక్షన్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. అలాగే నాకు చిన్నప్పటి నుంచి మార్షల్ ఆర్ట్స్ అలవాటు. హైదరాబాదులో జాక్సన్ మాస్టర్ దగ్గర ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. దాదాపు 8 నెలల ప్రాక్టీస్ చేశాను. మిరాయ్ నా కంబ్యాక్ ఫిల్మ్ అవుతుంది.తేజ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాడు. యాక్షన్ ఇంటెన్స్‌గా ప్రాక్టీస్ చేశాడు. సినిమా చూస్తున్నప్పుడు తన హార్డ్ వర్క్ మీకు కనిపిస్తుంది. కార్తీక్ గ్రేట్ టెక్నీషియన్. ఇదే కంటెంట్‌ని మరో డైరెక్టర్ చేస్తే మాత్రం ఈ బడ్జెట్ లో అవ్వదు. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ సినిమాని తీశారు. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను.ఈ సినిమా దాదాపుగా అన్ని లైవ్ లొకేషన్‌లోనే షూట్ చేశాం. రియల్ లొకేషన్స్‌లో గ్రాఫిక్స్‌ని వాడి సినిమా ఎక్స్పీరియన్స్‌ని మరింతగా అన్హాన్స్ చేశాం. ఇందులో యాక్షన్స్ అంతా లైవ్‌గా వుంటుందినా లైఫ్‌లో హైయస్ట్ రెస్పాన్స్ వచ్చిన ట్రైలర్ ఇది. ఇనిషియల్ డేస్‌లో మిస్టర్ నూకయ్య, నేను మీకు తెలుసా సినిమాలకు కూడా చాలా అద్భుతమైన స్పందన వచ్చింది. అయితే ఈ స్కేల్లో సినిమా రావడం, ప్రపంచంలో నలుమూలల నుంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్నిచ్చింది. ఇంత అద్భుతమైన క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ గారికి రుణపడి ఉంటాను. కొత్త సినిమాల విషయానికొస్తే డేవిడ్ రెడ్డి, రక్షక్ సినిమాలో జరుగుతున్నాయి. ఈ రెండు కూడా హై ఇంటర్సిటీ యాక్షన్ ఉన్న సినిమాలు. అలాగే ఒక మంచి ఎంటర్టైన్మెంట్ ఉన్న స్క్రిప్ట్ కోసం కూడా చూస్తున్నాను. ప్రస్తుతం డేవిడ్ రెడ్డి వర్క్ షాప్స్ జరుగుతున్నాయి. తమిళ్ నుంచి కూడా కొన్ని కథలు వస్తున్నాయి. ఒక నటుడిగా అన్ని భాషల్లో సినిమాలు చేయాలని ఉంటుంది. అహం బ్రహ్మాస్మి సినిమా కూడా సమయం వచ్చినప్పుడు వస్తుంది. అలాగే వాట్ ద ఫిష్ సినిమా కూడా చేయాలి. చాలా డార్క్ కామెడీ ఉన్న సినిమా అది. ఆ సినిమాని ఫారిన్ లొకేషన్స్‌లో వింటర్ సమ్మర్ రెండు సీజన్స్‌లో తీయాలి. నేను మీకు తెలుసా టీంతో ఒక సినిమా చేయాలని ఆలోచన ఉంది. త్వరలో ప్రకటిస్తాం.

## పప్పీ షేమ్ పాట 8న రిలీజ్



రామ్ పోతినేని హీరోగా నటిస్తున్న యానిక్ ఎంటర్‌టైనర్ ఆంధ్రా కింగ్ తాలూకా. మహేష్ బాబు పి దర్శకత్వంలో, ప్రముఖ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 28న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. అద్భుతమైన టైటిల్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ విడుదలైనప్పటి నుంచి ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. రామ్ పోతినేని స్వయంగా రాసిన, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ పాడిన ఫస్ట్ సింగిల్ వైరల్ అయ్యింది. ప్రస్తుతం మ్యూజిక్ చార్ట్‌లలో అగ్రస్థానంలో ఉంది. ఇప్పుడు సెకండ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు. వివేక్, మెర్విన్ సంగీతం అందించిన ఫన్నీ నంబర్ పప్పీ షేమ్ ఈనెల 8న విడుదల కానుంది. పోస్టర్‌లో రామ్ ఎనర్జిటిక్‌గా కనిపించారు.

## ఈ నెల 19న 'వీర చంద్రహాస' విడుదల



కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం 'వీర చంద్రహాస'. గతంలో శివరాజ్ కుమార్ నటించిన 'వేద', ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస' చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన తాజాగా 'వీర చంద్రహాస' తెలుగు హక్కులను దక్కించుకున్నారు. 19న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. హోంబలే ఫిలిమ్స్ సమర్పణలో విడుదల చేస్తున్న వీర చంద్రహాస చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి.

## 'కె.పి.హెచ్.బి. కాలనీలో' షూటింగ్ షురూ



భీమవరం టాకీస్ బ్యానర్ పై తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మాతగా తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'కె.పి.హెచ్.బి. కాలనీలో'. షూటింగ్ ప్రారంభమైంది. ఖైరతాబాద్ గణేషుని సమక్షంలో పోలీస్ అధికారులు క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ మాట్లాడుతూ అంతర్లీనంగా ఒక సందేశాన్ని ఇస్తూ చాలా రిచ్‌గా ఈ సినిమా తీస్తున్నాం. ఆ గణపతి దేవుడు దగ్గర పూజ అనంతరం మా సినిమాల రెగ్యులర్ షూటింగ్స్ మొదలవుతున్నాయి అన్నారు.

## అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్'

శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిసి చేస్తున్న న్యూ థ్రిల్లర్ 'ది గేమ్: యూ నెవర్ ప్లే అలోన్' అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. బ్లాక్ వారంట్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజేష్ ఎం.సెల్వా డైరెక్ట్ చేస్తున్నారు. లీడ్ రోల్‌లో శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా, సంతోష్ ప్రతాప్, చందినీ, శ్యామ హరిని, బాల హసన్, సుబాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్, హెమా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్‌తో పాటు టైమ్‌లి థీమ్స్‌ని మిక్స్ చేస్తూ ఆడియన్స్‌కి డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది. ఈ సందర్భంగా నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. ది గేమ్ మా ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కోఆర్డినేటెడ్ అటాక్ వెనక వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని ఈ థ్రిల్లర్‌గా ప్రజెంట్ చేస్తునాం. అప్లాజ్‌తో మా కలయికలో ఇప్పటికే బ్లాక్ వారంట్ వచ్చింది. ఇప్పుడు ఈ సిరీస్ కూడా చాలా రెలివెంట్‌గా ఉంటుందని అన్నారు.



## 'ట్రాన్: ఏరీస్' పోస్టర్ విడుదల




ప్రపంచవ్యాప్తంగా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రాన్: ఏరీస్ చిత్రానికి సంబంధించిన కొత్త పోస్టర్, ట్రైలర్‌ను డిస్నీ విడుదల చేసింది. సైన్స్ ఫిక్షన్‌లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ట్రాన్ (1982), దాని సీక్వెల్ ట్రాన్: లెగసీ (2010) తర్వాత వస్తున్న మూడవ చాప్టర్ ఇది. ఈ చిత్రం భారతదేశంలో అక్టోబర్ 10న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. డిజిటల్ ప్రపంచం నుండి రియల్ ప్రపంచంలోకి అడుగుపెట్టే అధునాతన ప్రోగ్రామ్ ఏరీస్ ఒక ప్రమాదకరమైన మిషన్‌లో నడిచే కథ ఇది. ఇదే మానవజాతి మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) జీవుల మధ్య మొదటి భేటీగా నిలుస్తుంది. జెఫ్ బ్రిడ్జెస్ మళ్లీ తన పాత్రలో కనిపించడం ఫ్రాంచైజ్ అభిమానులకు పెద్ద ఆకర్షణ. జారెడ్ లేటో ప్రధాన పాత్రలో నటించగా, గ్రెటా లీ, ఎవాన్ పీటర్స్, హసన్ మినహాజ్, జోడీ టర్నర్‌స్మిత్, గిల్లియన్ ఆండర్సన్ వంటి అంతర్జాతీయ తారాగణం కనిపించనున్నారు.

## హై అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. నగరంలో భారీగా భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయడానికి బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదన్నారు. నగరంలో అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ముంబయి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదే విధంగా ఇటీవల పాట్నాలోని సివిల్ కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు బిహార్‌లోకి చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో బిహార్ పోలీసు హెడ్ క్వార్టర్స్ రాష్ట్రవ్యాప్తంగా హై అలర్ట్ జారీ చేసింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను విడుదల చేసింది. వీరు నేపాల్ మీదుగా బిహార్ చేరుకున్నట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు.

## రైలు ప్రయాణికుల రద్దీపై శాస్త్రీయ అధ్యయనం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాబోయే పండుగ సీజన్‌లో సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని క్రమబద్ధీకరించేందుకు దక్షిణ మధ్య రైల్వే శాస్త్రీయ అధ్యయనం మొదలు పెట్టింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పండుగ రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్య రైల్వే సమగ్ర ప్రణాళికను రూపొందించింది. గడచిన సంవత్సరాల మాదిరిగానే, జంట నగర ప్రాంతంలోని వివిధ స్టేషన్ల నుండి ప్రసిద్ధ గమ్యస్థానాలకు అదనపు రైలు సర్వీసులు నడిపిస్తారు.సికింద్రాబాద్‌లోని ప్రధాన పునరాభివృద్ధి పనుల దృష్ట్యా, టెర్మినల్ భవనాల ప్రధాన భాగాలు, ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనిచేయవు. సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణీకుల రద్దీని తగ్గించడానికి, రద్దీని నియంత్రించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక సమగ్ర ప్రణాళికను ప్రారంభించింది. సికింద్రాబాద్ స్టేషన్‌లో సాధారణ రోజుల్లో రోజుకు 1.3లక్షల మంది ప్రయాణికులు పండుగ కాలంలో రోజుకు 2 లక్షలకు పైగా ప్రయాణికులు వస్తుంటారు . సికింద్రాబాద్ స్టేషన్ రాకుండా కొన్ని రైళ్ల మళ్లింపు దక్షిణ మధ్య రైల్వే రద్దీ సమయాల్లో కొన్ని రైళ్లను సనత్‌నగర్అమ్ముగూడమౌలా అలీచర్లపల్లి మీదుగా మళ్లించడం, చర్లపల్లి శాటిలైట్ స్టేషన్లకు మళ్లించారు.

## దూరమయ్యాం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేశారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య నెలకొన్న సాన్నిహిత్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించిన నేపథ్యంలో ఆయన స్పందించారు. 'మనం భారతదేశం, రష్యాలను గాఢమైన, అంధకారమైన చైనాకు కోల్పోయినట్లు కనిపిస్తోంది. వారికి సుదీర్ఘమైన, శ్రేయస్కరమైన భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నాను!'' అని ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. భారత్ వస్తువులపై ట్రంప్ సుంకాలు 50 శాతానికి పెంచడంతో, అందులో రష్యా నుంచి ముడి చమురు కొనుగోలుకు 25 శాతం అదనపు సుంకం విధించడంతో న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య సంబంధాలు క్షీణించాయి. అదనపు సుంకం ఇప్పటికే ఆగస్టు 27 నుంచి అమల్లోకి వచ్చింది. బీజింగ్‌లో బుధవారం జరిగిన విజయోత్సవ పరేడ్‌కు చైనా అనేక మంది ప్రపంచ నేతలకు ఇవ్వగా, పుతిన్, ఉత్తర కొరియా కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి అమెరికాకు వ్యతిరేకంగా చైనా అధ్యక్షుడు కుట్ర పన్నుతున్నారని ట్రంప్ ఆరోపించారు. 'అధ్యక్షుడు షీ, చైనాలోని అద్భుతమైన ప్రజలు గొప్ప, శాశ్వతమైన వేడుకను జరుపుకోవాలని కోరుకుంటున్నాను' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాశారు.'అమెరికాకు వ్యతిరేకంగా మీరు కుట్ర పన్నుతున్నప్పుడు, వ్లాదిమిర్ పుతిన్, కిమ్ జోంగ్ ఉన్‌లకు నా సాదర శుభాకాంక్షలు తెలియజేయండి.' అని పేర్కొన్నారు.

## సర్వం సన్నద్ధం



(మొదటి పేజీ తరువాయి)

చేశారు. హైడ్రా, పర్యాటకశాఖ సమన్వయంతో హుస్సేన్‌సాగర్‌లో 9 బోట్లను, డిఆర్‌ఎఫ్ టీంలను, 200 గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. పోలీసు సహకారంతో 13 కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేశారు. 303.3 కిలోమీటర్ల మేర ప్రధాన ఊరేగింపు మార్గంలో గణేష్ విగ్రహాల నిమజ్జన శోభాయత్ర సజావుగా జరిగేందుకు 160 గణేష్ యాక్షన్ టీంలను జిహెచ్ఎంసి మోహరించింది. ఇప్పటికే ఈ మార్గంలో జిహెచ్ఎంసి రోడ్ల మరమ్మతులు పూర్తి చేసింది.

### స్వచ్ఛతకు పెద్దపీట..

నిమజ్జన కార్యక్రమంలో స్వచ్ఛతకు పెద్దపీట వేసేలా 15 వేల మంది శానిటేషన్ వర్కర్స్‌ను మూడు షిఫ్టులలో పని చేస్తున్నారు. వినాయక చవితి ప్రారంభం ఇప్పటి వరకూ 125 జెసిబిలు, 102 మినీ టిప్పర్‌లు ఉపయోగించి 10,500 మెట్రిక్ టన్నులకు పైగా అధిక వ్యర్థాలను సేకరించి జవహర్‌నగర్లోని ప్రాసెసింగ్ సెంటర్‌కు తరలించారు. గణేష్ ప్రతిమల నిమజ్జనం జరిగే ప్రదేశాలలో 39 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలతో పాటు ఊరేగింపు జరిగే మార్గంలో మొత్తం 56,187 టెంపరరీ లైటింగ్‌ను జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసింది. నిమజ్జనం పూర్తి అయ్యే వరకూ నూరు శాతం లైట్‌లు పని చేసేలా అధికారులు మానిటర్ చేస్తున్నారు. నిమజ్జన పాయింట్‌లలో మూడు షిఫ్టులలో పని చేసేలా అంబులెన్స్‌లతో సహా 7 మెడికల్ క్యాంపులను సిద్ధంగా ఉంచారు.

### ప్రధాన శోభాయాత్ర మార్గాలు ఇవే

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా నగరం నలుమూలల నుంచి విగ్రహాలు హుస్సేన్ సాగర్, ఎన్టీఆర్ మార్గ్ వైపు తరలిరానున్నాయి. ఇందులో అత్యంత ప్రధానమైన బాలాపూర్ గణేశుడి శోభాయాత్ర బాలాపూర్ నుంచి ప్రారంభమై చాంద్రాయణగుట్ట, చార్మినార్, అబిడ్స్, లిబర్టీ మీదుగా ట్యాంక్‌బండ వైపు సాగుతుంది. అదేవిధంగా, సికింద్రాబాద్ ప్రాంతం నుంచి వచ్చే విగ్రహాలు ప్యాట్నీ, పారడైజ్, రాణిగంజ్, కర్బలామైదాన్ మీదుగా ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటాయి. టోలిచౌకీ, మెహిదీపట్నం, లక్డీకాపూల్ ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలు ఖైరతాబాద్ మీదుగా నెక్లెస్ రోడ్ వైపు వెళ్తాయి. టప్పాచబుత్ర, ఆసిఫ్‌నగర్ నుంచి వచ్చే విగ్రహాలను ఎంజే మార్కెట్ వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ప్రధాన మార్గాలన్నింటిలో సాధారణ వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేయనున్నారు. భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాదేశాలను ఏర్పాటు చేశారు. అడుగడుగునా సిసిటివి కెమెరాలతో పాటు షీటీమ్స్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు.



## హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక

### సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీక అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని శనివారం రేవంత్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 ఏండ్లు పూర్తి చేసుకుందన్నారు. దేశంలోనే గణేశ్ ఉత్సవాలంటే ఖైరతాబాద్ గణపతి అని చర్చించుకునేలా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందిచారు. దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ నగరంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వలేదన్నారు. కానీ మన రాష్ట్రంలో గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందించింది భక్తితో ఉత్సవాలు నిర్వహించుకునే అవకాశం కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ అధికారులను సమన్వయం చేస్తూ పరిష్కరించుకుంటూ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా చూశామని తెలిపారు. నిమజ్జనాలకు ఇబ్బంది కలగకుండా ట్యాంక్ బండ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎన్నికలు బ్యాలెట్‌తోనే..

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గ నిర్ణయాన్ని న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి హెచ్‌కె పాటిల్ వివరిస్తూ ఇవిఎంల పట్ల ప్రజలలో విశ్వాసం, విశ్వసనీయత క్షీణించడమే ఈ నిర్ణయానికి కారణమని పేర్కొన్నారు. ఎన్నికల జాబితాలోని వ్యత్యాసాలు, 'ఓటు దొంగతనం' ఆరోపణలను పేర్కొంటూ, స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయడానికి, సవరించడానికి, అవసరమైతే తిరిగి చేయడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు అధికారం ఇవ్వాలని కూడా మంత్రివర్గం నిర్ణయించిందన్నారు. అయితే మంత్రివర్గ నిర్ణయంపై బిజెపి తీవ్ర విమర్శలు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నికైన 136 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, రాష్ట్రం నుండి తొమ్మిది మంది కాంగ్రెస్ ఎంపిలు ముందుగా రాజీనామా చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బి వై విజయేంద్ర డిమాండ్ చేశారు. 'వారు బ్యాలెట్ పేపర్ ఉపయోగించి మళ్ళీ ఎన్నికల్లో గెలవాలని లేదా వారు ఓటు దొంగతనం ద్వారా అధికారంలోకి వచ్చినట్లు అంగీకరించాలన్నారు. దీనిపై ఉప ముఖ్యమంత్రి డి కె శివకుమార్ స్పందిస్తూ బిజెపి ఎందుకు ఆందోళన చెందుతోందని ప్రశ్నించారు. బిజెపి వ్యతిరేకతను 'దొంగల మనసు గందరగోళం' అంటూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఏమి జరిగిందో తాము పరిశోధించామని, ఇప్పుడు దాని గురించి చర్చించాలనుకోవడం లేదన్నారు. బ్యాలెట్ పేపర్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించినదని పేర్కొంటూ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంటుందని ఆయన అన్నారు. బెంగళూరులోని ఐదు కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికల్లోనూ బ్యాలెట్ పేపర్ ఉపయోగిస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, శివకుమార్ సమాధానమిస్తూ ప్రభుత్వ నిర్ణయం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించినదని చెప్పారు. హర్యానా, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి పాలైన తర్వాత, కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలపై సందేహాలు వ్యక్తం చేసింది. పేపర్ బ్యాలెట్‌కు తిరిగి రావాలని డిమాండ్ చేస్తోంది.

## రాష్ట్రం వేగంగా పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. విద్యపై పెట్టుబడి రాష్ట్ర నిర్మాణానికి ఉపయోగ పడుతుందని ప్రజా ప్రభుత్వం సంపూర్ణంగా భావిస్తుందన్నారు. రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను పూర్తి గా ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నామని పునరుద్ఘాటించారు. విద్యార్థులు కళాశాల బయటికి వెళ్ళగానే ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి, అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న చాకలి ఐలమ్మ పేరుతో మహిళా యూనివర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ 500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఐఎస్‌బి నిర్వాహకులు స్కిల్ యూనివర్సిటీని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను సందర్శించి వాటికి అవసరమైన సలహాలను, సూచనలను ఇవ్వాలని కోరారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో తమ గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సిఎం గుర్తు చేశారు. విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాదని, సమాజం,మానవత్వం కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ సంకల్పమన్నారు. రాష్ట్రంలోని ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలకు ఐఎస్‌బిలో ఐదు రోజుల పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించాలని నిర్వాహకులను భట్టి కోరారు. ఈ కార్యక్రమంలో మోతిలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com